


సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 362

శనివారం 23-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 362

శనివారం 23-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




చెన్నై జోరు షురూ

ఐపీఎల్ తొలి పోరులో ఘన విజయం
6 వికెట్లతో బెంగళూరు ఓటమి - 11లో



హిందుస్తాన్ జింక్ విభజనకు నో

'వేదాంతా' ప్రతిపాదనను తిరస్కరించిన మైన్స్ సెక్రటరీ కాంతారావు - 11లో



ప్రధానికి అరుదైన గౌరవం

భూటాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీకి 45 కి.మీ మేర రోడ్డుకిరువైపులా ప్రజలు నిలబడి స్వాగతం పలికారు.

వివరాలు 6లో ▸



ఈడీ కస్టడీకి కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను 6 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగిస్తూ రౌస్‌అవెన్యూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

వివరాలు 6లో ▸



ఒడిశాలో ఒంటరిగానే...

ఒడిశాలో జరగబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే బరిలో దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ తెలిపింది.

వివరాలు 6లో ▸



'హెచ్‌-1బీ' గడువు పొడిగింపు

హెచ్‌-1బీ వీసా నమోదు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

వివరాలు 6లో ▸

'మత్తు' చుట్టూ చుట్టాలే

సంధ్యా ఆక్వా యాజమాని కోటయ్య చౌదరి టీడీపీ పెద్దలకు సన్నిహితుడు

దామచర్ల, రాయపాటి, లావు కుటుంబాలతో అత్యంత సాన్నిహిత్యం

ఆలపాటితో వ్యాపార బంధం

బాలయ్య చిన్నల్లుడు భరత్ కుటుంబంతో దోస్తీ

పురందేశ్వరి కుటుంబంతో వ్యాపారం, స్నేహం..

దామచర్ల సత్య.. నారా లోకేష్‌కు ముఖ్య అనుచరుడు

పొత్తు భరోసాతోనే డ్రగ్స్ దందాకు బరితెగింపు

ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ సంధ్యా ఆక్వా పాత్ర

డ్రగ్స్ దందాపై పచ్చ మీడియా దుష్ప్రచారం

సమగ్ర విచారణకు వైఎస్సార్‌సీపీ డిమాండ్. సీఈసీ, సీబీఐకి నివేదన



సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, ఒంగోలు/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/ పిఠాపురం/ చీరాల/ విశాఖ సిటీ/ సాక్షి ప్రతినిధి,గుంటూరు: విశాఖలో బట్టబయలైన డ్రగ్స్ దందాలో వేళ్లన్నీ టీడీపీవైపే చూపుతున్నాయి. బ్రెజిల్ నుంచి విశాఖ పోర్టుకు భారీగా డ్రగ్స్‌ను దిగుమతి చేసిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, అధిపతి కూనం కోటయ్య చౌదరి టీడీపీలో ప్రముఖులైన నారా, నందమూరి, రాయపాటి, ఆలపాటి, దామచర్ల, లావు కుటుంబాలకు అత్యంత సన్నిహితులన్నది బహిర్గతమైంది. డ్రగ్స్ మాఫియా బండారం బట్టబయలు కావడంతో బెంబేలెత్తిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారానికి దిగి విషయాన్ని పక్కదారి పట్టించాలని కుట్ర పన్నారు. ఈ అంకంలో భాగంగా ఒక పక్క సీబీఐ అధికారుల సోదాలు కొనసాగుతుండగానే గురువారం రాత్రే చంద్రబాబు, లోకేశ్ వరుస ట్వీట్లు చేస్తూ టీడీపీ శ్రేణులతో పాటు టీడీపీ అనుకూల మీడియాకు సంకేతాలు ఇచ్చారు. ఆ వెంటనే టీడీపీ అనుకూల మీడియా అవాస్తవాలు, అభూత కల్పనలు జోడిస్తూ దుష్ప్రచారానికి తెరతీసింది. తద్వారా డ్రగ్స్ దందా వెనుక తాము ఉన్నామనే విషయాన్ని కప్పిపుచ్చవచ్చని

మిగతా 3వ పేజీలో ▶

తప్పు చేసి మాపై నిందలా?



- విశాఖలో పట్టుబడ్డ డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదే: సజ్జల
- పురందేశ్వరి కుమారుడు సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో భాగస్వామి
- డ్రగ్స్ వెనుక చంద్రబాబు, పురందేశ్వరి గ్యాంగ్‌లు

3లో

డ్రగ్స్ తెచ్చింది మీ చుట్టాలే



- చంద్రబాబు, లోకేశ్‌లపై పేర్ని నాని ధ్వజం
- నాడు ఓటుకు నోటు.. నేడు ఓటు కోసం డ్రగ్స్
- డ్రగ్స్ రాకెట్‌లో టీడీపీ నేతల సన్నిహితుల పాత్రపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

3లో

స్నిఫర్ డాగ్స్ అడిగారు.. పంపాం



- డ్రగ్స్ కేసును సీబీఐ విచారిస్తోంది.. అది మా పరిధి కాదు.. స్థానిక అధికారుల వల్ల జాప్యం జరిగిందనడం అవాస్తవం
- సీబీఐ వాడింది సాంకేతిక పదాలే: విశాఖ సీపీ డాక్టర్ రవిశంకర్ వెల్లడి

3లో

కాంగ్రెస్ ఖాతాలోకి సీఎం రమేశ్ రూ.30 కోట్లు..



2019లో ఓడిన వెంటనే సీఎం రమేశ్‌ను బీజేపీలోకి పంపిన బాబు

ఆయన ద్వారానే 2023లో కాంగ్రెస్‌కు రూ.30 కోట్ల నిధులు

నిధులు అందాకే షర్మిల పార్టీ విలీనం; ఏపీ పీసీసీకి నియామకం

ఆది నుంచీ జగన్ టార్గెట్‌గానే విమర్శలు; ఇప్పుడు కడపలో పోటీ కూడా?

పీకే, షర్మిల, పవన్ సహా బాబు బ్యాచ్ మొత్తానికి ప్రత్యేక విమానం కూడా రమేశ్‌దే

కుట్రలలో తన రికార్డులను తానే బద్దలుగొడుతున్న నారా వారు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ... కాంగ్రెస్ వేరు వేరు కాదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను చంద్రబాబు నాయుడే డబ్బులిచ్చి మరీ నడిపిస్తున్నారని మరోసారి స్పష్టంగా ఆధారాలతో సహా బయటపడింది. అవసరాల కోసం, కేసుల నుంచి రక్షణ కోసం చంద్రబాబు ప్రస్తుతం బీజేపీతో పొత్తు పెట్టుకున్నా.. అధికారికంగా జనసేనతోను, అనధికారికంగా కాంగ్రెస్‌తోను అంటకాగుతూనే ఉన్నారని స్పష్టంగా వెల్లడయింది. ఇందుకోసం చంద్రబాబు తన నమ్మిన బంటు సీఎం రమేశ్ ద్వారా... కాంగ్రెస్ పార్టీకి భారీ ప్యాకేజీ అందజేసినట్లు నేరుగా ఎలక్టొరల్ బాండ్లే వెల్లడించాయి. అది కూడా తెలంగాణలోను, కాంగ్రెస్‌లోను ఎన్నికలకు ముందు ఏకంగా 30 కోట్ల రూపాయలను అధికారికంగా పార్టీ ఫండ్ కింద చంద్రబాబు నాయుడు పంపించినట్లు వెల్లడయింది. ఇక అనధికారికంగా ఎంత ముట్టజెప్పారన్నది ఊహించటం కష్టమే. వీటన్నిటికీ తోడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఎలా మోశారో... కాంగ్రెస్ కోసం తన పార్టీని ఎన్నికల్లో పోటీ చేయించకుండా ఎలా కట్టడి చేశారో తెలియనివేమీ కావు. నిజానికి కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ ఇప్పుడు బీజేపీలో ఉన్నా... నూటికి నూరుపాళ్లూ తెలుగుదేశం మనిషి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆయన

మిగతా 8వ పేజీలో ▶

రష్యాలో భారీ ఉగ్రదాడి

- మాస్కోలోని ఓ కాన్సర్ట్ హాల్‌లో కాల్పులు జరిపిన దుండగులు
- 40 మంది మృత్యువాత



ఘటనాస్థలి వద్ద ఎగిసిపడుతున్న మంటలు

మాస్కో: రష్యా రాజధానిలో శుక్రవారం రాత్రి ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. మాస్కోలోని క్రోకస్ సిటీ కాన్సర్ట్ హాల్లోకి చొచ్చుకుని వచ్చిన పలువురు సాయుధులు బాంబులు విసురుతూ, తుపాకులతో అక్కడున్న వారిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 40 మంది మృతి చెందగా, 100 మందికిపైగా గాయపడినట్లు రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ వెల్లడించింది. ఈ భవనంలో ఇంకా వందమందికి పైగానే చిక్కుకున్నట్లు సమాచారం. టోపీలు ధరించిన నలుగురు సాయుధులు అక్కడున్న వారిపై అతి సమీపం నుంచి తుపాకులతో కాల్పులు జరిపిన వీడియోలు బయటికొచ్చాయి. ఈ ఘటనపై ఇన్వెస్టిగేటివ్ సంస్థ విచారణ ప్రారంభించింది. ఈ దాడికి పాల్పడింది ఎవరో ఇప్పటిదాకా బాధ్యత వహించలేదు. పుతిన్ దేశాధ్యక్షుడిగా తిరిగి ఎన్నికై సంబరాలు జరుపుకుంటున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. రెండు దశాబ్దాల తర్వాత దేశంలో జరిగిన అతిపెద్ద ఉగ్రదాడి ఇదే అని చెబుతున్నారు.

టీడీపీలో ఆగ్రహ జ్వాల

టికెట్ల కేటాయింపుపై భగ్గుమన్న నిరసనలు

- పార్టీ జెండాలు, కరపత్రాలు కాల్చివేత
- చంద్రబాబు, లోకేశ్ ఫొటోలు దహనం
- ఏలూరుజిల్లా కామవరపుకోటలో టైర్లకు నిప్పు
- శ్రీకాకుళం, పాతపట్నం, ఎస్‌కోటలో నాయకుల తిరుగుబాటు.. పలువురి నాయకుల రాజీనామా
- ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగాలని యోచన
- సత్యవేడులో ఆదిమూలంను మార్చాలని కేడర్ డిమాండ్

8లో



శ్రీకాకుళంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి టికెట్ ప్రకటించకపోవడంతో ఆమె ఇంటి వద్ద టీడీపీ జెండాలకు నిప్పంటిస్తున్న పార్టీ కార్యకర్తలు

టీడీపీ మూడో జాబితా విడుదల

11 ఎమ్మెల్యే, 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను వెల్లడించిన చంద్రబాబు

ఎంపీ సీట్లలోనూ బీసీలకు అరకొరే

ప్రకటించిన 13 సీట్లలో ఆరు ఓసీలకే.. కేవలం నాలుగు మాత్రమే బీసీలకు

ఎమ్మెల్యే సీట్లలోనూ బీసీలకు అన్యాయం

టీడీపీలో కనపడని సామాజిక న్యాయం

7లో

ఔను.. పుష్ప అంటే ఫ్లవరే!

కమలం పార్టీలో అసలైన బీజేపీ నేతలకు సీట్లు దక్కకుండా బాబు పావులు



బీజేపీకి ఇచ్చిన సీట్లలో టీడీపీ నేతలు పోటీకి ఏర్పాట్లు.. దాదాపు అన్ని సీట్లు బీజేపీలోని తన అనుంగులకే దక్కేలా వ్యూహం

సహకరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి!.. ఎక్కడ కుదిరితే అక్కడ పోటీకి సిద్ధమవుతున్న బాబు మనుషులు

రాయలసీమ నాయకులకు ఉత్తరాంధ్రలో సీట్లు

పురందేశ్వరి సహా పలువురు జిల్లాల సరిహద్దులు దాటి పోటీకి యత్నాలు

బాబు ఆటలో జీవీఎల్, సోము వీర్రాజుకు కూడా దక్కని టికెట్లు

తీవ్ర ఆవేదనలో అసలైన బీజేపీ నాయకులు

7లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వృద్ధాప్యంలో సొంతింటి యోగం

మా స్వస్థలం ఒడిశా. 20 ఏళ్ల క్రితం బతుకు తెరువు కోసం విశాఖ జిల్లా ఆనందపురం ప్రాంతానికి ఇద్దరు పిల్లలతో వలస వచ్చాం. అప్పటికే పిల్లలు చదువుకునేవారు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ లే అవుట్‌లో పని చేస్తూ అక్కడ ఉండే రేకుల షెడ్డులో కుటుంబమంతా నివసించేవాళ్లం. ఏళ్లు గడిచిపోతున్నా, పిల్లలు పెద్ద వారవుతున్నా సొంతిల్లు లేక చాలా ఇబ్బందిగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు ఉంటేనే ఇల్లు మంజూరు చేసేవారు. నెలల తరబడి తిరిగితే ఎట్టకేలకు రేషన్ కార్డు ఇచ్చారు. అది పట్టుకొని కాలనీ ఇంటి కోసం సంవత్సరాల తరబడి రెవెన్యూ కార్యాలయం, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగినా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలపడంతో సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోగా మొదటి విడతలోనే ఎవరి సిఫార్సు లేకుండా పప్పలవానిపాలెంలో ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి ఆర్థిక



సాయం కూడా అందించారు. దాంతో నిర్మాణం పూర్తి చేసుకొని సొంతింట్లో ఉంటున్నాము. ఇద్దరు మగ పిల్లలు వివాహాలు చేసుకొని వేరే కాపురాలు పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మా ఆయన రామకృష్ణకు వృద్ధాప్య పింఛన్ ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చారు. సొంత గూడు సమకూరడం, నెలానెలా రేషన్ బియ్యం ఇంటికే తెచ్చి ఇస్తుండడంతో నేను, నా భర్త ఎటువంటి చింత లేకుండా హాయిగా జీవిస్తున్నాం. పెద్దకొడుకులా ఆదుకున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– మేనవల్లి విజయకుమారి, పప్పలవానిపాలెం

(మహంతి శివాజీ, విలేకరి ఆనందపురం)

ఆపదలో ఆదుకున్న సర్కారు

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. కర్నూలు జిల్లా కోసిగి మండలం జంపాపురంలో ఉంటున్న మాకు ఎకరన్నర పొలం ఉంది. అందులో పంటలు దైవాదీనం. కుటుంబ పోషణ కోసం మా ఆయన పింజరి మహ్మద్‌తో కలిసి పొలం పనులతోపాటు తీరిక సమయాల్లో కూలి పనులకు వెళుతుండేదాన్ని. మాకు ఇద్దరు కుమార్తెలు రహీమా బీ, సహేరా బీ. కుమారుడు ఉస్మాన్ గని. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల అష్టకష్టాలు పడి రహీమా బీని బీఈడీ వరకు చదివించి పెళ్లి చేశాం. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక అప్పులతో సతమతమయ్యాం. గత ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత షాదీ తోఫా కింద రూ.లక్ష మంజూరైంది. రెండో కుమార్తె ఇంటర్మీడియట్ వరకు చదువుకోవడంతో గ్రామంలోనే వలంటీర్‌గా అవకాశం వచ్చింది. ఉస్మాన్ గని విద్యా దీవెన, వసతి దీవెన వర్తించడంతో డిగ్రీ పూర్తయింది. నేను 2021లో రోడ్డు ప్రమాదానికి గురై



గాయపడడంతో ఉచితంగా ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేశారు. రైతు భరోసా కింద ఏటా రూ.15 వేలు, వైఎస్సార్ చేయూత కింద రూ.18,750, వైఎస్సార్ ఆసరా కింద రూ.15 వేలు వచ్చింది. నాన్న బషీర్ అహ్మద్‌కు పింఛన్ వస్తోంది. ఈ సాయంతో ప్రస్తుతం ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. జగనన్న కాలనీలో ఇంటి పట్టా అందింది. ఇంతకన్నా మాకేమి కావాలి? ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– హసీనా బీ, జంపాపురం

(నీలి ఈరేష్, విలేకరి, కోసిగి)

సొంతింట్లో హాయిగా జీవిస్తున్నాం

మాది వ్యవసాయ కుటుంబం. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉర్లాం దగ్గరి బడ్డవానిపేటకు చెందిన మాకు సొంత భూమి లేకున్నా... కౌలుకు పొలం తీసుకుని సాగు చేస్తున్నాం. పరిస్థితులు అనుకూలిస్తే పంట దిగుబడి వచ్చేది. లేకుంటే పెట్టుబడులు నష్టపోయి అప్పుల పాలయ్యేవాళ్లం. తప్పనిసరి పరిస్థితుల్లో ఆటో తిప్పుతూ బతుకుబండి ఈడుస్తున్నాం. మాకు వివాహమై 20 ఏళ్లు అవుతోంది. కొన్నాళ్లు ఉమ్మడి కుటుంబంగా ఉన్నాం. పిల్లలు పుట్టారు. కుటుంబం పెరిగింది. తర్వాత వేరే కాపురం పెట్టాల్సి వచ్చింది. పూరింట్లో చాలీ చాలని గదుల్లో ఇన్నాళ్లూ నెట్టుకొచ్చాం. సొంత ఇంటి కోసం అనేక ప్రయత్నాలు చేశాం. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్లావేళ్లా పడ్డాం. ఎవరూ కరగలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మేము నివసిస్తున్న గ్రామంలోనే రోడ్డుకు ఆనుకొని ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం కింద రూ.1.80 లక్షలు వచ్చింది. నాకు వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.40 వేలు వచ్చింది. ఆ మొత్తాన్ని ఇంటి పనుల కోసం వినియోగించాం. ఇంకా పూర్తి స్థాయిలో ఇంటి పని పూర్తి



కాకపోయినా ఇంట్లో గచ్చులు వేయించుకొని, వ్రతం చేసి ఇంట్లో దిగిపోయాం. ఇన్నాళ్లకు మా కల నెరవేరింది. చాలా ఆనందంగా ఉంది. మా అమ్మాయికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వంతున వచ్చింది. అబ్బాయి డిగ్రీ చదువుతున్నాడు. వాడికి జగనన్న విద్యా దీవెన పథకం వర్తించింది. మా ఆయన దాలిరాజుకు వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు వంతున వచ్చింది. మేము ఈ రోజు సొంతిల్లు సమకూర్చుకోగలిగామంటే దానికి కారణం జగనన్నే. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– దుర్రు లక్ష్మి, బడ్డవానిపేట

(మామిడి రవి, విలేకరి, నరసన్నపేట)

శాంతిభద్రతల నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి..

- నిఘాను పటిష్టపర్చండి
- రాజకీయ పార్టీల కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల ఆప్షన్ మేరకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా తనిఖీలు, ఆస్తుల జప్తు జరుగుతున్న విధానంపై కేంద్ర ఎన్నికల సంఘం ఏప్రిల్ 3న సీఎస్, డీజీపీలతో సమీక్ష నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృత స్థాయిలో మెరుగు పర్చాల్సిందిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరును సమీక్షించారు. సీజర్ అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను అప్రమత్తం చేయాలని, జిల్లా పరిధుల్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘాను పటిష్టపర్చాలన్నారు. ప్రతి సరిహద్దు చెక్ పోస్టు వద్ద కనీసం ఒక కెమేరాతో స్టాటిక్ సర్వలెన్స్ టీమ్‌ను ఉంచాలని చెప్పారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం నిత్యావసర సేవల్లో ఉండే 33 విభాగాలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు. వీటిలో ముఖ్యంగా పోలీస్, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర శాఖలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగులకు వారి విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉందని ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. అయితే నేరుగా గానీ, ఎన్కోర్ పోర్టల్ ద్వారా గానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి దుర్ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ ఘటనలకు సంబంధించిన వాస్తవ నివేదికను వెంటనే తమకు పంపాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-7, వివరాలు సరిదిద్దేందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-8లను చట్టబద్ధమైన విధానంలో ఈ నెల 26లోపు పరిష్కరించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రోజూ తొమ్మిది నివేదికలను భారత ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ఈ నివేదికలు పంపే విషయంలో ఏమాత్రం అలక్ష్యం వహించొద్దన్నారు. సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎం.ఎన్ హరేంధిరప్రసాద్, జాయింట్ సీఈవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈవోలు కె.విశ్వేశ్వరరావు, మల్లిబాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు మణిహారం

రూ.24 కోట్లతో మినీ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి



వాహనాల రాకపోకలకు సిద్ధమైన ఫ్లైఓవర్‌పై రెండు లేన్ల రహదారి

గన్నవరం: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై కేసరపల్లి వద్ద నిర్మించిన మినీ ఫ్లైఓవర్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)కు మణిహారంలా నిలుస్తోంది. సుమారు రూ. 24 కోట్లతో చేపట్టిన ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో త్వరలో వాహనాల రాకపోకలకు అనుమతించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేసరపల్లి నుంచి ఎయిర్‌పోర్టు వరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎన్‌హెచ్‌ఏఐ ఈ మినీ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. 1,400 మీటర్లు పొడవైన ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు రెండేళ్ల కిందట ప్రారంభించారు. ఫ్లైఓవర్ వల్ల విమానాశ్రయానికి రాకపోకలు సాగించే వాహనాలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఎయిర్‌పోర్ట్‌కు వీవీపీలు వచ్చి వెళ్లే సమయంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పడనుంది.

చెక్ పోస్టుల వద్ద అవినీతికి అడ్డుకట్ట

- అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల తొలగింపు
- వాటి వద్ద లంచాల దందాకు ముగింపు
- రవాణా శాఖ సేవలన్నీ ఆన్‌లైన్
- అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే జారీ
- రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం



సాక్షి, అమరావతి: 'సరుకు రవాణా వాహనాలు రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశిస్తే చాలు.. అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద నిలపాలి.. అనుమతులు తీసుకోవాలి.. అందుకోసం లంచాలు ఇవ్వాలి'. ఇదీ దశాబ్దాలుగా సరిహద్దుల్లో కనిపించే సాధారణ దృశ్యం. ఇటువంటి వాటికి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సరిహద్దుల్లో చెక్ పోస్టుల వద్ద లంచాల బెడదను శాశ్వతంగా నిర్మూలించింది. రవాణా శాఖ అందించే అన్ని రకాల సేవలు, అనుమతుల జారీని ఆన్‌లైన్ విధానంలోకి మార్చింది. అంతేకాదు రాష్ట్రంలోని 15 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను శాశ్వతంగా తొలగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది.

అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే..

రాష్ట్రంలో దశాబ్దాల నుంచి 15 రవాణా శాఖ చెక్ పోస్టులున్నాయి. వాటిలో 13 రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయి. మిగిలిన రెండింటిలో ఒకటి తిరుపతి జిల్లా రేణిగుంటలోనూ, మరొకటి కాకినాడ జిల్లా తేటగుంటలోను ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఏపీలోకి ప్రవేశించే వాహనాల నుంచి పన్ను వసూలు, తాత్కాలిక పర్మిట్ జారీలతోపాటు మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలను అరికట్టేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఈ అనుమతుల జారీ పేరుతో అక్కడి సిబ్బంది లంచాలు డిమాండ్ చేయడం సర్వసాధారణంగా మారింది. దీంతో ఈ విధానాన్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద అందించే సేవలు, అనుమతులను గతేడాది జూలై నుంచి ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టడంతో రవాణా శాఖ కార్యాలయాలు, అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్దకు వచ్చే వాహనదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సులభంగా, పారదర్శకంగా అనుమతులు జారీ అవుతున్నాయి. ఆన్‌లైన్ విధానం లేని 2022–23లో వివిధ అనుమతుల జారీ కింద మొత్తం రూ.51.64 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టాక 2023 జూలై నుంచి 2024 ఫిబ్రవరి వరకు వివిధ అనుమతుల జారీ కింద రూ.62.82 కోట్లు రావడం గమనార్హం. గతంలో అధికారిక అనుమతులు లేకుండా లంచాలు తీసుకుని మరీ వాహనాల ప్రవేశానికి అనుమతించేవారన్నది స్పష్టమవుతోంది. ఆన్‌లైన్ విధానం సరుకు రవాణా వాహనదారులకు సౌలభ్యంగా ఉండటంతోపాటు ప్రభుత్వ ఖజానాకు రాబడిని పెంచింది.

ప్రయోజనాలు ఇవీ...


- సరుకు రవాణా వాహనాలను ఇక రాష్ట్ర సరిహద్దుల్లో అనుమతుల కోసం నిలపాల్సిన అవసరం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.
- ప్రస్తుతం సరుకు రవాణా వాహనాలు సగటున గంటకు 35 కి.మీ.మేర ప్రయాణిస్తున్నాయి. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు తొలగించడంతో సగటున గంటకు 55 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి.
- ప్రస్తుతం దేశంలో సరుకు రవాణా వాహనాలు రోజుకు సగటున 360 కి.మీ. ప్రయాణిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో రోజుకు సగటున 1,200 కి.మీ. ప్రయాణిస్తున్నాయి. ప్రస్తుతం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు తొలగించడంతో రాష్ట్రంలో రోజుకు సగటున 550 కి.మీ. దూరం ప్రయాణించేందుకు అవకాశం కలుగుతుంది. దీంతో త్వరగా గమ్యస్థానానికి చేరుకోవడంతోపాటు సరుకు రవాణా వ్యయం తగ్గుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు..

1. పురుషోత్తమపురం	(శ్రీకాకుళం జిల్లా)
2. చట్టీ	(అల్లూరి సీతారామరాజు జిల్లా)
3. జీలుగుమల్లి	(ఏలూరు జిల్లా)
4. తిరువూరు	(ఎన్టీఆర్ జిల్లా)
5. గరికపాడు	(ఎన్టీఆర్ జిల్లా)
6. దాచేపల్లి	(పల్నాడు జిల్లా)
7. మాచర్ల	(పల్నాడు జిల్లా)
8. బీవీ పాలెం, తడ	(తిరుపతి జిల్లా)
9. రేణిగుంట	(తిరుపతి జిల్లా)
10. సున్నిపేట	(నంద్యాల జిల్లా)
11. పంచలింగాల	(కర్నూలు జిల్లా)
12. పలమనేరు	(చిత్తూరు జిల్లా)
13. నరహరిపేట	(చిత్తూరు జిల్లా)
14. పెనుగొండ	(శ్రీసత్యసాయి జిల్లా)
15. తేటగుంట	(కాకినాడ జిల్లా)

తాగు నీటి కొరత ఉండకూడదు

- పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు కల్పించాలి
- ఉదయం 5.30 నుంచి 10.30 వరకే ఉపాధి పనులు
- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యంగా కరువు మండలాల్లో తాగు నీటి కొరత రాకుండా, ఉపాధి హామీ పనులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు, తాగు నీటి సరఫరాపై ఆయన శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఎన్టీఆర్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, నెల్లూరు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ జూన్ నెలాఖరు వరకు కరువు మండలాల్లో తాగు నీటి కొరత లేకుండా చూడాలని, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పించాలని ఆదేశించారు. ఎండలు పెరుగుతున్నందున ఉపాధి పనులను ఉదయం 5.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించాలని చెప్పారు.

వీటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

80 శాతం పైగా పనులు పూర్తయిన మంచినీటి పథకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సీఎస్ ఆదేశించారు. వీటికి నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. మల్టీ విలేజి, సింగిల్ విలేజి మంచి నీటి సరఫరా పథకాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, చిన్నపాటి మరమ్మతులను వెంటనే చేయించాలని చెప్పారు. కరువు మండలాల్లోని సమ్మర్ స్టోరేజి ట్యాంకులన్నింటికీ సమీప నీటి వనరుల ద్వారా నీటిని మళ్లించాలన్నారు. భూగర్భ జల మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు రోజూ ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయాలని చెప్పారు. ఇందుకోసం ఎస్‌వోపీ రూపొందించాలన్నారు. అవసరమైన చోట ప్రైవేటు బోర్లను అద్దెకు తీసుకోవాలన్నారు. తాగునీటిని దుర్వినియోగం కాకూడదని. దీనిపై దీనిపై సోషల్ మీడియా, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. అవసరానికి మించి నీటిని నిల్వ చేయడం, కుళాయిల ద్వారా వృధాగా వదిలి వేయడం లేదా తాగునీటి యేతర అవసరాలకు వాడటం వంటి వాటిని అరికట్టాలన్నారు.

మంచి నీటి ట్యాంకర్లకు జియో ట్యాగింగ్

రాష్ట్ర జల వనరులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ కరువు మండలాల్లో వచ్చే వారంనాటికి సమ్మర్ స్టోరేజి ట్యాంకులు, మంచి నీటి వనరుల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు. మంచి నీటి ట్యాకర్లకు జియో ట్యాగింగ్ చేసి పర్యవేక్షిస్తామని తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కె.కన్నబాబు, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసు నిందితులు చంద్రబాబు ఆప్తులే

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట): విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ కంటైనర్ కేసులో నిందితులు చంద్రబాబు ఆప్తులేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అక్రమ మైనింగ్, క్వార్ట్జ్‌లపై నోటికి వచ్చినట్లు మాట్లాడే సోమిరెడ్డి సీబీఐ విచారణకు సిద్ధమా... అని ప్రశ్నించారు. సైదాపురం క్వార్ట్జ్‌లో వాటాలు పంచుకున్నది వాస్తవం కాదా.. అని నిలదీశారు. పొదలకూరులో రూ.500 కోట్ల విలువైన తెల్లరాయిని తవ్వి స్టాక్ చేశామని సోమిరెడ్డి ఆరోపించారని, రూ.5 కోట్లు చెల్లిస్తే ఆ స్టాక్‌ను అప్పజెప్పేందుకు అంగీకరించాలని ఎన్నికల సంఘాన్ని కోరతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నీరు చెట్టు, రైతు రథం, యాష్ పాండ్ల ద్వారా దోచుకుని యాష్ పాండియన్‌గా సోమిరెడ్డి పేరు తెచ్చుకున్నారని చెప్పారు. సోమిరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే క్వార్ట్జ్ మైనింగ్‌పై సీబీఐ విచారణ కోరాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసి దళారుల రాజ్యాన్ని పెంచి పోషించిందని విమర్శించారు.



కాంట్రాక్టుపై రామోజీ విషం

కాంట్రాక్టు ఉద్యోగులను కనికరించని చంద్రబాబు.. బాబును నిలేయని రామోజీ

ఐదేళ్ల చంద్రబాబు పాలన అంతా వంచన మయం.. కుట్రపూరితం... కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ పైనా మాట తప్పిన అబద్ధాల కోరు చంద్రబాబు. ఈ నిజం రాయడానికి రామోజీకి మనసొప్పదు. మంచి చేయాలనే మనసుంటే మార్గముంటుందని జగన్ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల విషయంలో నిరూపించుకుంది. తాను అధికారంలోకి వచ్చిన తర్వాతే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే పుణ్యం కట్టుకుంది. సుప్రీం కోర్టు తీర్పు సాకును వెతుక్కుని కాంట్రాక్టు ఉద్యోగులను చంద్రబాబు వంచిస్తే... పదివేల మంది నెత్తిన క్రమబద్ధీకరణ పాలు పోస్తున్న నేత సీఎం జగన్. తన శిష్యుడు బాబు చేసిన మోసం రాష్ట్రం మొత్తం తెలిసినా, రామోజీ ఒక్కరే తెలియనట్లు నటిస్తారు. కాంట్రాక్టు ఉద్యోగులకు మంచి జరిగిపోతే ఆ ఖ్యాతి జగన్ ప్రభుత్వానికి దక్కడం రామోజీకి సుతరామూ ఇష్టం లేదు. ఈ దుర్గతోనే తప్పుడు రాతలు రాస్తూ ప్రభుత్వంపై అక్షర విషాన్ని విరజిమ్ముతూనే ఉన్నారు.. ఈ అక్షర మాయావి ఎంతగా బాబును మోయాలనుకున్నా బాబు చేసిన పాపాలు జనానికి ఐదేళ్ల కిందటే తేటతెల్లమయ్యాయి... టీడీపీని శంకరగిరి మాన్యాలు పట్టించాయి.. ఇదంతా తెలిసినా తన తప్పుడు రాతలతో రోజురోజుకూ రామోజీ దిగజారిపోతూనే ఉన్నారు..

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించకుండా మోసం చేసింది మీ చంద్రబాబు నాయుడేనని తెలుసుకోవాలి రామోజీ..గత చరిత్రను వదిలేసి ఇప్పుడు ఈనాడు కళ్లు మూసుకుని ఇష్టానుసారం రాతలు రాస్తే చెల్లదు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం క్రమబద్ధీకరణ పేరిట కాలక్షేపానికి మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సమావేశాలతో కాలయాపన చేసి చివరికి సుప్రీం కోర్టు తీర్పు అడ్డొస్తోందని, అందువల్ల సాధ్యం కాదంటూ కాంట్రాక్టు ఉద్యోగులను నిలువునా వంచించింది చంద్రబాబు నాయుడే. ఇవే మీ ఈనాడు రామోజీకి అప్పట్లో కనిపించలేదు.

దీనికి భిన్నంగా వైఎస్.జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేస్తూ నిర్ణయం తీసుకుని అమలు చేస్తుంటే ఈనాడు రామోజీ తప్పుపట్టడాన్ని ఉద్యోగులే జీర్ణించుకోలేకపోతున్నారు. ఈనాడు చెత్తరాతలంటూ వారు మండిపడుతున్నారు. నిబంధనల పేరుతో అర్హులను తగ్గిస్తున్నారంటూ మరో అవాస్తవ ప్రచారానికి రామోజీ దిగజారారు. ప్రభుత్వంలో రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు వంటివి పాటిస్తూనే కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరిస్తారు. రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు పాటించకపోవడానికి ఇదేమీ రామోజీ సొంత జాగీరు కాదు. ఈ మాత్రం కనీస అవగాహన లేకుండా ఈనాడు తన అజ్ఞానాన్ని బయటపెట్టుకుంది. వాస్తవానికి ఐదేళ్లు నిద్రపోయి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ సాధ్యం కాదని చెప్పింది మీ చంద్రబాబు నాయుడే రామోజీ. మంజూరైన పోస్టుల్లో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండాలనే నిబంధన ఇప్పుడు వైఎస్.జగన్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిందేమీ కాదు. టీడీపీ ఆవిర్భావం చక ముందు నుంచే కాకుండా, బాబు ప్రభుత్వంలోనూ ఉంది. అయినా చంద్రబాబుకు చేతకాని పనిని జగన్ ప్రభుత్వం చేసి చూపించి, కాంట్రాక్టు ఉద్యోగుల నెత్తిన పాలు పోసింది. అందుకే బాబును నమ్మం గాక నమ్మం ... అని 2019లో టీడీపీని చిత్తుగా ఓడించి, ఉద్యోగులు ఇంటి బాట పట్టించారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట మేరకు అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి ఆర్థిక శాఖ చర్యలను చేపట్టింది. ఎన్నికల కోడ్ కన్నా ముందే క్రమబద్ధీకరణ ప్రారంభమైంది. తదనుగుణంగా మార్గదర్శకాలను 13-12-2023న సర్క్యులర్ మెమో ద్వారా విడుదల చేసింది. క్రమబద్ధీకరణ కోసం రూపొందించిన సాఫ్ట్ వేర్‌లో ఉద్యోగులు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాల్సిందిగా స్పష్టం చేసింది. అర్హులైన సుమారు పది వేల మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు జగన్ ప్రభుత్వం చర్యలను చేపట్టింది. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖలో 3000 మందిని క్రమబద్ధీకరించారు. మిగతా వారికి అవకాశమిచ్చే క్రమంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. మాట ఇస్తే మడమ తిప్పరనే నమ్మకం ఉన్నందునే మళ్లీ జగన్‌ను సీఎంను చేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు.

ఇదీ జగన్ క్రమబద్ధీకరణ



బాబు సర్కారుకు - జగన్ సర్కారుకు తేడా..

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ఆర్థిక, మానవ వనరులు, ఆరోగ్య, ఐటీ శాఖల మంత్రులతో 09-09-2014న జీవో 3080 ద్వారా ఒక బృందాన్ని బాబు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ ఐదేళ్ల పాలనలో మంత్రుల బృందం సమావేశాలతో సాగదీయడమే కాకుండా చివరగా సుప్రీం కోర్టు తీర్పును బూచిగా చూపించి, క్రమబద్ధీకరణ సాధ్యం కాదంటూ చేతులెత్తేసి, ఇచ్చిన మాటను తప్పింది.

ఇప్పుడు జగన్ సర్కారు

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యాయపరమైన, చట్టపరమైన చిక్కులను అధిగమించి కాంట్రాక్టు ఉద్యోగులను వైఎస్ జగన్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వివిధ శాఖల్లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను వారి అర్హత, సర్వీసును పరిగణనలోకి తీసుకుని వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేస్తాం' అని జగన్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ మేరకు అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం సుదీర్ఘ కసరత్తు చేసింది. మంత్రుల కమిటీతో పాటు సీఎస్ అధ్యక్షతన వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రుల కమిటీ, వర్కింగ్ కమిటీలు పలు సార్లు న్యాయపరమైన, చట్టపరమైన సమస్యలపై చర్చించాయి. క్రమబద్ధీకరణపై నిషేధం విధిస్తూ 1994లో చేసిన చట్టంలో సవరణలు చేయాలని ఈ కమిటీలు సూచించాయి. క్రమబద్ధీకరణకు ఎటువంటి చిక్కులు ఎదురుకాకుండా ఉండే విధంగా న్యాయపరంగా అన్ని అంశాలను జగన్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుంటూనే ఎటువంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదే గత చంద్రబాబు సర్కారుకు - ఇప్పటి వైఎస్ జగన్ సర్కారుకు తేడా.

'మత్తు' చుట్టూ చుట్టాలే

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు భావించారు. అయితే కూనం కోటయ్య చౌదరితో టీడీపీ నేతల వ్యాపార బంధం వెలుగు చూడటంతో బాబు కుట్ర బెడిసికొట్టింది. చంద్రబాబు వదిన, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబంతో కూనం కుటుంబానికి ఉన్న వ్యాపార బంధం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. రాయపాటి, దామచర్ల, లావు కుటుంబ సభ్యులతో కూనం కోటయ్య చౌదరి కలిసి ఉన్న ఫొటోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూనం వీరభద్ర చౌదరితో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజాకు ఉన్న బంధాన్ని రుజువు చేసే వ్యాపార లావాదేవీల పత్రాలు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.



మూలపేటలోని సంధ్యా ఆక్వా కంపెనీలో తనిఖీ చేస్తున్న సీబీఐ అధికారులు

కింగ్ పిన్ కోటయ్య చౌదరి..

డ్రగ్స్ దందాలో కీలక పాత్రధారులైన సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కోటయ్య చౌదరి టీడీపీ పెద్దలకు అత్యంత సన్నిహితులని ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. ఆయన సన్నిహితులు, వ్యాపార భాగస్వాముల జాబితాను చూస్తే ఆ విషయం తేలిపోతోంది. దామచర్ల సత్యం (ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ సోదరుడు), రాయపాటి జీవన్ (టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తమ్ముడు గోపాలకృష్ణ కుమారుడు), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి)లకు ఆయన అత్యంత సన్నిహితుడు. వారంతా ఓ కోటరీగా ఏర్పడి పెద్ద ఎత్తున వ్యవహారాలు సాగించారన్నది వెల్లడైంది. వారు విదేశాల్లో అత్యంత సన్నిహితంగా తిరిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దామచర్ల సత్య టీడీపీ నేత నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు. చంద్రబాబుతోనూ సాన్నిహిత్యం ఉంది. విశాఖ కేంద్రంగా వ్యవహారాలు సాగిస్తున్న సంధ్యా ఆక్వా కంపెనీకి నందమూరి కుటుంబంతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. బాలకృష్ణ చిన్నల్లుడు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కు కూనం కోటయ్య చౌదరి అత్యంత సన్నిహితుడు. ఆయన కుటుంబం సహకారంతోనే విశాఖ కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. సంధ్యా ఆక్వా కంపెనీతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబానికి వ్యాపార బంధం ఉందన్నది ఇప్పటికే బయటపడింది. పురందేశ్వరి కుమారుడు చెంచురామ్, వియ్యంకుడు భాగస్వాములుగా కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరి ఆక్వా వ్యాపారాన్ని ప్రారంభించారు. దీంతో డ్రగ్స్ దందాలో తీగ లాగితే చంద్రబాబు, పురందేశ్వరి కోటరీ అక్రమాల డొంకంతా కదులుతోంది.

ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ..

దేశంలో సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పాత్ర ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలో మద్యం కుంభకోణానికి పాల్పడిన సిండికేట్‌లో ఆ కంపెనీ కూడా భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ఆ కేసును కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇప్పుడు విశాఖ డ్రగ్స్ దందాను కూడా కలిపి మొత్తంగా మద్యం, డ్రగ్స్ మాఫియా గుట్టును ఛేదించే పనిలో నిమగ్నమైంది.

పొత్తుతోనే బరితెగింపు..

ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఎప్పుడో సిద్ధపడ్డారు. అందుకోసం కాళ్ల బేరానికి కూడా దిగజారతానని గతేడాదే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పొత్తును అవకాశంగా చేసుకుని భారీగా డ్రగ్స్ దందాకు పచ్చ మాఫియా బరితెగించింది. ఎన్నికల ముందు భారీగా డ్రగ్స్‌ను రాష్ట్రంలోకి తరలించేందుకు పథకం వేసింది. ఈ ఏడాది ప్రారంభంలోనే సంధ్యా ఆక్వా కంపెనీ ద్వారా బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల ఈస్ట్ దిగుమతి ముసుగులో భారీగా డ్రగ్స్‌ను చేరవేసేందుకు ప్రణాళిక రూపొందించింది. రెండు నెలల్లో డ్రగ్స్ విశాఖ చేరుకునేలా అంతా సిద్ధమైంది. అటు దగ్గుబాటి ఇటు చంద్రబాబు కుటుంబాల సహకారం ఉండటంతో తమ దందాకు అడ్డు ఉండదని భావించారు. డ్రగ్స్ మాఫియాపై అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటర్‌పోల్‌కు ఉప్పందడంతో ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయాన్ని అప్రమత్తం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారుల బృందం విశాఖ పోర్టులో నిర్వహించిన తనిఖీల్లో డ్రగ్స్ బాగోతం బట్టబయలైంది. పచ్చ కుట్ర బెడిసికొట్టింది.

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ తక్షణమే ప్రతిస్పందించింది. డ్రగ్స్ దందాతో నారా, నందమూరి, దగ్గుబాటి కుటుంబాలకు ఉన్న బంధాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. నియమావళిని ఉల్లంఘిస్తూ చంద్రబాబు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆధారాలతో నివేదించింది. దీనిపై జాతీయ ప్రెస్ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. డ్రగ్స్ దందాపై సత్వరం సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీబీఐని కోరింది.

కూనం కుటుంబం కథ...

విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన పాత్రధారులైన సంధ్యా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ అధినేతలు కూనం వీరభద్ర చౌదరి, కుమారుడు కూనం కోటయ్య చౌదరి స్వగ్రామం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి. ఆక్వా రంగంలో ఉత్థాన పతనాలను చూసిన వీరభద్ర చౌదరి డ్రగ్స్ వ్యాపారంలో కాలు మోపాడు. కాకినాడ ప్రధాన కేంద్రంగా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రీ ప్రాసెసింగ్ ప్లాంట్ల ముసుగులో అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అటు టీడీపీ ఇటు రాష్ట్ర బీజేపీ అగ్రనేతల అండదండలతో తన కార్యకలాపాలను విస్తరించాడు. కూనం కుటుంబానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సంధ్యా ఆక్వా ప్రీ ప్రాసెసింగ్ ప్లాంట్లతో పాటు ఆక్వా కల్చర్ చెరువులు కూడా ఉన్నాయి. వీరి వ్యాపార లావాదేవీలు కొండపి, ఒంగోలు, కందుకూరు, పర్చూరు నియోజకవర్గాల్లోనూ సాగుతున్నాయి. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోదరుడు దామచర్ల సత్యనారాయణ(సత్య)తో కూనం కుటుంబానికి వ్యాపార లావాదేవీలున్నాయి. టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో దామచర్ల సత్యకు చెందిన పొగాకు గోడౌన్‌లో సంధ్యా ఆక్వా పేరుతో ప్రీ ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటైంది. కూనం కుటుంబానికి విజయవాడకు చెందిన సౌమ్యుడిగా పేరున్న ఓ టీడీపీ నేతతోనూ సంబంధాలున్నట్లు సమాచారం. కోటయ్య చౌదరి, టీడీపీ నేత తనయుడు విదేశాల్లో మంచి సన్నిహితులని తెలిసింది.

కాకినాడ తీరంలో కలకలం

డ్రగ్స్ తీగ లాగితే కాకినాడ జిల్లా కొత్తపల్లి తీరంలోని మూలపేటలో డొంక కదిలింది. మూలపేటలోని సంధ్యా ఆక్వా కంపెనీలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 10 మంది సీబీఐ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో సోదాలు జరిపారు. సీబీఐ ఇన్‌స్పెక్టర్ బల్విందర్ సింగ్ ఆధ్వర్యంలో సీబీఐ బృందం ఈ తనిఖీలు చేసింది. జిల్లాలోని శంఖవరం మండలం కత్తిపూడి సమీపాన ఉన్న సంధ్యా ఆక్వా సీడ్ తయారీ కంపెనీ, కృష్ణా జిల్లా పామర్రు తదితర ప్రాంతాల్లో ఉన్న సంధ్యా ఆక్వా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెబుతున్నారు. కత్తిపూడి సమీపంలోని సంధ్యా ఆక్వా సీడ్ కంపెనీని ఇటీవలే ప్రారంభించారు. దీనిలో ఆక్వా సీడ్ తయారీకి అవసరమైన ముడి సరుకును బ్రెజిల్ నుంచి దిగుమతి చేయడంతో ఆ సరకు నౌక ద్వారా విశాఖకు కంటైనర్లలో చేరింది. వాటిలో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించిన సీబీఐ అధికారులు సంధ్య కంపెనీలన్నింటిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో మూలపేటలోని సంధ్యా ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించి మందులు, ఇతర శాంపిల్స్ సేకరించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకూ సంధ్యా ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించిన సీబీఐ అధికారులు తిరిగి సోదాలు చేస్తామని తెలిపారు.

చీరాలకు లింకు?

డ్రగ్స్ దందాకు చీరాలతో కూడా లింకులు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. సంధ్యా ఆక్వా పేరుతో వాడరేవులో రెండేళ్లుగా కంపెనీ నడుస్తోంది. దీన్ని పురందేశ్వరి అల్లుడు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. పది రోజులుగా ఈ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయని సమాచారం.

డ్రగ్స్ తెచ్చింది మీ చుట్టాలే

- బాబు, లోకేశ్‌పై పేర్ని నాని ధ్వజం



సాక్షి అమరావతి: విశాఖలో డ్రగ్స్ పట్టుబడ్డ వ్యవహారంలో చంద్రబాబు, నారా లోకేశ్ పాత్రపై క్షుణ్ణంగా విచారణ జరపాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. 'డ్రగ్స్ తెచ్చినవారు మరిదికి, వదినకి చుట్టాలైతే వారిద్దరూ వైఎస్సార్‌సీపీపై విషం చిమ్మడం ఎక్కడి న్యాయం? ఎన్నికల్లో మద్యం పంచే స్థాయి నుంచి డ్రగ్స్ పంచే స్థాయికి టీడీపీ ఎదిగిపోయిందా? ఈ ఓడ వెనుక మరో ఓడ ఉండే అవకాశంతోపాటు ఇలాంటి ఓడలు మరో మార్గంలో వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డ్రగ్స్ దందాలో బయట పడ్డ పేర్లలో ఒక్కరు కూడా రెడ్డి, కాపు లేరు. మరి మీ చుట్టాలు తెప్పిస్తే మాపై, సీఎం జగన్‌పై విషం చిమ్ముతారా?' అని పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు పేర్ని నాని, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు మలసాని మనోహర్‌రెడ్డి, మూర్తి తదితరులు శుక్రవారం కలిశారు. వైజాగ్ డ్రగ్ రాకెట్‌లో చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి, టీడీపీ నేతల కుటుంబ సభ్యుల పాత్రపై సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో అసాంఘిక శక్తులను ప్రోత్సహించేందుకే టీడీపీ నేతలు డ్రగ్స్ తరలించినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు అవాస్తవాలతో వైఎస్సార్ సీపీపై ట్వీట్ చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పేర్ని నాని మీడియాతో మాట్లాడారు.

ఓటుకు నోటు.. ఓటు కోసం డ్రగ్స్!

విశాఖలో 25 వేల కిలోల మత్తు పదార్థాలను సీబీఐ పట్టుకుంటే ఆ లావాదేవీలు జరిపిన సంస్థల వివరాలను కప్పిపుచ్చి చంద్రబాబు మా పార్టీపై విషం చిమ్మారు. సీబీఐ నోరు తెరవకుండానే చంద్రబాబు బయటపడ్డారు. చంద్రబాబు, ఆయన వదిన చుట్టాలే డ్రగ్స్ వ్యవహారంలో ఉన్నారు. చంద్రబాబు ఓట్ల కోసం డ్రగ్స్ పంచేందుకు తెచ్చారేమో అనే అనుమానాలున్నాయి. ఇందులో చంద్రబాబు, లోకేశ్ పాత్రపై విచారణ జరపాలని కోరాం. అసలు ఈ డ్రగ్స్ ఎవరు తెప్పించారో తేలాలి. విచారణ జరిపి వీటిని అరికట్టాలి. నాడు ఓటుకు నోటు.. నేడు ఓటు కోసం డ్రగ్స్! రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారతారు. అసాంఘిక శక్తులను ప్రోత్సహించడానికి టీడీపీ నేతలు డ్రగ్స్ తరలించారు.

విదేశీ మాఫియాలతో దోస్తీ..

అంతర్జాతీయ రాజధానిని నిర్మిస్తామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో తీసుకొచ్చిన సింగపూర్ మంత్రి అవినీతి కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్నారు. సింగపూర్ నుంచి రప్పించిన ఆ దొంగకు రాచమర్యాదలు చేసి ప్రభుత్వాన్ని అప్పజెప్పారు. చంద్రబాబుకి ఇతర దేశాల్లోని మాఫియాలతో అంటకాగిన చరిత్ర ఉంది. దోపిడీ చేసే వ్యక్తులు, మాఫియాతో, అరాచక శక్తులతో ఆయనకు సంబంధాలున్నాయి.

కోడ్ ఉల్లంఘన.. కిరాతక కథనాలు

ఓట్ల కోసం డ్రగ్స్ పంచకుండా టీడీపీని అడ్డుకోవాలని ఈసీని కోరాం. చంద్రబాబు ట్వీట్‌పై కూడా ఫిర్యాదు చేశాం. ట్విట్టర్‌లో తప్పుడు ఆరోపణలు చేస్తే నిబంధనల ప్రకారం ఈసీ చర్యలు తీసుకోవచ్చు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కడపలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి చెక్కులు పంచడంపై ఫిర్యాదు చేశాం. మా పార్టీపై విద్వేషంతో ఈనాడు పత్రికలో కిరాతక వార్తలు ప్రచురిస్తున్నారు. నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని సీఈవోకు ఫిర్యాదు చేశాం. డ్రగ్స్ వ్యవహారం గురించి ఈసీకి లేఖ రాయాలని సీఈవోను కోరాం.

మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్ పరీక్ష

డ్రగ్స్ కేసులో సీబీఐ దూకుడు పెంచింది. శుక్రవారం మరికొన్ని శాంపిల్స్‌ను పరీక్షించగా ఫలితాలు పాజిటివ్‌గా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో న్యాయమూర్తి సమక్షంలో 25 వేల కేజీల సరుకుతో కూడిన కంటైనర్‌ను సీజ్ చేశారు. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి రవాణా నౌక ద్వారా విశాఖకు వచ్చిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారంతో సీబీఐ అధికారులు తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 19, 20వ తేదీల్లో 49 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించగా డ్రగ్స్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో ఈ నెల 21వ తేదీన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం మరోసారి వీసీటీపీఎల్‌కు వెళ్లి మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించారు. వాటి ఫలితాలు కూడా పాజిటివ్‌గా వచ్చినట్లు సమాచారం. న్యాయమూర్తి సమక్షంలో రికార్డులతో పాటు శాంపిల్స్‌ను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. న్యాయమూర్తి సమక్షంలోనే బ్యాగులను సీజ్ చేశారు. మరికొన్ని సీబీఐ బృందాలు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో మరిన్ని ఆధారాలతో సీబీఐ అధికారులు త్వరలోనే అరెస్టులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

'ఆలపాటి' ఆర్థిక బంధం

విశాఖ డ్రగ్స్ కేసులో కీలక పాత్రధారి కూనం వీరభద్ర చౌదరి(వీరభద్రరావు)తో మాజీ మంత్రి ఆలపాటి రాజాకు ఉన్న ఆర్థిక సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. ఆలపాటి రుణాలకు కూనం సెక్యూరిటీ ఇవ్వడంతోపాటు ఎన్ఆర్ఐ అకాడమీతో భాగం పంపిణీ చేసుకోవడం వంటి వ్యవహారాలు చోటు చేసుకున్నాయి. 2015 అక్టోబరు 31న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరు అరండల్‌పేట విజయా బ్యాంకు బ్రాంచ్‌లో రూ.2 కోట్లు రుణం (దస్తావేజు నంబరు 11158/2015) తీసుకున్నారు. అదే ఏడాది డిసెంబరు 9న మరో రూ.12 కోట్లు అదే బ్యాంకు నుంచి రుణాన్ని పొందారు. దీనికి ఆలపాటి రాజా భార్య ఆలపాటి మాధవితోపాటు కూనం వీరభద్రరావు, ఎన్ఆర్ఐ అకాడమీ ఆస్తులను (దస్తావేజు నంబరు 12521/2015) తనఖా పెట్టారు. 2021లో కూనం వీరభద్రరావుకు ఎన్నారై అకాడమీకి సంబంధించి పార్టీషన్ దస్తావేజు కూడా నమోదైనట్లు తెలుస్తోంది. కూనం వీరభద్రరావు తమ ఆస్తులను తనఖా పెట్టి 2017లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రుణాన్ని ఇప్పించారు (దస్తావేజు నంబరు 4581/2017). ఇదే దస్తావేజును 2021లో (నంబరు 12205/2021) రద్దు చేసుకున్నారు. దీంతోపాటు మరికొన్ని ఆర్థిక లావాదేవీలు కూడా వీరిద్దరి మధ్య జరిగినట్లు తెలుస్తోంది.



ఆలపాటి రాజాకు కూనం వీరభద్ర చౌదరితో ఉన్న వ్యాపార బంధాన్ని తెలియజేసే పత్రం

స్నిఫర్ డాగ్స్ అడిగారు.. పంపాం

- డ్రగ్స్ కేసును సీబీఐ విచారిస్తోంది... అది మా పరిధి కాదు
- స్థానిక అధికారుల వల్ల జాప్యం జరిగిందనడం అవాస్తవం
- సీబీఐ వాడిన టెక్నికల్ పదజాలాన్ని తప్పుగా అన్వయించుకోవద్దు
- విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్

విశాఖ సిటీ: డ్రగ్స్ కంటైనర్ కేసు దర్యాప్తు తమ పరిధిలో లేదని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ స్పష్టం చేశారు. ఆ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోందని, ఇందులో జిల్లా అధికారులకు ఎటువంటి సంబంధం లేదన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీబీఐ ఎఫ్ఐఆర్ రిపోర్ట్‌లో పొందుపరచిన సాంకేతిక పదజాలాన్ని కొందరు తప్పుగా అన్వయించుకున్నారని చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లతో జిల్లా అధికారులు ఆలస్యంగా రావడంతో దర్యాప్తులో జాప్యం జరిగినట్లు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. తమపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీస్ శాఖ ఎన్నికల కమిషన్ పరిధిలో పని చేస్తోందని వివరించారు.



'బ్రెజిల్ నుంచి రవాణా నౌక ద్వారా డ్రగ్స్ కంటైనర్ విశాఖ పోర్టుకు వస్తున్నట్లు ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారంతో సీబీఐ అధికారులు విశాఖ చేరుకున్నారు. ఆ కంటైనర్‌ను విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (వీసీటీపీఎల్)లో జేఎం భక్షి అనే ప్రైవేట్ సంస్థ ఆధీనంలో ఉన్న ప్రాంతంలో అన్‌లోడ్ చేశారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో డెలివరీ అయిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు సీబీఐకు సమాచారం అందడంతో ఆనవాళ్లు గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్ కావాలని పోలీస్ శాఖను కోరారు. కొంతసేపటి తరువాత వాటిని వెనక్కు పంపించారు. నేను కూడా అక్కడ నుంచి వెళ్లిపోయా. ఆ తరువాత కస్టమ్స్, సీబీఐ అధికారులు కంటైనర్‌లో ఉన్న వాటిని పరీక్షించారు. ఈ తనిఖీలతో విశాఖ పోలీసులకు, అధికారులకు సంబంధం లేనందున ఎవరూ పాల్గొనలేదు.

తప్పుగా అర్థం చేసుకున్నారు..

కంటైనర్‌లో డ్రగ్స్ తెరిచినప్పటి నుంచి ఆనవాళ్ల పరీక్ష పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని రికార్డ్ చేసేందుకు సీబీఐ అధికారులు ఓ ప్రైవేటు వీడియోగ్రాఫర్‌ను వెంట తెచ్చుకున్నారు. కంటైనర్‌ను తెరిచే సమయంలో వీసీటీపీఎల్‌తోపాటు ప్రైవేటు సంస్థ సిబ్బంది, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. వీడియో రికార్డింగ్‌కు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున వారిని అక్కడి నుంచి పంపించారు. ఇలా వృథా అయిన సమయాన్ని స్థానిక అధికారులు గుమిగూడటం కారణంగా ప్రొసీడింగ్స్‌లో జాప్యం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో సీబీఐ అధికారులు పేర్కొన్నారు. వీసీటీపీఎల్, ప్రైవేటు సంస్థ అధికారులు రావడాన్ని సీబీఐ ప్రస్తావిస్తే దాన్ని జిల్లా అధికారులకు ముడిపెట్టడం సరికాదు. ఈ విషయంపై సీబీఐ అధికారులతో మాట్లాడి స్పష్టత తీసుకున్నాం. సీబీఐ అధికారులు వినియోగించిన టెక్నికల్ పదాలను తప్పుగా అర్థం చేసుకొని సంబంధం లేని అధికారులపై ఆరోపణలు చేయడం సరికాదు.' అని సీపీ చెప్పారు.

స్మగ్లింగ్ ముఠాలపై ఉక్కుపాదం

'గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. పోలీసులతో పాటు ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసి రాష్ట్రంలో డ్రగ్స్ నిరోధానికి చర్యలు చేపట్టింది. విశాఖపట్నంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేశాం. ప్రత్యేక బృందాలతో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ ద్వారా శాటిలైట్ చిత్రాలను సేకరించి గంజాయి తోటలను ధ్వంసం చేశాం. ప్రస్తుతం విశాఖపట్నంలో గంజాయి లేదా ఇతర డ్రగ్స్ లేవు. ఒడిశా, మల్కన్‌గిరి, జైపూర్, కోరాపుట్ లాంటి ప్రాంతాల నుంచి రవాణా జరుగుతోంది. విశాఖపట్నంలో అన్ని రకాల రవాణా సదుపాయాలు ఉండడంతో ఇతర రాష్ట్రాల గంజాయి, మాదక ద్రవ్యాల స్మగ్లర్లు జిల్లాను ట్రాన్సిట్ కేంద్రంగా వినియోగించుకుంటున్నారు. వీరిపై గట్టి నిఘా పెట్టి అంతర్రాష్ట్ర గంజాయి ముఠాలను అరెస్టు చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి విశాఖపట్నం మీదుగా మాదక ద్రవ్యాలను అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను అరెస్టు చేస్తుంటే నగరం గంజాయికి కేంద్రంగా మారిందని దుష్ప్రచారం చేయడం సరికాదు.' అని పోలీస్ కమిషనర్ రవిశంకర్ వివరించారు.

తప్పు చేసి మాపై నిందలా?

- విశాఖలో పట్టుబడ్డ డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదే
- పురందేశ్వరి కుమారుడు సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో భాగస్వామి
- డ్రగ్స్ వెనుక చంద్రబాబు, పురందేశ్వరి గ్యాంగ్‌లు ఉన్నాయి
- దీనిపై సీబీఐతోపాటు సంబంధిత సంస్థలకూ ఫిర్యాదు చేస్తాం
- వాస్తవాలు కప్పిపుచ్చి చంద్రబాబు, లోకేశ్ దిగజారుడు ఆరోపణలు
- తప్పుడు రాతలు రాసిన ఈనాడు, ఆంధ్రజ్యోతిపై ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తాం
- నోరు, పేపర్ ఉందని అబద్ధాలు అచ్చేస్తే జనం నమ్మే కాలం కాదిది
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: విశాఖ పోర్టులో సీబీఐ స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ కంటైనర్ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బంధువులదేనని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. తప్పు చేసి అడ్డంగా దొరికిన చంద్రబాబు గ్యాంగ్ ఇంగిత జ్ఞానం లేకుండా తమపై చౌకబారు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. డ్రగ్స్ దందా వెనుక చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి గ్యాంగ్‌లు ఉన్నాయనే అనుమానాలు ఉన్నాయని.. ఈ కోణంలో దర్యాప్తు చేయాలని సీబీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. చంద్రబాబు, లోకేశ్ తీరు చూస్తుంటే దొంగే.. దొంగా.. దొంగా.. అని అరిచినట్లుగా ఉందన్నారు. తప్పుడు కథనాలు అచ్చేసిన ఈనాడు, ఆంధ్రజ్యోతిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.



టీడీపీ నేతల ప్రమేయం..

సీబీఐ అధికారులు పట్టుకున్న డ్రగ్స్ కంటైనర్‌ను ఆర్డర్ చేసిన సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీ చరిత్రను పరిశీలిస్తే అంతా చంద్రబాబు సమీప బంధువులే. స్వయంగా పురందేశ్వరి కుమారుడే ఆ కంపెనీలో భాగస్వామిగా ఉన్నాడు. ఆమె వియ్యంకుడు సైతం అదే కంపెనీలో పార్టనర్‌గా ఉన్నారు. వాళ్లు ప్రమోట్ చేసిన కంపెనీ నుంచి తర్వాత డిషైడ్ అయ్యారు. దీనిపై సంజాయిషీ ఇవ్వకుండా మాపై ఎదురు దాడి చేయడం సిగ్గుచేటు. ఎన్నికల వేళ మాపై రాళ్లేసి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారు. ప్రతి విషయంలో ఇలా అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారు. డ్రగ్స్ దందా వెనుక కచ్చితంగా చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి గ్యాంగ్‌లు ఉన్నట్లు మేం అనుమానిస్తున్నాం.

కూటమి సింగిల్ డిజిట్‌కే పరిమితం..

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూటమి సింగిల్ డిజిట్‌కే పరిమితం కానుంది. ఓటమిని గ్రహించి సాకులను అన్వేషిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదు కాబట్టే చంద్రబాబు ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారు. డ్రగ్స్ కేసుకు సంబంధించి సీబీఐ, ప్రెస్‌కౌన్సిల్ తోపాటు అన్ని సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కూడా కోరతాం. నోరు, పేపర్ ఉందని ఏది పడితే అది రాస్తే జనం నమ్ముతారనుకుంటే పొరపాటే. ఆ ఇంగితం రామోజీ, రాధాకృష్ణ, చంద్రబాబుకు ఉండాలని కోరుకుంటున్నా.

థర్డ్ గ్రేడ్ కంటే హీనమైన వ్యక్తి లోకేశ్..

థర్డ్ గ్రేడ్ కంటే హీనమైన స్థాయిలో లోకేశ్ ఉన్నాడు. ఎందుకు ట్వీట్ చేస్తున్నాడో, ఏం చేస్తున్నాడో కూడా ఆయనకు అర్థం కావట్లేదు. మోకాలికి బట్టతలతో ముడిపెట్టినట్లుగా ఎప్పుడో బ్రెజిల్ అధ్యక్షుడు గెలిచాడని విజయసాయిరెడ్డి ట్వీట్ చేస్తే దాన్ని పట్టుకొచ్చి ఈ కేసుకు అంటగడుతున్నారు. జన్మలో అధికారం దక్కదని గ్రహించి ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారు. సీఎం జగన్, సాక్షి పత్రికైనా ఆధారాలు లేకుండా ఎప్పుడూ ఆరోపణలు చేయలేదు. చంద్రబాబు, లోకేశ్ వల్లించే అబద్ధాలను ఈనాడు, ఆంధ్రజ్యోతి వండి వారుస్తున్నాయి.

గంజాయి వ్యాపారులు పచ్చ నేతలే

మా ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి సాగును ధ్వంసం చేయడమే కాకుండా ప్రత్యామ్నాయ జీవనోపాధి కూడా చూపించాం. కేంద్ర ప్రభుత్వం సైతం ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమాన్ని మెచ్చుకుంది. ఎస్ఈబీ ఏర్పాటయ్యాక 12 వేల ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసింది. డ్రగ్ ఇంపోర్ట్ చేసుకున్న కంపెనీ తప్పుడు పనులు చేస్తే చర్యలు తీసుకుంది కూడా సీఎం జగన్ ప్రభుత్వమే. ప్రభుత్వం తీసుకున్న చర్యలను అభినందించకపోగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. ఎన్నికల్లో చెప్పుకునేందుకు ఏమీ లేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.



ఓ దేవగణాల్లారా! మా శరీరాలు, వాటిలోని సర్వాంగాలూ సుదృఢంగా ఉండేట్లు, అలాంటి దేహాలతో మా జీవితాలు భగవంతుని స్తుతించడానికి, దేవుని కార్యాలు నిర్వహించడానికే వెచ్చించేట్లు దీవించండి.
– ప్రశ్నోపనిషత్తు

సాక్షి
శనివారం, 23 మార్చి 2024

ఈడీ చెరలో కేజ్రీవాల్!

పీఠం ఎక్కింది మొదలు కేంద్రం కంట్లో నలుసులా మారిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కటకటాల వెనక్కి వెళ్లక తప్పింది కాదు. గురువారం రోజంతా జరిగిన డ్రామాకు పతాకస్థాయిగా రాత్రి 9.45 గంటల ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తునకు హాజరు కావాలంటూ తొమ్మిది దఫాలు ఈడీ పంపిన సమన్లను ఆయన బేఖాతరు చేస్తూ రాగా, పదోసారి నేరుగా ఈడీ అధికారులే కేజ్రీవాల్ అధికార నివాసంలో సోదాలు నిర్వహించి అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించటంతో దాదాపు రెండేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం కీలకమలుపు తిరిగింది. మొన్న జనవరి 31న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను భూకుంభకోణంలో ఈడీ అరెస్టు చేయగా, ఆ వరసలో అరెస్టయిన రెండో ముఖ్యమంత్రి కేజ్రీవాల్. అవినీతికి వ్యతిరేకంగా పుష్కరకాలం క్రితం అన్నా హజారే నాయకత్వాన ఢిల్లీలో రగిలిన నిరసనోద్యమంలో కీలకపాత్ర పోషించిన నాయకుడు చివరకు అలాంటి ఆరోపణల్లోనే చిక్కుకుని అరెస్టు కావటం ఒక వైచిత్రి. అప్పటి యూపీఏ ప్రభుత్వం 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో రూ. 1.76 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని అవినీతి వ్యతిరేక ఉద్యమ నాయకులు ఆరోపించారు. ఆ కేసులో సీబీఐ సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోయిందని ప్రత్యేక కోర్టు అభిప్రాయపడి 2017లో నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఆ తీర్పుపై 2018 మార్చిలో సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను ఆరేళ్ల తర్వాత శుక్రవారం ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించింది.

ఐఆర్ఎస్ కొలువుకు రాజీనామా చేసి ఉద్యమంలోకొచ్చిన కేజ్రీవాల్‌ను ఆదినుంచీ వివాదాలు చుట్టుముడుతూనే వున్నాయి. అవినీతి వ్యతిరేకోద్యమం చల్లారి దాన్లోని ప్రముఖులంతా తెరమరుగవుతున్న రోజుల్లో కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్థాపించటం ఆయన సహచరులకు మింగుడు పడలేదు. ఉద్యమాన్ని స్వలాభానికి వాడుకుంటున్నాడంటూ అనేకులు విరుచుకుపడ్డారు. తొలుత ఆయనతో చేతులు కలిపిన కేంద్ర మాజీ న్యాయమంత్రి శాంతి భూషణ్, ఆయన కుమారుడు, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తదితరులు కొద్దికాలంలోనే కేజ్రీవాల్‌పై ఆరోపణలు చేస్తూ వైదొలిగారు. అధికారంలోకొచ్చాక ఆయనపై దాదాపు డజనుసార్లు దుండగులు దాడిచేశారు. ఇంకుతో, కోడిగుడ్లతో, కర్రలతో, రాళ్లతో ఈ దాడులు జరిగాయి. ఒకసారైతే దుండగుడు పాదాభివందనం చేస్తున్నట్టు నటించి ముఖంపై కారం జల్లాడు. అవినీతి వ్యతిరేకోద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేకమంది మాదిరే కేజ్రీవాల్ కూడా సంఘ్ పరివార్ సంస్థలతో సన్నిహితంగా మెలిగినవారే. అందుకే ఆప్ స్థాపన వారికి నచ్చలేదంటారు. 2013లో స్వల్ప ఆధిక్యతతో తొలిసారి అధికారం చేపట్టినప్పుడు నాటి యూపీఏ సర్కారుతో పేచీ తప్పలేదు. ఆ తర్వాత ఎన్‌డీఏ అధికారంలోకొచ్చినా ఏదో ఒక అంశంపై ఘర్షణ కొనసాగుతూనేవుంది. లెఫ్టినెంట్ గవర్నర్లుగా వచ్చినవారు ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుపుల్లలేయటం, కొన్నిసార్లు న్యాయస్థానాల జోక్యంతో ఆయన విజయం సాధించటం రివాజైంది. నిజానికి కేజ్రీవాల్ కార్యక్షేత్రం చిన్నది. ఆయన ప్రభావం ఢిల్లీకి పరిమితం. పంజాబ్‌లో సైతం ఆప్ ప్రభుత్వాన్ని స్థాపించగలిగినా అది నిలకడగా వుండగలదా అన్నది ప్రశ్నార్థకం. మతం, కశ్మీర్ తదితర అంశాల్లో కేజ్రీవాల్ వైఖరి బీజేపీకి భిన్నమేమీ కాదు. అందువల్ల ఆయనపై అస్త్రాలు సంధించి బలహీనపరచటం బీజేపీకి సాధ్యంకావటం లేదు. చిత్రమేమంటే అటు కాంగ్రెస్ సైతం ఆయన బలపడితే తమకే ముప్పని భావించి కేజ్రీవాల్‌ను తగినంత దూరంలో వుంచింది. దేశవ్యాప్తంగా వేరే పార్టీలు పెద్ద బలంగా లేవు. ఏతావాతా తమ నేతల అరెస్టుపై ఆప్‌ది ఒంటరి పోరాటమే కావొచ్చు.

ఇంతకూ కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారన్నది వాస్తవమేనా? అది ఎన్ని దశాబ్దాలకు తేలుతుందో ఎవరూ చెప్పలేరు. ఆయన సర్కారు ఢిల్లీ మద్యం విధానంలో మార్పులు చేయటం ద్వారా కొన్ని వర్గాలకు లాభం చేకూర్చి వందకోట్ల రూపాయల మేర ముడుపులు తీసుకుందన్నది ఈడీ ఆరోపణ. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఏడాదిన్నరగా జైల్లో వున్నారు. బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితను ఇటీవలే అరెస్టు చేశారు. కొందరు అప్రూవర్లుగా మారారు. కేసులోని నిజానిజాలేమిటన్న సంగతలావుంచి సీబీఐ, ఈడీ వ్యవహార శైలిపై యూపీఏ సర్కారుకాలం నుంచీ అనుమానాలున్నాయి. ఆ సంస్థల నిర్వాకాన్ని అడపా దడపా న్యాయస్థానాలు ప్రశ్నిస్తున్న ఉదంతాలు లేకపోలేదు. అయినా వాటి తీరుతెన్నులు మారిన దాఖలా లేదు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరిగిన ఈ అరెస్టుల వెనక రాజకీయ ప్రమేయం, ప్రయోజనం లేవని ఎవరూ అనుకోలేరు. నిజానికి సుప్రీంకోర్టు పుణ్యమా అని బయటపడిన ఎలక్టోరల్ బాండ్ల ఆనుపానులు, కార్యకారణ ప్రమేయాలు గమనిస్తే ఈ మద్యం కుంభకోణం పిపీలిక ప్రాయం అనిపిస్తుంది. అవినీతి కేసుల విషయంలో ఈమధ్య పార్టీల పరస్పర ఆరోపణలు వింతగా వుంటున్నాయి. కవితను అరెస్టు చేయకపోవటంవల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడామని బీజేపీ నేతలు ఖేదపడగా... బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కు కావటంవల్లే ఆమె అరెస్టు జరగలేదని అప్పట్లో కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అదే కాంగ్రెస్ ఇప్పుడు ఆప్ తమ కూటమిలో వుంది గనుక కేజ్రీవాల్ అరెస్టును తప్పుబడుతున్నది. ఈ అష్టావక్ర రాజకీయాలవల్ల బీజేపీ ఎడాపెడా లాభపడుతోంది. ఏదేమైనా అగ్రనాయకత్వం అరెస్టుతో సైన్యాధిపతిలేని సేనలా తయారైన ఆప్ ఈ సార్వత్రిక ఎన్నికలనూ, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలనూ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

‘వై నాట్ 175?’ నినాదం స్ఫూర్తితో...

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు బాగా వేడెక్కుతున్నాయి. జగన్ నేతృత్వంలోని అధికార వైఎస్సార్ కాంగ్రెస్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే నాటికే తన అభ్యర్థులను ప్రకటించి మాంచి దూకుడు మీద ఉంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం టీడీపీ నానా తిప్పలూ పడి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరి అభ్యర్థుల ప్రకటన దశలోనే ఆపసోపాలు పడుతోంది. చంద్రబాబు ఎన్డీయే పొత్తు కోసం నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూసీ చూసీ రాయబారాలు పంపీ పంపీ ఎట్టకేలకు చేరిపోయారు. తీరా ఈ ఇష్టం లేని పొత్తుల వల్ల టీడీపీ–జనసేన కార్యకర్తలు బాహాబాహీ యుద్ధానికి దిగుతున్నారు. మరోవైపు జగన్ ఒక్కడే తన సైన్యంతో ముందుకు దూసుకు పోతున్నారు. అతని ఆయుధం ప్రజాబలం. అతని నినాదం పేదల సంక్షేమం.

ఎట్టకేలకు ఎన్నికల నగారా మోగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 4 ‘సిద్ధం’ సభల ద్వారా తమ సత్తా ఏంటో చాటుకుంది. అభ్యర్థులను అన్ని పార్టీల కన్నా ముందే ప్రకటించి ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. మొత్తం 175 అసెంబ్లీ నియోజక వర్గాలు, 25 ఎంపీ స్థానాలకు సామాజిక న్యాయాన్ననుసరించి అభ్యర్థులను నిర్ణయించారు వైఎస్సార్‌సీపీ వారు. బీసీలకు అసెంబ్లీ, పార్లమెంటుకు కలిపి మొత్తం 59 టికెట్లు ఇచ్చారు. ఆశ్చర్యమేమిటంటే వీరిలో చాలామంది అతిపేదలు. ఇది రాజకీయానికి ఒక కొత్త నిర్వచనంగా చెప్పవచ్చు. మరోపక్క అప్పటికప్పుడు సూట్‌కేసులతో విమానాలు దిగిన పెద్దలకు మాత్రమే చంద్రబాబు సీట్లు కేటాయిస్తున్నారు. అందులోనూ స్వజాతి పక్షులే ఎక్కువ. సీనియర్లు దిక్కుతోచక దిక్కులు చూస్తున్నారు.

ఇదిలావుంటే ‘గండస్యోపరిపిటకవత్’ అనే సామెత (గోడదెబ్బ – చెంపదెబ్బ)గా ఇష్టంలేని పొత్తుల వల్ల టీడీపీ – జనసేన కార్యకర్తలు బాహాబాహీ యుద్ధానికి దిగుతున్నారు. ఇక అసలు నాయకుడు ఎన్డీయే పొత్తుకోసం నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూసి, చూసి రాయబారాలు పంపీ, పంపీ ఎట్టకేలకు వదినగారి దయతో చేరిపోయారు. దానికోసం ఆయన సాగించిన తపస్సు సామాన్యమైంది కాదు. ఎన్ని ఫ్లయిట్లు ఎక్కారో, దిగారో, బీజేపీ పెద్దల ఇళ్ళ ముందు నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపారో పాపం ఆయనకు తెలుసు! ఏమీ తెలియదనుకున్న ప్రజలకూ తెలుసు!

తన జన్మధన్య మైందనుకుంటూ రాష్ట్రానికి తిరిగి వచ్చి సీట్ల పంపిణీ ప్రారంభిస్తే... అది పూర్తిగా బెడిసికొట్టి సిగపట్ల వ్యవహారం సీరియస్‌గా సాగుతున్నది. పోనీ సభల ద్వారా వాటిని కవర్ చేసుకుందామంటే వెయ్యి రూపాయలు, క్వార్టర్ బాటిల్, బిర్యానీ ఇచ్చినా తినేసి పోతున్నారు కానీ సభదాకా రావడంలేదు. దాంతో ఖాళీ కుర్చీలు గ్రౌండ్లో దర్శనమిస్తున్నాయి.

‘రామేశ్వరం పోయినా శనేశ్వరం పోదన్నట్టు’ మోసాలు, అడ్డదారులు తప్ప నిఖార్సయిన రాజకీయం తెలియని ఈ అబద్ధాల కోరును భరించలేమని జనాలు 2019లోనే అధికారం నుండి తోసేస్తే, అదేమీ గుర్తించకుండా తనకుతానే గొప్పనాయకుడిని అనుకుంటూ మతిలేని ఉపన్యాసాలు ఇస్తున్న ఇతనికి తోడు దత్తపుత్రుడొకరు. రాసిచ్చిన డైలాగులు ఆవేశంలో వూగిపోతూ చదవటం తప్ప సొంత ఆలోచన లేదు పవన్ కల్యాణ్‌కు. ఇక అసలు పుత్రుడిని చూద్దామంటే అతని పేరెత్తితేనే పార్టీ పారిపోతున్నది. ఇప్పుడు చంద్రబాబు కూడా అదేదారిలో ఉన్నాడు. కొత్తగా వచ్చిన మరో తోడు వదినగారు. ప్రస్తుతం తన ఒక్కసీటు గెలిస్తే చాలు వచ్చే ఎన్డీయే ప్రభుత్వంలో ఎలాగయినా మంత్రిపదవి దక్కించుకోవాలని సొంతపార్టీనే తాకట్టు పెడుతున్నారు.



అశేష జనవాహిని మధ్య సీఎం జగన్ మోహన్ రెడ్డి

ఈ నలుగురు ఇలా నడుస్తుంటే... వీళ్ళకేదరు మాత్రం నియోజకవర్గాల్లో తన్నుకోవడంలో యమ బిజీగా ఉన్నారు. సిద్ధాంత బలం లేక రాష్ట్ర ప్రయోజనాల గురించి ఒక్కమాట మాట్లాడలేక పోతున్నారు. కానీ జగన్‌ను తిట్టడానికి మాత్రం ఒకేదారిలో నడుస్తు న్నారు. వాళ్ళకున్న సిద్ధాంతమల్లా జగన్ ఓడిపోవాలి. ఎందుకంటే సమాధానం లేదు. వీళ్ళ ఎజెండాలో మదమెక్కిన కులగర్జనలు, మతాల పుత్కారాలు, ముఖ్యమంత్రి మీద విష ప్రచారాలు నిరంతరం వినిపిస్తూనే ఉన్నాయి. అదుపు తప్పిన కట్టుబాట్లతో, అబద్ధపు రాతలే తమ ధ్యేయమన్నట్లు కుల అహంకారంతో పిచ్చిరాతలు రాస్తున్నాయి పచ్చ పత్రికలు. ఒక అవినీతిపరుడి కొమ్ముకాస్తూ అవి ఏనాడో విలువల్ని పోగొట్టుకున్నాయి. మరోవైపు మరో దత్తపుత్రిక వచ్చిచేరింది.

కుటుంబ వ్యవస్థను నాశనం చేసే విద్యలో ఎన్నో డిగ్రీలు పొందిన చంద్రబాబు మరో కుటుంబ వినాశనానికి పూనుకున్నాడు. ఎన్టీఆర్ కుటుంబాన్ని చీల్చి ఇంటి పెద్దను నాశనం చేసిన ఇతడు, పచ్చగా, సమష్టిగా కష్టాలను సమైక్యంగా ఎదుర్కొని, ఎన్నో ఇబ్బందులను అధిగమించి అధికారాన్ని సాధించుకున్న వైఎస్సార్ కుటుంబం మీద తన వక్రదృష్టి సారించాడు. ఫలితంగా అదికూడా చీలిపోయింది. ఆవేశం తప్ప ఆలోచన లేని షర్మిలను అన్నకు దూరం చేశాడు. దానికి ‘కేవీపీ’లాంటి ఆత్మద్రోహులు తోడయ్యారు. ఈ దురాశాపరులు అభివృద్ధిలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును నాశనం చెయ్యటానికికంకణం కట్టుకున్నారు. కోట్లాదిమంది పేదల కడుపుకొట్టటానికి సిద్ధ పడుతున్నారు. సామాజిక సహజీవనంతో సౌభ్రాతృత్వంగా వర్ధిల్లుతున్న ఆంధ్రుల ప్రశాంతతను చెరపటానికి ఈ కూటమి ప్రయత్నిస్తున్నది.

కానీ ఆంధ్రులు అమాయకులు కాదు. స్వాతంత్ర్య పోరాటం నుండి ఇప్పటి వరకు ఎన్నో రాజకీయాలను, ఎందరో నాయకులను చూసిన అనుభవం వారిది. అందుకే ఈ దుష్ట గ్రహ కూటమి సభలకు వెళ్ళకుండా తమ నిరసన తెలియజేస్తూనే ఉన్నారు. వారి ఏ సభ చూసినా, ఖాళీ కుర్చీలే. వీరి పతనం చివరిదశకు చేరిందనటానికి ఇవన్నీ సంకేతాలే.

రాజనీతిజ్ఞుడు, అనుభవజ్ఞుడు అయిన మోదీ ఈ పొత్తుకు సుముఖంగా లేరనే విషయం వారి ప్రవర్తన, ప్రసంగధోరణి చెప్పకనే చెప్పాయి. జగన్ గురించి ఏమీ విమర్శించక పోవటం, వైరి గుండెల్లో గునపాలు గుచ్చినట్లే వుంది. పక్క రాష్ట్రాలయిన తెలంగాణ కర్ణాటక, చెన్నై సభల్లో అక్కడి ముఖ్యమంత్రులను ఏకిపారేశారు మోదీ. ఆ ప్రసంగాలతో పోల్చి చూస్తే ముఖ్యమంత్రిని, ఆయన పాలనను ప్రధాని మెచ్చినట్లే కనిపించింది. ఇంకో విషయం కొంచెం లోతుగా ఆలోచిస్తే అర్థమవుతుంది. అది జగన్ పట్ల వారికున్న అభిమానం. ప్రధానమంత్రి కంటే ఐదు నిమిషాల ముందు ప్రసంగించిన చంద్రబాబు జగన్‌ను విమర్శిస్తూ ‘తల్లిని, చెల్లిని చూసుకోలేనివాడు ఈ రాష్ట్రంలో ఆడవాళ్ళ కెలా మేలుచేస్తాడు...’ అంటూ తన లేకితనాన్ని ప్రదర్శించుకున్నాడు.

కానీ మోదీ ఆ వ్యాఖ్యల్ని ఖండిస్తున్నట్లుగా ‘అన్నా, చెల్లి ఒకటే. ఇది కాంగ్రెస్–వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడ’ అంటూ చంద్రబాబు గొప్పగా ప్రయోగించాలనుకున్న షర్మిల అస్త్రాన్ని ఉపసంహరించారు. ప్రైమ్ మినిస్టర్ ముందు జగన్‌ను పెద్ద విలన్‌గా చూపించాలనుకున్న వీళ్ళ ఎత్తుగడను ఆయన చిత్తుచేసి ప్రజల్ని ఒక అయోమయంలో ఉంచి వెళ్ళిపోయారు. ‘ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు’ ఈ సభ ద్వారా తన బలాన్ని నిరూపించుకోవాలనుకున్న చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌లకు అవమానాలే మిగిలాయి. లక్షల్లో వస్తారన్న జనం రాలేదు. వచ్చిన ప్రధానమంత్రి వీరి పేరయినా ఎత్తలేదు. మరోపక్క పొత్తుకు గండికొడుతున్నాడని బీజేపీ సీనియర్లు అధిష్ఠానానికి లేఖ రాశారు. ఆ పొత్తు చివరిదాకా వుంటుందో లేదో తెలియదు. జన సైన్యం అసలు సహకరించటం లేదు. ఇక ఓట్లు షేర్ చేసుకునేదెప్పుడు? ‘కత్తితో చంపేవాడు ఆ కత్తితోనే చస్తాడు’ అన్నట్లు అవగాహన, రాజకీయ సంస్కారం లేని ముఠాలను తయారుచేసుకున్న దత్తపుత్రుడి సైన్యం తమ నాయకుల మీదే తిరుగుబాటు చేస్తోంది. ఎటుచూసినా పంచకూళ్ళ కూటమికి గందరగోళంలా తయారయ్యింది పరిస్థితి. కలసినా ఒకళ్ళనొకళ్ళు ఓడించుకుంటారు.

మరోవైపు జగన్ ఒక్కడే తన సైన్యంతో ముందుకు దూసుకు పోతున్నాడు. అతని ఆయుధం ప్రజాబలం. అతని నినాదం పేదల సంక్షేమం. అతని సైన్యం ఐకమత్యంతో నాయకుడిని అనుసరించే పార్టీ. ఇప్పుడు చెప్పండి – ముఖ్యమంత్రి జగన్ అన్నట్లుగా ‘వైనాట్–175?’ సాధించి చూపెడదాం – ఆదర్శ రాజ్యాన్ని నిలబెడదాం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

మొదటికే మోసం



అఫ్గానిస్తాన్ మీద పాకిస్తాన్ విధాన పరిణామం (2001–2024): మేము తాలిబన్లకు మద్దతివ్వము – మేము మంచి తాలిబన్లకు మద్దతివ్వడం ద్వారా భారత ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాం – యూఎస్‌ను బయటికి పోయేలా ఒత్తిడి చేయడం ద్వారా తాలిబన్లు బానిస సంకెళ్లను తెంచారు– తాలిబన్లు మా భద్రతకు ప్రమాదకరంగా మారారు.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

గట్టి చర్యలు ముఖ్యం



పారిశ్రామిక విప్లవం నుంచి సమస్యేమిటో జనాలకు తెలిసినా దాన్ని మరిచిపోవడమో, లేదా పట్టించుకోకపోవడమో జరిగిందని వాతావరణ సంక్షోభం మనకు మళ్లీ గుర్తుచేస్తోంది. మనం పర్యావరణానికి కీడు కలిగిస్తే మనకు మనం కీడు చేసుకున్నట్టే. మన ఉమ్మడి భవిష్యత్ తప్ప, మనకు విడి భవిష్యత్ అనేది లేదు. పైపై చర్యలతో లాభం లేదు.

– టెడ్రోస్ అడినోమ్ గేబ్రియేసస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్

కాపాడుకుందాం!



నా ‘క్లైమేట్ ఫాస్ట్’ 17వ రోజు ప్రారంభం: ప్రపంచ జల దినోత్సవ శుభాకాంక్షలు. హిమాలయ మంచుదిబ్బలు వేగంగా కరిగిపోతున్నాయి. లద్ధాఖ్‌లోని మన కృత్రిమ మంచుదిబ్బలు ఈ సమస్యను పరిష్కరించలేవు. కానీ మీ వల్ల అవుతుంది. (‘సేవ్ లద్ధాఖ్’ పేరుతో సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష చేస్తున్నారు.)

– సోనమ్ వాంగ్‌చుక్, యాక్టివిస్ట్

అందుకేనా?



జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే 2024 ఎన్నికల్లో బీజేపీ గెలవదని నమ్ముతున్నవాళ్లు కేవలం బీజేపీవాళ్లే అనిపిస్తోంది.

– బోయబ్ డేనియల్, జర్నలిస్ట్

చదవకూడదా?



ఆంత్రోపాలజీ, జర్నలిజం, ఫిలాసఫీ, రిలిజియస్ స్టడీస్, మ్యూజిక్‌తో పాటుగా... కెంట్ విశ్వవిద్యాలయం (యూకే)లోంచి ఆర్ట్ హిస్టరీ సబ్జెక్టును దశలవారీగా తొలగించనున్నారని ధృఢ పడింది. ఎంత దారుణమైన నష్టం!

– ఎమిలీ గెరీ, ఆర్ట్ హిస్టారియన్

‘న్యూట్రల్ ఓటర్’ సిద్ధమేనా!

అభిప్రాయం



జాన్సన్ చోరగుడి

మార్చి 17న చిలకలూరిపేట ఎన్నికల సభతో... వందేళ్లకు చేరువ అవుతున్న స్వతంత్ర దేశంలో కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్– ‘ప్రాంతము’ ‘ప్రజల’ విషయంలో పదేళ్లుగా దేశాధినేతగా ఉన్న ప్రధానమంత్రి, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి– ఇరువురి వైఖరి ఏమిటో స్పష్టం అయింది. కనుక ఇప్పుడు మనమొక నిర్ణయం తీసుకోవడం తేలిక. అది ఎటువంటి నిర్ణయం కావాలంటే, దేశం దక్షిణ సరిహద్దున ఉన్న తీరాంధ్ర రాష్ట్రం ప్రత్యేక అవసరాల కోసం, ఇదొక – ‘గ్రీన్ ఫీల్డ్ స్టేట్’ అన్నట్టుగా పూర్తిగా నూతన ప్రణాళికలతో ముందుకు వెళుతున్న ప్రస్తుత ప్రభుత్వాన్ని బల పర్చడం. ఇది ఎన్నికల సీజన్ అని ఈ మాట అనడం కాదు. మన చుట్టూ నెట్టుకొస్తున్న అని వార్యతలను చూశాక, అంటున్న మాట ఇది.

ఆదివారం చిలకలూరిపేటలో నరేంద్రమోదీ సభ జరిగిన ప్రాంతానికి 40 కి.మీ. దూరంలో సోమవారం (18.3.2014) ఉదయం ఏమి జరిగిందో మనకు తెలియడం అవసరం. బాపట్ల జిల్లాలో జాతీయ రహదారికి సమాంతరంగా భారత రక్షణశాఖ కోసం నిర్మించిన– ‘ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్ వే’ పైకి– ‘ఇండియన్ ఎయిర్ ఫోర్స్’కు చెందిన ‘సుఖోయ్–సు 30’ యుద్ధ విమానాలు, రవాణా విమానాలు దిగాయి. ఇందు కోసం ‘ట్రైల్స్’ గత డిసెంబర్‌లో ఇక్కడ జరిగాయి. దానికి ఒక ఏడాది ముందు, జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో, సముద్ర తీరాన ఉండే బాపట్ల లోక్‌సభ నియోజకవర్గం కొత్తగా జిల్లా కేంద్రం అయింది.

సోమవారం ఇది జరిగాక– ‘అత్యవసర పరిస్థితుల్లో ఇకముందు ఏ రోజైనా, ఏ సమయంలో అయినా ఇక్కడి– ‘ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్ వే’ను మన ‘ఎయిర్ ఫోర్స్’ విమానాలు వినియోగించుకోవచ్చు’ అని అధికారులు అన్నట్టుగా, ఇటువంటివి 19 వరకు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో ‘ఆపరేషన్’కు సిద్ధమయింది బాపట్లలోనే అని ఆర్థిక వ్యవహారాల పత్రిక ‘మింట్’ రాసింది. రాష్ట్రంలో మన సముద్ర తీరం వెంట రక్షణశాఖ నుంచి మన పరిసరాల్లో పెరుగుతున్న ఒత్తిడి బాపట్ల వద్ద ఇలా ఉంటే, ముస్ముందు బంగాళా ఖాతం నుంచి జరిగే నౌకా వాణిజ్యం సంబంధిత ‘ట్రేడ్’ వాతావరణంతో మన తీరం మీద పెరుగుతున్న ఒత్తిడి ఎలా ఉండబోతున్నదో... కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గత ఏడాది 4 మార్చిన విశాఖపట్టణంలో జరిగిన పెట్టుబడుదారుల సదస్సులో చెప్పిన మాటల్లో వెతికితే అర్థమవుతుంది.



‘కేంద్రం చూపు ఢిల్లీ నుంచి కిందికి దక్షిణాది వైపుకు దిగడం, ఆ దిగే క్రమం తూర్పుతీరం చేరడం లక్ష్యంగా ఉంది’ అంటారాయన. మన దేశం ఆగ్నేయ ఆసియా దేశాలతో చేసుకున్న ‘ఆసియాన్’ ఒప్పందంతో నౌకా వాణిజ్యం మన పోర్టుల నుంచి ఎలా ఉండబోతున్నదీ ఆయన మాటల్లో తెలుస్తూనే ఉంది. తన శాఖ పరిధిలో నిర్మాణంలో ఉన్న ‘నేషనల్ హైవేస్’ అన్నీ డిసెంబర్ 2024 నాటికి పూర్తి అవుతాయనీ, అవి పూర్తి అయితే, వాటిలో ఒకటైన రాయపూర్ – విశాఖపట్టణం జాతీయ రహదారి ద్వారా ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్న ఛత్తీస్ గఢ్‌కు ఏపీ పోర్టులు అందుబాటులోకి వస్తాయనీ నితిన్ గడ్కరీ అంటున్నారు. అది నిజమే అన్నట్టుగా, ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు శరవేగంగా సిద్ధమవుతున్నాయి.

అభివృద్ధి అంతిమ దశ– ‘వృద్ధి’ (గ్రోత్)గా నమోదు అవుతున్నప్పుడు, అది ప్రాంతీయ దృష్టితో స్థానికంగా చూసేది కాదు. రాజకీయ కారణాలతో ఒక కొత్త రాష్ట్రం ఏర్పడినప్పుడు, రాష్ట్ర పరిధిలో భౌగోళిక వికేంద్రీకరణ దృష్టితో అభివృద్ధి ప్రణాళిక రచన జరగాలి. ఏపీ విషయమే చూస్తే ఇక్కడ కొత్త పోర్టులు సిద్ధమైతే, మరో పదేళ్లలో మన రాష్ట్రంలో జరిగే వాణిజ్య సాంద్రత గణనీయంగా పెరుగుతుంది. అందుకే ఇక్కడ పెరిగే వాణిజ్య అవసరాలు గుర్తించి మన రైల్వేలు అప్రమత్తం అయ్యాయి. విజయవాడ డివిజన్‌లో రూ. 460.98 కోట్లతో పది స్టేషన్లను ఆధునికీకరిస్తున్నారు. ‘అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్’ ద్వారా పలు దశల్లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 72 రైల్వే స్టేషన్లు రూ. 3,141 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు.

అయితే, అభివృద్ధి కోసం జరుగుతున్న విస్తరణతో పాటుగా మన జీవనంలో వచ్చే మార్పులు ఎదుర్కోవడానికి ప్రజా అవసరాల పట్ల తక్షణం స్పందించే స్థానిక ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థతో ఏర్పడ్డ – ‘ఫీల్ గుడ్’ వాతావరణం వల్ల మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలు సంతృప్తికరంగానే ఉన్నాయని చెప్పవచ్చు.

ఎవరో గెలవడం మనకెందుకు? మనం గెలవాలి! అందుకు రాజకీయ అనిశ్చితికి ఆస్కారం లేకుండా తీరాంధ్ర– ‘ బ్లూ ఎకానమీ’ ద్వారా రాష్ట్ర నిరంతర వృద్ధి కోసం తటస్థ ఓటర్లు మరోసారి ఈ ప్రభుత్వం వైపు మొగ్గడం అవసరం.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

ఎన్ని చిత్ర విచిత్ర విన్యాసాలు!

అభిప్రాయం




అడుసుమిల్లి జయప్రకాశ్

కత్తులు దూసుకొన్నవారే కరచాలనం చేస్తూ ఉంటే ఎలా ఉంటుంది! చిలకలూరి పేట సమీపంలోని బొప్పూడిలో జరిగిన సభలో ప్రధాని మోదీ పట్ల తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రదర్శించిన అతివినయం చూస్తే ఔరా అనిపించింది. మోదీ వలన ఈ దేశం సర్వ నాశనం అయిపోతుందని విమర్శించిన చంద్రబాబేనా... ఇప్పుడు ఆ మోదీని ‘విశ్వగురు’గా అభివర్ణిస్తున్నది? ఏ ప్రయోజనం ఆశించి ఈ నాటకం? ప్రజలకు జ్ఞాపక శక్తి తక్కువ, ఈ సభలో విన్నది ఆ సభలో మర్చిపోతారనే తక్కువ అంచనా వల్లే కదా ఇదంతా?

చిలకలూరిపేట సభలో మోదీ ఒక మహాశక్తి, ఆయనే ఒక అభివృద్ధి రూపం, ‘వికసిత్ భారత్’కు నిలువుటద్దం వంటి స్తోత్రాలను వినిపించారు. ఇటువంటి విచిత్ర విన్యాసాలు మనకు సినిమాల లోను, నాటకాలలోను మాత్రమే కనిపిస్తాయి. ప్రధాని ప్రసంగంలో కూడా వికసిత్ భారత్ మినహా కొత్త ప్రణాళిక ఏమీ కనిపించపోవటం విచిత్రమే. చంద్రబాబుతో పాటు వేదికపై ఉన్న భాగస్వామి పవన్ కల్యాణ్ కూడా నోటి మాట రానట్లు కనిపించారు. ఆయనలో సహజంగా కనిపించే ఉద్వేగం ఎందుకో చల్లారిపోయింది. మాట్లాడిన నాలుగు మాటలు మోదీ భజనకే సరిపోయింది. జతకట్టిన చంద్రబాబు – పవన్ కానీ, వారితో చేయి కలిపిన మోదీ కానీ రాష్ట్రానికి వారు ఏమి చేయదలచుకున్నారో ఏమి చెప్పదలచుకున్నారో ఎంత వెతికినా అర్థం కాని అయోమయం ఈ సభలో కనిపించింది.

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ప్రాణాలైనా అర్పిస్తామంటూ ప్రగల్భాలు పలికినవారే సాక్షాత్తు ప్రధాని మంత్రి ప్రక్కన కూర్చునప్పుడు అయినా పెదవి విప్పలేకపోయారంటే ఈ భాగస్తులందరినీ ఏమనుకోవాలి? పోలవరం ప్రాజెక్టు గురించి పూర్తిగా మర్చిపోయినట్లున్నారే! ఈ సభలో రాష్ట్రానికి ఎలాంటి హామీలు ఇవ్వలేదు సరికదా... కనీసం తమ పొత్తు వలన ఎటువంటి ప్రయోజనం రాష్ట్రానికి కలుగుతుందో కూడా చెప్పలేక పోయారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ నైనా రాష్ట్రానికి మిగులుస్తారో లేదో తేల్చలేకపోయారు. ఇక దేనికి ఈ ముగ్గురు చేతులు కలపడం? ఎన్నికల సభలోనే వారు ఏ హామీ ఇవ్వలేకపోతే ఎన్నికలైన తరువాత రాష్ట్రాన్ని పట్టించుకొంటారని గ్యారెంటీ ఏంటి?



రాజధాని భూముల విషయంలో టీడీపీ–జనసేనల మధ్య అభిప్రాయ భేదాలొచ్చి టీడీపీ చేయి వదిలిన పవన్ బీజేపీపైనా దుమ్మెత్తి పోశారు. కానీ ఇప్పుడు ఆ రెండు పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు. పొత్తులు పెట్టుకొంటే తప్ప విజయం సాధ్యం కాదని నమ్మినవారు ఆ పొత్తులైనా నిజాయితీగా పెట్టుకోవాలి కదా! 2014 ఎన్నికలకు ముందు పవన్ ప్రచారం చేస్తూ బీజేపీ, టీడీపీలను గెలిపిస్తే ఏపీకి ప్రత్యేక హోదా తెచ్చే పూచీ నాది అని ప్రకటించారు. ఆ కూటమి అధికారంలోకి వచ్చింది. కానీ ఆయన ఏం చేయగలిగారు? కనీసం వైఫల్యాన్ని అయినా ఒప్పుకొన్నారా? అప్పుడు పవన్ ప్రత్యక్షంగా పోటీకి దిగలేదు. కానీ ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలతో మళ్ళీ పొత్తు పెట్టుకొని, సీట్లు కూడా సర్దుబాటు చేసుకొని పోటీకి దిగుతున్నారు. మరి ఆ హామీలన్నీ మరచిపోయారా?

ఎన్నికల సమయంలో రకరకాల పార్టీలు పొత్తులు కోసం వెంపర్లాడడం సాధారణమే అయినా, ఆ పొత్తుల వెనుక ‘నైతిక విలువలు’ ఉన్నాయా అన్నది కూడా ఆలోచించాలి. 2019 ఎన్నికల్లో వాస్తవ పరిస్థితి ఏమిటో తెలుసుకొన్న చంద్రబాబు బీజేపీతో ఇక ఎలాంటి ప్రయోజనం ఉండదనుకొని ఆ పార్టీని విమర్శించారు. నిజానికి ఆ ఎన్నికల ప్రచారంలోనే ఈ రెండు పార్టీలూ ఎన్నడూ ఊహించనంతగా కత్తులు ఝుళిపించాయి. నరేంద్ర మోదీని ఓ టెర్రరిస్టు అంటూ అభివర్ణించారు బాబు. బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందంటూ చంద్రబాబు ధర్మ పోరాట దీక్షలు చేశారు. ఏం సాధించారు? రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వం అని కేంద్రం చెప్పడంతో ఎన్డీఏ కూటమి నుంచి అప్పట్లో బయటకు వచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఏ హామీ తీసుకొని మళ్ళీ ఆ కూటమిలోకి వెళ్ళారు?

మోదీ హైదరాబాద్‌లో అడుగు పెడితే అరెస్టు చేయిస్తానని 2002లో అన్న చంద్రబాబు 2014లో అదే మోదీతో ‘మీతో స్నేహమే మా భాగ్యం’ అంటూ పొత్తు పెట్టుకున్నారు. 2018లో ఆ పొత్తును తెగతెంపులు చేసుకొని ప్రధాని మోదీని టెర్రరిస్టు అన్నారు. ఇప్పుడు అదే మోదీ ప్రక్కన కూర్చొని ‘విశ్వగురు’ అంటూ కీర్తిస్తున్నారు. పొత్తు ధర్మమంటే ఇలాగే ఉంటుందని ఆయన చెబుతున్నారనుకోవాలా? మోదీ కంటే తానే సీనియర్ అనుకొనే చంద్రబాబు చాలా మంది జూనియర్ల నుంచి నేర్చుకోవలసింది ఎంతైనా ఉందని చెప్పాలి. జగన్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడం ఒక్కటే తమ పొత్తు ధర్మం అని చంద్రబాబు కానీ, ఆయన భాగస్థులు కానీ అనుకుంటే ప్రజలకు ఎలాంటి జవాబివ్వాలో తెలియదా? అన్ని నటనలనూ ప్రజలు గమనిస్తునే ఉంటారు.

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే । 98481 28844

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.7.24 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుబ్బ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.1.38 నుండి 3.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.04 నుండి 7.43 వరకు, **అమృతఘడియలు:** రా.12.11 నుండి 2.04 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.07, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

తెప్పలపై శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప విహారం



తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో మూడోరోజు శుక్రవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు తెప్పపై విహరించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు చేరుకుంది. స్వామి, అమ్మవార్లు ముమ్మార్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీకి మైనార్టీలు ఓటెందుకు వెయ్యాలి?

- బీజేపీతో పొత్తుపై లోకేశ్‌ను నిలదీసిన స్థానికుడు



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న లోకేశ్

మంగళగిరి: మంగళగిరిలో నారా లోకేశ్‌కు చుక్కెదురైంది. ప్రచారంలో భాగంగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ శుక్రవారం ముస్లిం మైనార్టీల నివాసాలకు వెళ్లి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు షబ్బీర్.. తన ఇంటికి వచ్చిన లోకేశ్‌ను నిలదీశారు. బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకున్న టీడీపీకి ముస్లిం మైనార్టీలు ఎందుకు ఓటెయ్యాలంటూ ప్రశ్నించారు. దీంతో కంగుతిన్న లోకేశ్.. ఏం సమాధానం చెప్పాలో తెలియక నీళ్లు నమిలారు. అనివార్య కారణాల వలన పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని ఈ ఒక్కసారికి అండగా నిలిచి మంగళగిరిలో తన పరువు కాపాడాలంటూ మైనార్టీలను బతిమాలుకోవాల్సి వచ్చింది.

పెంచలకోన లక్ష్మీనరసింహుని సేవలో చంద్రబాబు



శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటున్న చంద్రబాబు

సైదాపురం/రాపూరు(తిరుపతి జిల్లా): వెంకటగిరి నియోజకవర్గం రాపూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామిని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ప్రదక్షిణం చేసిన ఆయన ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పరసారత్నం, నెలవల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

భార్యకు శిరోముండనం

- అనుమానంతో కానిస్టేబుల్ నిర్వాకం



కానిస్టేబుల్ భవానీశంకర్

సీతమ్మధార (విశాఖ జిల్లా): విశాఖ నగరంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. భార్యకు శిరోముండనం చేసిన ఓ కానిస్టేబుల్ నిర్వాకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భవానీశంకర్‌కు మల్కాపురం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న గూడుపు జనయిత్రి మహాలక్ష్మికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ప్రస్తుతం రైల్వే న్యూకాలనీలో సాయి అఖిల్ రెసిడెన్సీలో నివాసముంటున్నారు. ఇదిలా ఉంటే మహాలక్ష్మి ఇంటి ఇరుగు పొరుగు వారి వద్ద సుమారు రూ.2.5 లక్షల అప్పు చేసింది. వారికి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఈ నెల 17వ తేదీన అందరూ ఇంటికి వచ్చి మహాలక్ష్మిని నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న భవానీశంకర్ 18వ తేదీన భార్యను నిలదీశాడు. ఆ డబ్బు ఏ ప్రియుడికి ఇచ్చావని దాడి చేశాడు. అంతటితో ఆగకుండా ట్రిమ్మర్‌తో గుండు గీసి.. రెండు కనుబొమ్మలు తీసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకున్న మహాలక్ష్మి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ విజయ్‌కుమార్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దండిగా ధాన్యం.. నిండుగా నిధులు

ఖరీఫ్ ధాన్యం సేకరణ చెల్లింపులు వారంలో పూర్తి



- 61వేల మంది రైతుల ఖాతాల్లోకి రూ.830 కోట్లు జమ
- 4.97లక్షల మంది రైతులకు రూ.6538 కోట్ల మద్దతు ధర అందించిన ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం సేకరణకు సన్నాహాలు
- ఐదేళ్ల కింద ఇదే సమయంలో రైతులకు కుచ్చుటోపీ పెట్టిన చంద్రబాబు
- మద్దతు ధరను ఆలస్యం చేసి రూ.4వేల కోట్లు పక్కదారి పట్టించిన టీడీపీ
- చివరికి చంద్రబాబు దిగిపోతూ రూ.960 కోట్లు బకాయిలు పెట్టిన దుస్థితి
- సీఎం జగన్ వచ్చిన తర్వాతే అత్యంత పారదర్శకంగా రైతుల ఖాతాల్లోకి మద్దతు ధర

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం రైతులకు బాసటగా నిలుస్తోంది. ధాన్యం కొనుగోలులో సంపూర్ణ మద్దతు ధర అందించడంతో పాటు.. దేశంలోనే తొలిసారిగా రైతులకు గన్నీ, హమాలీ, రవాణా (జీఎల్‌టీ) చార్జీల కింద టన్నుకు రూ.2523 అదనంగా చెల్లిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ఖరీఫ్ 2023–24లో 4.97లక్షల మంది రైతుల నుంచి రూ.6,538 కోట్ల విలువైన 29.91లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. వీటిల్లో 4.36లక్షల మంది రైతులకు రూ.5700 కోట్ల మద్దతు ధర చెల్లించింది. మిగిలిన 61 వేల మంది రైతులకు రూ.838 కోట్లు అందించేందుకు వీలుగా నిధులను సమీకరించింది. ఆర్బీకేల్లో షెడ్యూల్ చేసిన వివరాల ప్రకారం వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో మద్దతు ధర మొత్తాన్ని జమ చేయనుంది. తద్వారా ఖరీఫ్ కొనుగోళ్లలో సంపూర్ణ చెల్లింపులను చేయనుంది.

మొబైల్ బృందాలతో పరిశీలన..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. దళారీ, మిల్లర్ల వ్యవస్థకు చెక్‌పెడుతూ ఆర్బీకేల కేంద్రంగా ఈ–క్రాప్ డేటా ఆధారంగా ధాన్యం సేకరణ చేసి వాస్తవ రైతుకు సంపూర్ణ మద్దతు ధరను అందించే పటిష్ట వ్యవస్థను తీసుకొచ్చారు. క్షేత్ర స్థాయికి ఆర్బీకే అసిస్టెంట్ వెళ్లి నాణ్యతను పరిశీలించడం, ఆన్‌లైన్‌లో ధాన్యం రైతు వివరాలు నమోదు, ట్రక్ షీట్ జనరేట్, చివరికి ధాన్యం తరలించాల్సిన మిల్లును కూడా ఆటోమేటిగ్గా ఎంపిక చేసే సాంకేతిక విధానాన్ని తీసుకొచ్చారు. లోడు పక్కదారి పట్టకుండా రవాణా వాహనాలకు జీపీఎస్‌ను సైతం అమర్చారు. మిల్లుల్లో ధాన్యం నాణ్యత సమస్యలను రైతులతో సంబంధం లేకుండా పరిష్కరించేందుకు కస్టోడియన్ అధికారులను నియమించారు. ప్రస్తుతం ఎన్నికల సమయం నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే మండలానికి ఒక ప్రత్యేక మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేసి ధాన్యం రైతుల సమస్యలను పరిష్కరించేలా దృష్టి సారించారు. ప్రభుత్వ కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులతో పాటు స్థానికంగా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నారు.

ఇక రబీ సేకరణకు సమాయత్తం

ఖరీఫ్ ధాన్యం సేకరణ పూర్తవడంతో ఏప్రిల్ మొదటి వారం నుంచి రబీ కొనుగోళ్లకు పౌరసరఫరాల సంస్థ సమాయత్తం అవుతోంది. రబీ సీజన్‌లో 25లక్షల టన్నులకుపైగా ధాన్యం వస్తుందని అంచనా వేస్తోంది. ఈ మేరకు జిల్లాల వారీగా గోనె సంచులు, హమాలీలు, రవాణా సదుపాయాలను కల్పించేలా క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. గోదావరి జిల్లాల్లో రబీలో సాగు చేసే జయ రకం (దుడ్డు బియ్యం)ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు సేకరించనుంది. గతేడాది జయ రకం ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించగా కేవలం 90వేల టన్నులు మాత్రమే వచ్చింది. ఈసారి 3లక్షల టన్నులు సేకరించేలా ప్రణాళిక రూపొందించింది. అయితే జయరకం ధాన్యాన్ని ప్రభుత్వం స్వయంగా మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటం రైతులకు లాభసాటిగా మారింది. ఈ రకం ధాన్యం వినియోగం స్థానికంగా చాలా తక్కువ. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో దుడ్డు బియ్యాన్ని ఆహారంగా తీసుకుంటారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో గతంలో ప్రైవేటు వ్యాపారులు ఇచ్చిన రేటు తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వ జోక్యంతో ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి దుడ్డు బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

37.68 లక్షల మంది రైతులకు మద్దతు

టీడీపీ ఐదేళ్లలో కేవలం 17.94లక్షల మంది రైతుల నుంచి రూ.40,236.91 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించింది. కానీ, సీఎం జగన్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఏకంగా 37.68 లక్షల మంది రైతుల నుంచి రూ.65,142.29 కోట్ల విలువైన 3.40 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం విశేషం. అంటే టీడీపీ హయాంలో కంటే 20లక్షల మంది రైతులకు అదనంగా సీఎం జగన్ ప్రభుత్వం మద్దతు ధర అందించింది.

దిగుబడిలో 60 శాతం కొనుగోలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా బీపీటీ, నెల్లూరు, స్వర్ణ రకాలను పండిస్తున్నారు. వీటికి జాతీయ, అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంటుంది. ఇవి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కాకుండా బయటకు వెళ్లిపోతాయి. మిగిలిన రకాల ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఇలా.. ఏపీలో ధాన్యం దిగుబడుల్లో రైతుల అవసరాలకు నిల్వ చేసిన తర్వాత 60 శాతం పైగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తోంది.

గత ప్రభుత్వంలో మద్దతు ధర పొందిన రైతులు ఇలా..

సంవత్సరం	రైతులు(లక్షల్లో)	విలువ(రూ.కోట్లలో)
2014-15	1.17	5,583.03
2015-16	2.72	9,238.41
2016-17	5.26	8,261.40
2017-18	4.96	9,352.26
2018-19	3.81	7,801.81
(ఖరీఫ్ మాత్రమే)		

ప్రస్తుత ప్రభుత్వంలో మద్దతు ధర పొందిన రైతులు ఇలా..

సంవత్సరం	రైతులు(లక్షల్లో)	విలువ(రూ.కోట్లలో)
2018-19	1.89	4,838.03
(రబీ మాత్రమే)		
2019-20	6.75	15,037.12
2020-21	8.03	15,841.41
2021-22	8.11	12,943.50
2022-23	7.98	10,105.92
2023-24	4.97	6,583.00
(ఖరీఫ్ మాత్రమే)		

బాబు హయాంలో బకాయిలే!


గతంలో రైతులకు మద్దతు ధర పేరుతో దళారులకు, మిల్లర్లకు దోచిపెట్టేవారు. పేరుకే ప్రభుత్వం ధాన్యం సేకరణ చేసేది. కొనేదంతా మిల్లర్లు.. దళారులే. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని 75 కేజీల బస్తాకు మద్దతు ధర కంటే రూ.200 వరకు తగ్గించి ఇచ్చేవారు. ఇలా ఎకరానికి తక్కువలో తక్కువ 30 నుంచి 33 బస్తాల దిగుబడి వేసుకున్నా.. రూ.6వేలకు పైగా ప్రత్యక్షంగా రైతులు నష్టపోయేవారు. పైగా అప్పటి ఎన్నికల ముందు రైతులకు చెల్లించాల్సిన రూ.4వేల కోట్ల ధాన్యం డబ్బులను చంద్రబాబు ప్రచార పథకాలకు మళ్లించడంతో సమయానికి డబ్బులు అందక రైతులు అల్లాడిపోయారు. చివరికి చంద్రబాబు దిగిపోతూ ఇంకా రూ.960 కోట్లు బకాయిలు పెట్టారు. వీటిని కూడా సీఎం జగన్ ప్రభుత్వమే చెల్లించింది.

రికార్డు స్థాయిలో కరెంట్ వినియోగం

రాష్ట్రంలో రోజుకి 238.79 మిలియన్ యూనిట్ల వాడకం

గతేడాది కంటే 43.01 శాతం ఎక్కువ • ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో పీక్ డిమాండ్

అవసరం మేరకు మార్కెట్‌లో కొనుగోలు • రోజుకి రూ. 35.25 కోట్లు వ్యయం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోయింది. గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగంతో ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ డిమాండ్ 238.79 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గతేడాది ఇదే సమయానికి వినియోగం 166.97 కంటే 43.01 శాతం ఎక్కువ. రోజులో పీక్ డిమాండ్ 12,802 మెగావాట్లుగా ఉంది. ఇది గతేడాది ఇదే సమయానికి 7,997 మెగావాట్లు మాత్రమే ఉంది. అంటే 60.09 శాతం పెరిగింది. అయినప్పటికీ విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు వినియోగదారులకు కరెంట్ సరఫరా చేస్తున్నాయి.

ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా..

గత సంవత్సరం వేసవిలో మన రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 265 మిలియన్ యూనిట్లకు చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ ఏడాది ఆ రికార్డు బ్రేక్ అవుతుందని అంచనా. దీనికి తగ్గట్టు విద్యుత్ సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేశాయి. కృష్ణపట్నంలోని శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో గతేడాది 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. ఇబ్రహింపట్నంలోని ఎన్‌టీటీపీఎస్ (వీటీపీఎస్)లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్–8లోనూ ఉత్పత్తి ముందుగానే ప్రారంభించారు. అలాగే వీటీపీఎస్‌లో రోజుకి 32,186 మెట్రిక్ టన్నులు, ఆర్టీపీపీలో 16,443 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నంలో 23,632 మెట్రిక్ టన్నులు, హిందూజాలో 14,277 మెట్రిక్ టన్నులు చొప్పున బొగ్గును వినియోగిస్తూ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి.

కొనుగోలుకు వెనుకాడని ప్రభుత్వం

రాష్ట్ర ప్రజలకు విద్యుత్ లోటు రాకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఏపీజెన్‌కో థర్మల్ నుంచి 91.081 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 4.920 మి.యూ, ఏపీ జెన్‌కో సోలార్ నుంచి 2.269 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 35.925 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 32.213 మి.యూ, సోలార్ నుంచి 20.647 మి.యూ, విండ్ నుంచి 12.359 మిలియన్ యూనిట్లు చొప్పున సమకూరుతోంది. అయితే ఇది మాత్రమే సరిపోవడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి రోజుకు యూనిట్ సగటు రేటు రూ. 8.764 చొప్పున రూ. 35.253 కోట్లతో 40.224 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ విధంగా డిమాండ్‌ను అందుకోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జార్ఖండ్, ఉత్తరాఖండ్, బిహార్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మన దగ్గర కంటే తక్కువ విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ విద్యుత్ కొరత ఏర్పడింది.

బకాయిలు ఎగ్గొట్టినందుకు.. 'గంటా' ఆస్తుల వేలానికి నోటీసులు

- ఇండియన్ బ్యాంకుకు రూ.390.07 కోట్ల మేర 'గంటా గ్యాంగ్' ఎగనామం
- 5,324.54 గజాల స్థలాలు స్వాధీనానికీ నోటీసులు జారీ



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన బంధువులు ఇండియన్ బ్యాంకుకు పంగనామాలు పెట్టారు. వందల కోట్ల రుణాలు ఎగవేసి బ్యాంకుకు కుచ్చు టోపీ పెట్టారు. తీసుకున్న రుణాలను వడ్డీతో సహా వసూలు చేసుకునేందుకు వరుసగా డిమాండ్ నోటీసులిచ్చినా పట్టించుకోకపోవడంతో ఇక చేసేది లేక తనఖాపెట్టిన వాటిలో పలు ఆస్తులను స్వాధీనం చేసుకున్న ఇండియన్ బ్యాంక్.. తాజాగా మరోసారి జారీ చేసిన స్వాధీనత ప్రకటన కలకలం రేపుతోంది. విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని 5,324.54 గజాల స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్టు నోటీసులిచ్చింది. మరోవైపు ఇప్పటికే స్వాధీనం చేసుకున్న విశాఖ నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న వాణిజ్య సముదాయాలు, ఫ్లాట్ల వేలానికి నోటీసులిచ్చింది. విశాఖ వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ఉంది. కంపెనీలో యాక్టివ్ డైరెక్టర్లుగా గంటా తోడల్లుడైన పరుచూరి వెంకటభాస్కరరావు, ఆయన సోదరులు రాజారావు, వెంకయ్య ప్రభాకరరావులున్నారు. కాగా, ఈ కంపెనీకి గంటా శ్రీనివాసరావుతో పాటు కొండయ్య, బాలసుబ్రహ్మణ్యం, నార్ని అమూల్యలు హామీదారులుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరుతో డాబా గార్డెన్స్ శారదా వీధిలో ఉన్న ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంది. రుణం పొందినప్పటి నుంచి ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఒక దఫా తీసుకున్న రుణం తాలుక బకాయిలు అక్షరాలా రూ.390.58 కోట్లుగా బ్యాంకు అధికారులు గణించారు. మరో దఫా రుణానికి సంబంధించి వడ్డీతో కలిపి రూ.141.68 కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు పలు దఫాలుగా నోటీసులిస్తూ వచ్చారు. ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం, మరో పక్క గడువు ముగియడంతో ఆస్తుల స్వాధీనం చేసుకోవడం మొదలెట్టింది. అయినా బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి ఏడు ప్లాట్స్‌లో పూచీకత్తుగా పెట్టిన మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్టు ఈ నెల 18న నోటీసులిచ్చారు. ప్రత్యూష కంపెనీకి చెందిన ఆస్తులు, కంపెనీ డైరెక్టర్లయిన పరుచూరి వెంకటభాస్కరరావు, రాజారావు, వెంకయ్య ప్రభాకరరావుల ఆస్తులతో పాటుగా కంపెనీకి హామీదారులుగా ఉన్న మంత్రి గంటా, కేబీ సుబ్రహ్మణ్యం, అమూల్యల ఆస్తులనూ స్వాధీనం చేసుకుంటుంటున్నామని బ్యాంక్ స్వాధీనత ప్రకటన జారీ చేసింది. వీరికి చెందిన పద్మనాభం మండలం ఐనద గ్రామం వద్ద ఉన్న సర్వే నం.12లో స్టార్ విలేజ్ పేర్న వుడా లేఅవుట్‌లోని 5326.54 చదరపు గజాల విస్తీర్ణంలో ఏడు ప్లాట్స్‌లో ఉన్న 33 ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్టు నోటీసుల్లో స్పష్టం చేసింది.

స్వాధీనం చేసుకున్న ఆస్తుల విక్రయం

రూ.390.58 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు గతంలో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల విక్రయానికి కూడా ఈ నెల 18న బ్యాంకు నోటీసులిచ్చింది. మెస్సర్స్ ప్రత్యూష అసోసియేట్స్ పేరుతో నగరంలోని గంగులవారి వీధిలో ఉన్న వాణిజ్య భవనం, ద్వారకానగర్‌లోని అదే సంస్థ పేరుతో శ్రీకాంత కాంప్లెక్స్‌లో ఉన్న ఫ్లాట్ నం.138సీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని త్రివేణి టవర్స్‌లో ఫ్లాట్ నం.12ని గతంలో స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఏప్రిల్ 16న వేలం వేస్తున్నట్టు ఇండియన్ బ్యాంకు ప్రకటించింది. కాగా, పోర్టులో వ్యాపారలావాదేవీల కోసం మాజీ మంత్రి గంటా స్వయంగా తన బంధువులతో కలిసి ఈ కంపెనీ ప్రారంభించారని.. ప్రారంభంలో డైరెక్టర్‌గా కొంత కాలం కొనసాగారని తెలుస్తోంది.

హిందువుల ఓట్లు టీడీపీకి అక్కర్లేదా?

కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి

హిందూపురం: భావ దారిద్ర్యం, బావ గారి దరిద్రం రెండూ హిందూపురంలో కనిపిస్తున్నాయని, వీటి నుంచి బయటకు రావాలని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. శుక్రవారం ఆయన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హిందూపురంలోని 2.20 లక్షలకు పైగా ఓట్లలో హిందువులందరూ తమకు అక్కరలేదని, వారి (ముస్లిం) ఓట్లు 40 వేలు ఉంటే చాలని అని టీడీపీ వాళ్లు అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఇక్కడి హిందువులను టీడీపీ వాళ్లు గొర్రెలనుకుంటున్నారా అని నిలదీశారు. స్వామిజీకి ఎంపీ టికెట్ ఇస్తే బాలకృష్ణకు ముస్లింలు దూరమై ఓటమి పరిస్థితులు వస్తాయని అనుకుంటే.. ఆ స్వామిజీకి అడ్డుపడిన టీడీపీకి హిందువులు ఓటు వేయకుండా ఉండే పరిస్థితులు కూడా ఏర్పడతాయని హెచ్చరించారు. హిందూపురం ఎంపీ సీటుకు టీడీపీ అభ్యర్థిని ప్రకటించినా.. చిట్టచివరికి ఈ స్థానం బీజేపీకే ఇస్తారన్న ఆశాభావంతో ఉన్నానన్నారు. ఎంపీగా పోటీ చేసి హిందూపురాన్ని అభివృద్ధి చేయాలనే భావనతో ఇక్కడకు వచ్చానన్నారు.

పీకలు కోస్తా.. అంతు చూస్తా

గన్నవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కడప టీడీపీ అభ్యర్థి హల్‌చల్

గన్నవరం: కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్పగారి మాధవీరెడ్డి శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద హల్‌చల్ చేశారు. కార్యాలయం వద్ద ఉన్న సిద్ధం బ్యానర్‌ను వీడియో తీస్తూ.. బ్యానర్‌ను పూర్తిగా కప్పలేదంటూ హంగామా సృష్టించారు. ఈ సమయంలో ఆమెను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మీ పీకలు కోస్తా, మీ అంతు చూస్తా అంటూ బెదిరింపులకు దిగారు. అనంతరం ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే ప్రయత్నం చేయగా ఆమె సహకరించలేదు. పోలీసులతో ఆమె వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపటికి టీడీపీ నేతలు కూడా అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు ఇరు పార్టీ నేతలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపేశారు. ప్రశాంతంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మాధవీరెడ్డి అలజడి సృష్టించేందుకు ప్రయత్నం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్టపరంగా ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధురాలిని 8 ముక్కలుగా నరికి..

బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వమన్నందుకు ఘాతుకం

మృతదేహాన్ని పెన్నానదిలో పడవేసిన వైనం • 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు



పెన్నానదిలో ఓబులమ్మ శరీర భాగాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు



(ఇన్‌సెట్‌లో) ఓబులమ్మ (ఫైల్)

గార్లదిన్నె: బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వృద్ధురాలు దారుణహత్యకు గురైంది. ఈ ఘటన అనంతపురం జిల్లా, గార్లదిన్నె మండలం యర్రగుంట్లకు చోటుచేసుకుంది. ఈ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి..నిందితులను రిమాండుకు తరలించారు. శుక్రవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా, సింహాద్రిపురం మండలం, కొత్తపల్లికి చెందిన ఓబులమ్మకు చాలా ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త చనిపోగా, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటోంది. తన అన్న కుమార్తె (మేనకోడలు) శివలక్ష్మికి యర్రగుంట్లలో దాదాపు ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని ఓబులమ్మ సాగుచేసుకుంటూ యర్రగుంట్లలోనే నివాసం ఉంటోంది. గురువారం ఉదయం నుంచి ఓబులమ్మ కనిపించకపోవడంతో గ్రామస్తులు అనంతపురంలో ఉంటున్న శివలక్ష్మికి సమాచారం అందించారు. దీంతో ఆమె గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా..హత్య వెలుగు చూసింది.

ఆభరణాల కోసం..

ఓ శుభకార్యం నిమిత్తం ఓబులమ్మ వద్ద ఉన్న బంగారు గొలుసు, నాలుగు బంగారు గాజులు యర్రగుంట్ల గ్రామానికే చెందిన బీరే కృష్ణమూర్తి తీసుకున్నాడు. అనంతరం వాటిని ఓబులమ్మకు తెలియకుండా ఓ ప్రైవేట్ బ్యాంకులో కుదువ పెట్టాడు. ఆభరణాలు ఇచ్చి నెలరోజులు దాటుతున్నా తిరిగివ్వకపోవడంతో నగల కోసం ఓబులమ్మ కృష్ణమూర్తిపై ఒత్తిడి తెచ్చింది. వాటిని ఇవ్వకూడదనే దురుద్దేశంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం ఓబులమ్మ వద్దకు వెళ్లి బంగారు నగలు ఇస్తానంటూ నమ్మబలికాడు. ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని నేరుగా తాను కౌలుకు చేస్తున్న వరి మడి వద్దకు తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడున్న భార్య లక్ష్మీదేవి, కుమారులు భరత్ కుమార్, లోక్‌నాథ్, కోడలు (మైనర్) సహకారంతో ఓబులమ్మను గొడ్డలితో నరికి చంపారు. తల, మొండెం, కాళ్లు, చేతులు..ఇలా శరీరాన్ని ఎనిమిది ముక్కలు చేశారు. రెండు సంచుల్లో వేసుకుని సొంత ట్రాక్టరులో తీసుకెళ్లి పెనకచెర్ల డ్యాం వద్ద కొనేపల్లి దారిలో పెన్నానదిలో పడేశారు. ఈ దృశ్యాన్ని దూరం నుంచి గమనించిన గొర్రెల కాపరులు విషయాన్ని పెనకచెర్ల డ్యాం గ్రామంలో తెలియజేశారు. చివరకు ఈ సమాచారం పోలీసులకు అందింది. వారు గురువారం అర్ధరాత్రి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. యర్రగుంట్ల ఇన్‌చార్జ్ వీఆర్వో గోవిందరాజుల సమక్షంలో నిందితులు లొంగిపోయారు. పోలీసులు వారిని రిమాండుకు తరలించారు. నేరానికి ఉపయోగించిన గొడ్డలి, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు.

‘ఆమ్ ఆద్మీ పార్టీకి జరగకూడని వేళ, జరగకూడనంతటి భారీ నష్టం’

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ జాతీయ సమన్వయకర్త, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుపై సర్వత్రా వ్యక్తమవుతున్న అభిప్రాయమిది. రాజకీయ నిపుణుల నుంచి సామాన్య ప్రజల దాకా ఇదే భావన నెలకొని ఉందంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు విపక్షాల భవితవ్యాన్ని తేల్చేస్తాయని భావిస్తున్న అత్యంత కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ జరిగిన ఈ అరెస్టు ఆప్‌కు నిజంగా కోలుకోలేని దెబ్బే. ఎందుకంటే ఆ పార్టీకి సర్వం కేజ్రీవాలే. ఆయన స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగల నాయకులెవరూ లేరు. కాస్తో కూస్తో జనాకర్షణ ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇప్పటికే ఇదే కేసులో జైల్లో మగ్గుతున్నారు. దాంతో సహజంగానే పార్టీ సారథిగా, సీఎంగా కేజ్రీవాల్ స్థానాన్ని తాత్కాలికంగా భర్తీ చేయగల స్థాయి ఉన్న నేతలెవరూ ఆప్‌లో కన్పించడం లేదు. కేజ్రీయే సీఎంగా కొనసాగుతారని, అవసరమైతే జైలు నుంచే పాలన కొనసాగిస్తారని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనల అంతర్యమూ అదే. చట్టపరంగా అందుకు అడ్డంకులేమీ లేకపోయినా జైలునుంచి సీఎంగా కొనసాగడం అసాధ్యమేనన్న అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది. అందులో ఇమిడి ఉన్న రాజ్యాంగపరమైన సవాళ్లను ఎత్తిచూపుతూ రాష్ట్రపతి పాలనకు లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేస్తారని, చివరికి ఢిల్లీ రాష్ట్రపతి పాలనలోకి వెళ్లవచ్చని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే ఆప్ పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు చందమే అవుతుంది. సమస్యలు కూడా రెట్టింపవుతాయి. ఏదేమైనా 12 ఏళ్ల ఆ పార్టీ ప్రస్థానంలో ఎన్నడూ లేనంత అతి పెద్ద సమస్యను ప్రస్తుతం ఎదుర్కొంటోంది. జాతీయ పార్టీగా మారడమే గాక పంజాబ్‌లోనూ అధికారం చేజిక్కించుకుని, దేశవ్యాప్తంగా మరింతగా విస్తరించే ప్రయత్నాల్లో ఉన్న ఆప్, ఏకంగా తన ఉనికికే సవాలుగా మారిన ఈ పెను గండం నుంచి బయట పడగలదా అన్నది వేచి చూడాల్సిన అంశమే.

ఆమ్ ఆద్మీ భవితవ్యం ఏమిటీ?

- కేజ్రీ అరెస్టును తట్టుకుని నిలిచేనా!
- పార్టీలో ఆయన స్థానాన్ని భర్తీ చేసే నేతలేరీ?
- ఇప్పటికే జైలుపాలైన సిసోడియా తదితరులు
- లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, పంజాబ్‌ల్లో భారీ దెబ్బే



చాలాకాలం జైల్లోనే...?

ఆప్ నేతలు సిసోడియా, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్ తరహాలోనే కేజ్రీవాల్ కూడా ఇప్పట్లో జైలు నుంచి బయటికొచ్చే అవకాశాలు కన్పించడం లేదు. అదే జరిగితే ఆప్ మనుగడే ప్రమాదంలో పడవచ్చు. ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలకు ఆరో విడతలో మే 25న, పంజాబ్‌లోని 13 స్థానాలకు జూన్ 1న ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. కీలకమైన రెండు నెలలూ ఆప్‌ను అనుక్షణం నాయకత్వ లేమి వేధించనుంది. ఢిల్లీ, పంజాబ్‌లో కేజ్రీవాల్ ప్రచారంపైనే పార్టీ ప్రధానంగా ఆధారపడింది. ప్రస్తుత ఆప్ నేతల్లో గట్టిగా విన్పించే పేర్లు ఆతిషి మర్లేనా, రాఘవ్ చద్దా, సౌరభ్ భరద్వాజ్ మాత్రమే. వీరిలో ఎవరికీ పాలనపరమైన అనుభవం లేదు. రాజకీయంగా కూడా కేజ్రీవాల్ స్థాయిలో బీజేపీని ఢీకొనగల సత్తా కూడా అంతంతమాత్రమే.

హస్తినలో అస్తవ్యస్తమే!

ఆప్, కేజ్రీవాల్ హవా ఎంతగా ఉన్నా గత పదేళ్లుగా లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ హవాయే కొనసాగుతూ వస్తోంది. ఆప్ ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ అక్కడ బీజేపీ ఏకపక్ష విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘనవిజయం కట్టబెడుతున్నా లోక్‌సభకు వచ్చేసరికి కాషాయ మంత్రం జపించడం ఢిల్లీ ఓటర్లకు ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈసారి ఎలాగైనా దీన్ని మార్చి సత్తా చూపాలని కేజ్రీవాల్ కృతనిశ్చయంతో ఉన్నారు. ‘లోక్‌సభలోనూ కేజ్రీవాల్, ఢిల్లీలో మరింత ప్రగతి’, ‘గుజరాత్‌లోనూ కేజ్రీవాల్’ అంటూ ఆప్ ఎన్నికల నినాదాలు కూడా పూర్తిగా ఆయనను కేంద్రంగా చేసుకునే రూపొందాయి. ఇలాంటి సమయంలో ఆయన జైలుపాలవడంతో ఒక్కసారిగా ఆప్ లోక్‌సభ ఎన్నికల ప్రణాళికే తలకిందులైపోయింది. ఇదిక్కడితో ఆగకపోవచ్చని, వచ్చే ఏడాది జరగనున్న కీలకమైన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపైనా ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్ ఘనవిజయం సాధించడం తెలిసిందే. ప్రాంతీయ పార్టీల నేతల్లో మమత వంటి దిగ్గజాలే మోదీ సర్కారు ధాటికి వెనుకంజ వేసినా కేజ్రీవాల్ మాత్రం ప్రధానితో నిత్యం ఢీ అంటే ఢీ అంటున్నారు. అలా పదేళ్లుగా బీజేపీకి కంట్లో నలుసుగా మారారు. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు ఎలాగైనా ముకుతాడు వేయాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. కేజ్రీ గైర్హాజరీలో డీలా పడ్డ ఆప్ నేతలను నయానో భయానో లొంగదీసుకుని ఆ పార్టీ ఉనికే లేకుండా చేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేయడం ఖాయమంటున్నారు.

సానుభూతి కష్టమే...?

అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించడం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ అవినీతి కేసులో జైలుపాలు కావడాన్ని సమర్థించుకోవడం ఆప్ నేతలకు కష్టంగానే కన్పిస్తోంది. ఆ పార్టీ వాదన ఎలా ఉన్నా ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం వాస్తవమేనన్న అభిప్రాయం ప్రజల్లో గట్టిగా ఉంది. కనుక కేజ్రీవాల్‌కు, ఆయన అరెస్టు విషయంలో ఆప్‌కు పెద్దగా సానుభూతి లభించే అవకాశాలు లేవంటున్నారు. ఆప్ వర్గాలను మరింతగా కలవరపరిచే అంశమిది. మద్యం ఆదాయంపై అత్యాశ వద్దని తానెంత చెప్పినా కేజ్రీ విన్లేదంటూ ఆయనకు గురుతుల్యుడైన సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే చేసిన తాజా వ్యాఖ్యలు ఆప్‌కు మరింత చేటు చేసేవే.

‘ఇండియా’ కూటమి డీలా

ఇప్పటికే జనాకర్షక నాయకుల కొరత ఉన్న కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి కూడా కేజ్రీవాల్ అరెస్టుతో మరింతగా డీలా పడింది. జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ వంటి అగ్ర నేతలు ఇప్పటికే కూటమిని వీడారు. దాంతో సోనియా, రాహుల్, ఖర్గే తర్వాత కేజ్రీవాల్ మినహా దేశవ్యాప్త ఆదరణ ఉన్న నాయకులు కూటమిలో పెద్దగా లేరు. ఖాతాల స్తంభన తదితరాలతో ఇప్పటికే నిధుల కొరతతో కిందా మీదా అవుతున్న కాంగ్రెస్‌ను ఈ పరిణామం మరింతగా నిస్తేజపరుస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాలే అసలు కుట్రదారు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆయనే కీలక సూత్రధారి: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఆరు రోజులపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీకి అప్పగిస్తూ రౌజ్‌అవెన్యూ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేజ్రీవాల్‌ను ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ కోర్టులో ప్రవేశపెట్టాలని ఈడీని ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా ఆదేశించారు. మద్యం కుంభకోణంలో విచారణ కోసం కేజ్రీవాల్‌ను 10 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ విజ్ఞప్తి చేయగా, న్యాయస్థానం కేవలం ఆరు రోజులపాటు కస్టడీకి అనుమతించింది. కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పటిష్టమైన భద్రత మధ్య ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. ఢిల్లీ మద్యం కుంభకోణం వెనుక ఉన్న అసలు కుట్రదారు, కీలక సూత్రధారి అరవింద్ కేజ్రీవాలేనని తేల్చిచెప్పారు. ఆయనతో పాటు పలువురు ఢిల్లీ మంత్రులు, ఆమ్ ఆద్మీ పార్టీలు నేతలు ఈ కేసులో భాగస్వాములేనని స్పష్టం చేశారు. ఢిల్లీలో 2021–22లో నూతన లిక్కర్ పాలసీని రూపొందించి, అమలు చేసినందుకు గాను ‘సౌత్ గ్రూప్’ నుంచి కేజ్రీవాల్ కోట్లాది రూపాయలు ముడుపులుగా స్వీకరించారని ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా దృష్టికి తీసుకొచ్చారు. సౌత్ గ్రూప్‌కు చెందిన కొందరు నిందితుల నుంచి రూ.100 కోట్ల మేర వసూలు చేశారని వెల్లడించారు. నాలుగు హవాలా మార్గాల్లో అందిన రూ.45 కోట్లను గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. మిగిలిన సొమ్ము ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నేతలకు నగదు రూపంలో అందిందని తెలిపారు. నిందితులు, సాక్ష్యుల కాల్ డిటైల్ రికార్డులు(సీడీఆర్), స్టేట్‌మెంట్లు ఇదే విషయాన్ని నిరూపిస్తున్నాయని తెలియజేశారు. అవినీతి కోసం కేజ్రీవాల్ తన పదవిని వాడుకున్నారని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌ను ప్రశ్నించి, మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని, అందుకే ఆయనను 10 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించాలని న్యాయస్థానానికి ఎస్.వి.రాజు విజ్ఞప్తి చేశారు. అరవింద్ కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనూ సింఘ్వీ హాజరయ్యారు. ‘‘సిట్టింగ్ సీఎంను అరెస్టు చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ కేసులో ఆయనను అరెస్టు చేయాల్సిన అవసరమే లేదు. కేజ్రీవాల్ తప్పు చేశారనేందుకు ఎలాంటి సాక్ష్యాలూ లేవు’’ అని వాదించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ఉపసంహరించుకున్నారు. దీనిపై విచారణ చేపడతామని ఉదయమే సుప్రీంకోర్టు వెల్లడించగా పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కేజ్రీవాల్ తరఫున అభిషేక్ సింఘ్వీ మధ్యాహ్నం కోర్టుకు తెలిపారు. ఇదే కేసులో నిందితురాలైన బీఆర్‌ఎస్ నేత కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు నిరాకరించిన కాసేపటికే కేజ్రీవాల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. ట్రయల్ కోర్టులో విచారణ తర్వాత మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సింఘ్వీ చెప్పారు.

జైల్లో ఉన్నా సీఎంగా కొనసాగుతా

తన జీవితం దేశ సేవకే అంకితమని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. శుక్రవారం కోర్టు నుంచి బయటికొచ్చాక ఆయన మీడియాతో మాట్లాడారు. జైలు బయట ఉన్నా, లోపలున్నా సీఎంగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

‘లిక్కర్’కు దూరంగా ఉండాలని హెచ్చరించా: అన్నా హజారే

ముంబై: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు ఆయన చర్యలే కారణమని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చెప్పారు. మద్యం పాలసీకి సంబంధించిన అంశాలకు దూరంగా ఉండాలని కేజ్రీవాల్‌ను చాలా సందర్భాల్లో హెచ్చరించానని అన్నారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో అన్నా హజారే శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ‘‘మద్యం మనిషి ఆరోగ్యానికి హానికరమని చిన్న పిల్లలకు కూడా తెలుసు. లిక్కర్ పాలసీకి దూరంగా ఉండాలని కేజ్రీవాల్‌కు చాలా సార్లు చెప్పాను. లిక్కర్ పాలసీని రూపొందించడం మన ఉద్యోగం కాదని వివరించా. అయినా వినలేదు. పాలసీని రూపొందించి అమలు చేశారు. కేజ్రీవాల్ తప్పు చేయకపోతే అరెస్టై ఉండేవారే కాదు. మరింత ఎక్కువ డబ్బు సంపాదించడానికే మద్యం పాలసీని కేజ్రీవాల్ తయారు చేసి ఉంటారు. మద్యానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో నాతో కలిసి పనిచేసిన కేజ్రీవాల్ అదే మద్యం పాలసీకి సంబంధించిన వ్యవహారంలో అరెస్టు కావడం బాధ కలిగిస్తోంది’’ అని అన్నా హజారే పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా దశాబ్దం క్రితం జరిగిన ఉద్యమంలో అన్నా హజరే, అరవింద్ కేజ్రీవాల్ క్రియాశీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

రాత్రంతా లాకప్‌లో..

న్యూఢిల్లీ: ఆప్ సారథి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ కస్టడీలో తొలి రాత్రి భారంగా గడిచింది. లాకప్ రూములో ఉంచి మంచం లేకుండా పరుపు, దుప్పటి మాత్రం ఇచ్చారు. ఏసీ సదుపాయం కల్పించారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో గురువారం సాయంత్రం నుంచి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో గంటల తరబడి ప్రశ్నించిన ఈడీ అధికారులు, రాత్రి 11 గంటల ప్రాంతంలో అరెస్టు చేయడం తెలిసిందే. రాత్రి భోజనం అనంతరం ఆయనను ఈడీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కేజ్రీని లాకప్ గదికి తరలించారు. అక్కడ ప్రత్యేక సదుపాయాలేవీ కల్పించలేదు. కేజ్రీవాల్ పెద్దగా నిద్ర పోకుండా భారంగానే గడిపినట్టు సమాచారం. శుక్రవారం ఉదయం చాయ్, అల్పాహారం అందించారు. మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్ ఇన్సులిన్ తీసుకునేందుకు ఏర్పాటు చేశారు. కాసేపటికి కాఫీ ఇచ్చారు. తర్వాత కోర్టులో హాజరు పరిచారు.

నిర్బంధంలో సీఎం కుటుంబం: ఆప్ మంత్రుల ధ్వజం

కేజ్రీవాల్ కుటుంబాన్ని కలిసేందుకు ఆయన నివాసంలోనికి పోలీసులు అనుమతించడం లేదంటూ ఆప్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ‘‘సీఎం కుటుంబాన్ని గృహ నిర్బంధంలో ఉంచారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రిని, అరెస్టుతో కుంగిపోయిన కుటుంబాన్ని ఓదార్చనివ్వరా? ఇందుకు ఏ చట్టం అనుమతినిచ్చింది? హౌజ్ అరెస్ట్‌ను ఆపేయండి’’ అంటూ నినదించారు.

అధికారం కోసమే అరెస్టు: కేజ్రీవాల్ భార్య

తన భర్తను అక్రమంగా అరెస్టు చేసి ఢిల్లీ ప్రజలకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని కేజ్రీవాల్ భార్య సునీత మండిపడ్డారు. ఢిల్లీలో అధికారం దక్కించుకోవాలన్న ఆరాటంతోనే అరెస్టు చేశారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రశ్నించేవారిని అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఆందోళనలు, అరెస్టులు

కేజ్రీవాల్ అరెస్టుతో ఢిల్లీలో ఉద్రిక్తత.. అదుపులోకి మంత్రులు, కార్యకర్తలు

న్యూఢిల్లీ: ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీ నేతలు, ఢిల్లీ రాష్ట్ర మంత్రులు బీజేపీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనలు, నిరసనలతో ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో ఆందోళనకు దిగిన ఆప్ నేతలను పోలీసులు అరెస్ట్‌చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆప్, బీజేపీ ప్రధాన కార్యాలయాలు ఉన్న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్ సమీప ఐటీఓ ఇంటర్‌సెక్షన్ కూడలి వద్దకు ఆప్ నేతలు, కార్యకర్తల పెద్ద సంఖ్యలో చేరుకుని మోదీ సర్కార్ వ్యతిరేక నినాదాలు చేశారు. ‘అరవింద్ మీరు సంఘర్షణను కొనసాగించండి. మేం మీకు తోడుగా ఉంటాం’ అని నినదించారు. ట్రాఫిక్ స్తంభించడంతో ధర్నాకు దిగిన వారిని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నంచేశారు. అక్కడే ఆందోళనకు దిగిన ఢిల్లీ రాష్ట్ర మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సుల్లో వేరే చోట్లకు తరలించారు. దీంతో తమ నేతలను విడుదలచేయాలంటూ మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలుచేశారు. పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్‌జోత్ సింగ్ బైన్స్ సహా మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనలను అదుపులోకి తెచ్చేందుకు పారామిలటరీ సిబ్బందిని రంగంలోకి దింపారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్‌ను విధించారు. ఐటీవో స్టేషన్‌ను సాయంత్రందాకా ఢిల్లీ మెట్రో రైల్ మూసేసింది. ఈడీ ప్రధాన కార్యాలయం, బీజేపీ ఆఫీస్‌ల వద్ద భారీగా బలగాలను మోహరించారు. ‘‘తప్పుడు కేసులతో నిన్న సీఎంను అరెస్ట్‌చేశారు. ఈరోజు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్ట్ చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే’’ అంటూ మంత్రులు ఆతిశీ, సౌరభ్ మండిపడ్డారు.

కస్టడీలో కేజ్రీవాల్‌కు రక్షణేది: ఆతిషి

ధర్నాకు ముందు మంత్రి ఆతిషి పత్రికాసమావేశంలో మాట్లాడారు. ‘‘సీఎం హోదాలో కేజ్రీవాల్ చుట్టూ నిరంతరం జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉండేది. ఇప్పుడు ఈడీ కస్టడీలో కేంద్రం ఆయనకు అంతటి భద్రత కల్పిస్తోందా? ఆయన భద్రతకు జవాబుదారీ ఎవరు? ఈడీ ఆఫీస్ లాకప్‌లోకి ఎవరెవరు వస్తున్నారు? అక్కడ ఉన్న భద్రతా ఏర్పాట్లపై కేంద్రం ప్రకటన చేయాలి’ అని ఆతిషి డిమాండ్ చేశారు.



కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ శుక్రవారం ఢిల్లీలో ఆప్ కార్యకర్తలు, మంత్రి ఆతిషి ఆందోళన

ఎలక్షన్ బీట్

మాణిక్కం ఠాగూర్ వర్సెస్ రాధిక

విరుధునగర్ లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు

సాక్షి, న్యూఢిల్లీ: డీఎంకేతో పొత్తులో భాగంగా తమిళనాడులో పోటీ చేస్తున్న తొమ్మిది స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తును కాంగ్రెస్ వేగవంతం చేసింది. శుక్రవారం జరిగిన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీలో విరుధునగర్ సహా నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. విరుధునగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ మరోసారి బరిలో దిగుతున్నారు. మరోవైపు ఈ స్థానాన్ని సినీ నటి రాధికా శరత్‌కుమార్‌కు కేటాయిస్తూ బీజేపీ కూడా శుక్రవారమే నిర్ణయం తీసుకుంది! దాంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. 2009లో కూడా ఇక్కడ మాణిక్కం నెగ్గారు. 2014లో డీఎంకే, కాంగ్రెస్ విడిగా పోటీ చేయడంతో అన్నాడీఎంకే అభ్యర్థి టి.రాధాకృష్ణ భారీ గెలుపొందారు. 2019లో కాంగ్రెస్, డీఎంకే కలిసి పోటీ చేయడంతో మాణిక్కం ఠాగూర్ మరోసారి నెగ్గారు. డీఎంకే మద్దతుతో ఈసారీ సునాయాసంగా నెగ్గుతామని కాంగ్రెస్ భావిస్తోంది.

ఒడిశాలో బీజేపీ ఒంటరి పోరు

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్రంలో జరగబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే బరిలో దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ శుక్రవారం ప్రకటించారు. ‘‘డబుల్ ఇంజన్ ప్రభుత్వాలుంటే ఆ రాష్ట్రంలో అభివృద్ధి ఉరకలెత్తుతుందని ఆశించాం. కానీ బీజేడీ అధికారంలో ఉన్న ఒడిశాలో కేంద్ర పథకాలు చివరి లబ్ధిదారు దాకా చేరడం లేదు’’ అని ఆరోపించారు. రాష్ట్రంలో పొత్తుపై అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ), బీజేపీ మధ్య కొద్దిరోజుల క్రితం చర్చలు జరగడం తెలిసిందే. బీజేడీతో పొత్తుపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటారని గత వారమే కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అంతలో ఇలా ఒంటరిపోరు ప్రకటన వెలువడింది. తాము కూడా అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో పోటీకి దిగుతున్నట్లు బీజేడీ శుక్రవారం ప్రకటించింది. 1998–2009 మధ్య రెండు పార్టీలు 11 ఏళ్లు కూటమిగా ఉన్నాయి. మూడుసార్లు లోక్‌సభ, రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేశాయి.

లోక్‌సభ బరిలో లాలూ ఇద్దరు కుమార్తెలు?

పట్నా: రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తన ఏడుగురు కుమార్తెల్లో ఇద్దరిని రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించేందుకు రంగం సిద్ధమయింది. ఆర్‌జేడీ టిక్కెట్‌పై మిసా భారతిని పాటలీపుత్ర నుంచి, రోహిణీ ఆచార్యను సరన్ నుంచి బరిలోకి దించుతారని వార్తలు వస్తున్నాయి. పాటలీపుత్ర నియోజకవర్గంలో ఆర్‌జేడీ టిక్కెట్‌పై పోటీ చేసేందుకు ఇప్పటికే రిత్‌లాల్ యాదవ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే పట్నాలోని మాజీ సీఎం రబ్డీదేవి నివాసానికి పలు పర్యాయాలు వచ్చినట్లు కూడా మీడియా అంటోంది. దీంతో, పాటలీపుత్ర నుంచి ఇద్దరిలో ఎవరిని పోటీకి నిలపాలనే విషయంలో కొంత సందిగ్ధం కొనసాగుతున్నట్లు సమాచారం.

నగదు లావాదేవీల సమాచారమివ్వండి: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ..అక్రమ డబ్బు రవాణాను అరికట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఖాతాదారులు ఎవరైనా రూ.లక్ష కంటే ఎక్కువ డిపాజిట్, విత్ డ్రా చేస్తే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించింది. ఏదైనా బ్యాంకు ఖాతా నుంచి రూ.10 లక్షలకు పైగా నగదును ఖాతాదారుడు తీసుకున్నా జిల్లా ఎన్నికల అధికారికి, ఆదాయపు పన్ను శాఖ నోడల్ అధికారికి తెలపాలని ఆదేశించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం తన పేరుతో లేదా ఏజెంట్ పేరుతో కలిపి బ్యాంకు, పోస్టాఫీసుల్లో ప్రత్యేకంగా అకౌంట్ లేదా ఉమ్మడి అకౌంట్ తెరవవచ్చని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు తెరవాలని అన్ని బ్యాంకులకు ఈసీఐ ఆదేశాలు జారీ చేసింది.

మోదీకి భూటాన్‌లో అరుదైన గౌరవం

45 కి.మీ. రోడ్డుకిరువైపుల నిలబడి ప్రజల స్వాగతం

- అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం
- రైల్వే అనుసంధానం సహా పలు ఒప్పందాలు



మోదీకి పౌర పురస్కారం అందజేస్తున్న భూటాన్ రాజు

థింపూ: భూటాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటనకు శుక్రవారం ఉదయం భూటాన్ రాజధాని థింపూ చేరుకున్న మోదీకి ప్రధాని త్సెరింగ్ టొబ్‌గే స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి థింపూ దాకా 45 కిలోమీటర్ల మేర ప్రజలు రోడ్డుకు రెండువైపులా నిలబడి భారత్, టిబెట్ పతాకాలతో స్వాగతం పలికారు. కొందరు యువకులు మోదీ స్వయంగా రాసిన పాటకు భారత సంప్రదాయ దుస్తుల్లో గర్బా నృత్యం చేశారు. దాన్ని మోదీ ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.

రాజు వాంగ్‌చుక్‌తో భేటీ

భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్, ప్రధాని త్సెరింగ్‌లతో మోదీ సమావేశమయ్యారు. భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం ‘ఆర్డర్ ఆఫ్ ద్రుక్ గ్యాల్పో’ను తొలిసారిగా మోదీకి రాజు ప్రదానం చేశారు. భారత్, భూటాన్ ప్రజల అనుబంధం ద్వైపాక్షిక సంబంధాన్ని మరింత ప్రత్యేకంగా మారుస్తోందని మోదీ అన్నారు. భూటాన్ ప్రజల గుండెల్లో భారత్ ఉంటుందన్నారు. ఈ సుందర దేశంలోకి ఎప్పటికీ గుర్తుండిపోయేలా స్వాగతం పలికిన భూటాన్ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ధన్యవాదాలని ‘ఎక్స్’లో పేర్కొన్నారు. భారత్, భూటాన్ మైత్రి మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ‘మా పెద్దన్న మోదీ జీకి భూటాన్‌లోకి స్వాగతం ’అని త్సెరింగ్ టొబ్‌గే ‘ఎక్స్’లో పేర్కొన్నారు. అనంతరం ప్రధానుల సమక్షంలో ఇంధనం, వాణిజ్యం, కనెక్టివిటీ, అంతరిక్షం, వ్యవసాయం వంటి రంగాల్లో పలు ఒప్పందాలు, ఎంవోయూలపై అధికార ప్రతినిధులు సంతకాలు చేశారు. రెండు దేశాల నడుమ కొక్రాఝర్– గెలెపు, బనార్హట్–సంత్సేల మధ్య రైల్వే లైనుపై ఎంవోయూకు తుదిరూపం ఇచ్చారు. 21, 22వ తేదీల్లోనే మోదీ భూటాన్‌లో పర్యటించాల్సి ఉండగా ప్రతికూల వాతావరణం వల్ల ఒక రోజు వాయిదా పడింది. ద్వైపాక్షిక, ప్రాంతీయ విషయాలపై భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవడానికి ప్రధాని పర్యటన ఉపయోగపడుతుందని విదేశాంగ శాఖ తెలిపింది.

నేడు డిజొంగ్ మఠ సందర్శన

భూటాన్‌లోని శక్తిమంతమైన తషిఛో డిజొంగ్ బౌద్ధ మఠాన్ని మోదీ శనివారం సందర్శించనున్నారు. థింపూలో భారత్ సహకారంతో ఏర్పాటైన అత్యాధునిక మాతా శిశు ఆస్పత్రిని ప్రారంభిస్తారు. గత వారం భూటాన్ ప్రధాని త్సెరింగ్ భారత్‌లో ఐదు రోజుల పాటు పర్యటించిన విషయం తెలిసిందే.

హెచ్–1బీ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

వాషింగ్టన్: హెచ్–1బీ వీసా నమోదు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తెలిపింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22వ తేదీతోనే రిజిస్ట్రేషన్ల గడువు ముగియాల్సి ఉంది. అయితే, సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. హెచ్–1బీ రిజిస్ట్రేషన్లకు అవసరమైన జీ–28 ఫారంలో కొందరి సంతకాలు కనిపించకుండా పోతున్నట్లు చెబుతున్నారు. దీంతో, నమోదును 25వ తేదీ వరకు కొనసాగిస్తామని వివరించింది. ఈ ఏడాది సుమారు 3.50 లక్షల మంది హెచ్–1బీ నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని యూఎస్‌సీఐఎస్ అంచనా వేస్తోంది.ఎంపికైన దరఖాస్తుదారుల పేర్లను మార్చి 31వ తేదీన ప్రకటిస్తామని యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

హిమాచల్‌లో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు రాజీనామా

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు చెందిన సీఎం సుఖూ ప్రభుత్వాన్ని కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురితోపాటు సుఖూ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటేయడం సంచలనం రేపింది. బీజేపీకి ఓటేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురు అనర్హత వేటుకు గురికాగా, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు తాజాగా పదవులకు రాజీనామా చేశారు. బీజేపీలో చేరి, ఆ పార్టీ టిక్కెట్‌పై మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని వీరు తెలిపారు. శుక్రవారం బీజేపీ నేతలతో కలిసి వెళ్లి అసెంబ్లీలో రాజీనామా పత్రాలను అందజేశారు.

పుష్పక్.. తగ్గేదేలే!

ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్–02 ప్రయోగం విజయవంతం

సాక్షి బెంగళూరు/సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): అంతరిక్ష ప్రయోగాల ఖర్చును తగ్గించేందుకు వినూత్న పద్ధతులను అనుసరిస్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ విషయంలో మరో మైలురాయిని అధిగమించింది. పుష్పక్ రాకెట్ ల్యాండింగ్ ప్రక్రియను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి మోసుకెళ్లే లాంచింగ్ వెహికల్స్ (రాకెట్లు)ను మళ్లీ వినియోగించుకోవడమే ఈ ప్రయోగం లక్ష్యం. రీయూజబుల్ లాంచింగ్ వెహికల్‌ను ఇస్రో తయారు చేయడమే కాకుండా ముద్దుగా ‘పుష్పక్’ అని పేరు పెట్టుకుంది. ఈ పుష్పక్‌కు సంబంధించి తొలి దఫాలో గతేడాది నిర్వహించిన ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్–01 మిషన్ పరీక్ష విజయవంతమైంది. తాజాగా రెండో దఫాలో పుష్పక్ ల్యాండింగ్ ప్రయోగం సైతం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం 7.10 గంటలకు కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్) నుంచి ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్–02 మిషన్ పరీక్ష నిర్వహించారు. నింగిలోకి పంపిన రాకెట్‌కు స్వయంగా ల్యాండింగ్ సామర్థ్యం ఉందా లేదా అనేది పరీక్షించారు. పుష్పక్‌ను భారత వైమానిక దళానికి చెందిన చిన్నూక్ హెలీకాప్టర్ ఆకాశంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి కిందకు వదిలేసింది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, స్వతహాగా డిజైన్ చేసిన ప్రోగ్రామ్ ప్రకారం రన్‌వే మీద పుష్పక్ సురక్షితంగా దిగింది. బ్రేక్ పారాచ్యూట్, ల్యాండింగ్ గేర్ బ్రేక్స్, నోస్‌వీల్ సిస్టమ్ సాయంతో పుష్పక్ తనంతట తానే వచ్చి నిలిచిపోవడం గమనార్హం. పుష్పక్ ల్యాండింగ్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన శాస్త్రవేత్తల బృందాన్ని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అభినందించారు.



పుష్పక్‌ను 4.5 కిలోమీటర్ల ఎత్తు నుంచి జారవిడుస్తున్న హెలికాప్టర్



రన్‌వేపై దిగుతున్న పుష్పక్

క్లుప్తంగా...

సీఎస్‌తో కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డిని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఎస్.ఎస్.దూబే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ఏ స్పార్స్ పైలెట్ ప్రాజెక్టు తదితర అంశాలపై సీఎస్‌తో ఆయన చర్చించారు. ఈ సమావేశంలో సంయుక్త కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ హరీశ్ శ్రీవాస్తవ్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ఆ శాఖ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ, సహాయ కంట్రోల్ జనరల్ ఎన్. ప్రియాంక, ఆర్థికశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరోనా సమయంలో ఏమయ్యారు?

టీడీపీ విశాఖ పశ్చిమ అభ్యర్థి గణబాబును నిలదీసిన మహిళ

గోపాలపట్నం (విశాఖ జిల్లా): ''కరోనా సమయంలో ఏమయ్యారు సార్.. సాయం కోసం వస్తే గేట్లు కూడా తీయలేదు. కనీసం రెండేళ్లపాటు బయట కనిపించలేదు'' అని ఓ మహిళ తెలుగుదేశం పార్టీ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును నిలదీసింది. దీంతో గణబాబు బిక్కముఖం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే గణబాబు జీవీఎంసీ 89వ వార్డు డీఏఆర్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరోనా సమయంలో ప్రజల కష్టాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. అక్కడే ఉన్న ఓ మహిళ ఆయన ప్రసంగాన్ని అడ్డుకుంది. కరోనా సమయంలో సాయం కోసం మీ దగ్గరికి వస్తే గేట్లకు తాళాలేసుకున్నారని దుయ్యబట్టింది. ఆమెను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. అయితే ఆమెకు మరికొంత మంది మహిళలు మద్దతుగా నిలిచారు. కరోనా సమయంలో ప్రజలను పట్టించుకోని గణబాబు.. ఇప్పుడు ఓట్లు అడిగేందుకు ఏ ముఖం పెట్టుకుని వస్తారని మహిళలు విమర్శించారు. అయితే గణబాబును మహిళ నిలదీస్తున్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీయకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు.

అప్పుడేనా... ఇంకా ముందుంది

సోమిరెడ్డికి సర్వేపల్లి, ఉలిక్కిపడ్డ వేమిరెడ్డి


వేమిరెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అందలం ఎక్కించిన వైఎస్సార్‌సీపీని వదిలి టీడీపీలోకి వెళ్లిన వేమిరెడ్డికి అక్కడ అప్పుడే ఝలక్ తగిలింది. మూడో విడత అభ్యర్థుల ప్రకటనలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి సర్వేపల్లి స్థానం కేటాయించడంతో మొదటినుంచీ వ్యతిరేకిస్తున్న ఆ వర్గానికి పచ్చివెలక్కాయ గొంతులో పడినట్టయింది. మొదటినుంచీ వారిమధ్య అంతర్గత విభేదాలున్నాయి. అసలు సోమిరెడ్డికి టికెట్ ఇవ్వకూడదన్న డిమాండ్‌తోనే వేమిరెడ్డి టీడీపీలో చేరారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. కానీ ఇప్పుడిలా జరగడంతో వారిలో అంతర్మథనం మొదలైంది. మొదటినుంచీ వైఎస్సార్‌సీపీలో వేమిరెడ్డికి సముచిత స్థానం లభించింది. సీఎం జగన్ ఆయన్ను గౌరవించి రాజ్యసభకు ఎంపిక చేశారు. జిల్లా బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. అంతేనా... ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి రెండు దఫాలు టీటీడీ బోర్డులో సభ్యత్వం ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామన్నారు. అందుకు ఆయన కోరినట్టుగానే ఎమ్మెల్యే అనిల్‌ను నెల్లూరు నుంచి తప్పించి నరసరావుపేటకు పంపించారు. ఆ స్థానంలో తన సతీమణి ప్రశాంతిరెడ్డికి టికెట్ ఇస్తారని ఆశించారు. అక్కడ మైనార్టీ అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరిపోయారు.

ఆరంభంలోనే టీడీపీలో అవమానం


పార్టీలో చేరే వరకు వేమిరెడ్డి మాటకు ప్రాధాన్యమిచ్చిన టీడీపీ అధిష్టానం తొలుత ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డికి కోవూరు టికెట్ కేటాయించింది. ఆయనకు నెల్లూరు ఎంపీ టికెట్ ఇచ్చింది. కానీ అంతలోనే తాను మొదటినుంచీ వ్యతిరేకిస్తున్న సోమిరెడ్డికి సర్వేపల్లి టికెట్ ఖరారు చేసింది. ఎన్నికల ఖర్చు కోసం టీడీపీ అధిష్టానానికి వేమిరెడ్డి ఇప్పటికే దాదాపు రూ.500 కోట్లు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. టీడీపీ కోసం ఇంత ఖర్చు చేసిన ఆయనకు టీడీపీ ఇచ్చిన గౌరవం ఏమిటో తెలిసొచ్చింది. టీడీపీ అధికారంలో ఉన్నపుడు వేమిరెడ్డి ఆ పార్టీలో చేరేందుకు యత్నించగా సోమిరెడ్డి అడ్డుకున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీలో చేరి రాజ్యసభ సభ్యుడయ్యారు. మళ్లీ టీడీపీలోకి వచ్చిన ఆయన సోమిరెడ్డితో కలసి పనిచేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఔను.. పుష్ప అంటే ఫ్లవరే!

కమలం పార్టీలో అసలైన బీజేపీ నేతలకు సీట్లు దక్కకుండా బాబు పావులు


దగ్గుబాటి పురందేశ్వరి


కొత్తపల్లి గీత


కామినేని శ్రీనివాస్


సీఎం రమేశ్


ఆదినారాయణరెడ్డి


వరదాపురం సూరి

సాక్షి, అమరావతి : అందరూ ఊహించినట్లుగానే కూటమి పేరుతో చంద్రబాబు అల్లిన సాలెగూటిలో బీజేపీ చిక్కుకుంది. పదేళ్లుగా ఎదురులేకుండా దేశాన్ని ఏలుతున్న బీజేపీ.. రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు మాయోపాయంలో చిక్కుకొని విలవిల్లాడుతోంది. బీజేపీకి రాష్ట్రంలో 6 పార్లమెంటు, 10 అసెంబ్లీ సీట్లు ఇచ్చారన్న మాటే కానీ, ఆ స్థానాలేమిటో ఇప్పటికీ ఖరారు కాలేదు. ఇప్పుడు బీజేపీకి ఇచ్చే సీట్లన్నింటిలో తన మనుషులే ఉండేలా చంద్రబాబు మంత్రాంగం చేస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ సిద్ధాంతాల కోసం, పార్టీ కోసం పనిచేస్తున్న అసలైన బీజేపీ నాయకులకు సీట్లు దక్కే అవకాశం కనిపించడం లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, చంద్రబాబు వదిన అయిన పురందేశ్వరి కూడా సహకరిస్తుండటంతో బాబు నేతలకే సీట్లు ఇస్తున్నారని, అభ్యర్థుల ప్రకటనే మిగిలి ఉందని అసలైన బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం జిల్లాలు, ప్రాంతాలను కూడా మార్చేసి చంద్రబాబు తన మనుషులను బీజేపీ టికెట్లపై రంగంలోకి దింపుతున్నారు.

బాబు ముందస్తు వ్యూహం

బీజేపీని తన గుప్పిట్లో ఉంచుకోవడానికి చంద్రబాబు గత దశాబ్దకాలంగా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తన వాళ్లు అనుకొన్న వారిని ఆ పార్టీలోకి పంపారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే భవిష్యత్ రాజకీయ అవసరాల కోసం మరికొందరు అనుంగులను బీజేపీలోకి పంపి, కోవర్టు రాజకీయాలు నడిపించారు. ఇప్పుడు బీజేపీతో పొత్తు కుదరగానే తన సొంత నాయకులకే ఆ పార్టీ సీట్లు ఇప్పించుకొంటున్నారు. ఈ నాయకులు ప్రాంతం, జిల్లా కూడా చూడకుండా ఎక్కడ వీలైతే అక్కడ వాలిపోతున్నారు. చంద్రబాబు అనుంగు సీఎం రమేష్ ఏకంగా కడప జిల్లా నుంచి ఉత్తరాంధ్రలోని అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీకి సిద్ధమవుతున్నారు. ఆయనకు ఈ సీటు దాదాపు ఖరారు అయినట్లేనని కమలం పార్టీలో చర్చ సాగుతుంది. పొత్తు ఖరారు కాకముందు బీజేపీ ఒంటరిగా పోటీగా చేసేందుకు సిద్ధమైన సమయంలో అనకాపల్లి లోక్‌సభ సీటు కోసం మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ దరఖాస్తు చేసుకున్నారు. ఆయన్ని కాదని రమేష్‌కే ఇప్పుడు టికెట్టు ఇస్తున్నారు.

జీవీఎల్‌కు సీటు దక్కకుండా..

విశాఖపట్నం బీజేపీకి రాష్ట్రంలోనే అత్యంత బలమైన ప్రాంతం. బీజేపీ బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాల వారు విశాఖ పరిధిలో గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. విశాఖ లోక్‌సభ స్థానంలో పోటీ చేయాలన్న సంకల్పంతో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు రెండేళ్లకు పైగా అక్కడే ఉంటూ తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అయితే, జీవీఎల్‌కు ఆ సీటు దక్కకుండా చంద్రబాబు, పురందేశ్వరి వ్యూహాత్మకంగా పక్కనే ఉన్న అనకాపల్లి స్థానాన్ని బీజేపీకి కేటాయించారన్న విమర్శలూ ఉన్నాయి.

సోము వీర్రాజు సీటుకే ఎసరు పెట్టిన పురందేశ్వరి

రాజమండ్రిలో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజుకే పురందేశ్వరి ఎసరు పెట్టారు. రాజమండ్రి వీర్రాజు సొంత నియోజకవర్గం. తొలి నుంచి బీజేపీలో ఉన్న నేత. ఈ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి వీర్రాజు సిద్ధమయ్యారు. అయితే ఇక్కడ చంద్రబాబు అండతో పురందేశ్వరి పోటీకి దిగుతున్నట్లు సమాచారం. ఒంగోలుకు చెందిన పురందేశ్వరి 2014 ఎన్నికలకు ముందు వెంకయ్యనాయుడు సమక్షంలో బీజేపీలో చేరారు. ఆమె మధ్యలో ఏడెనిమిది లోక్‌సభ స్థానాలు దాటుకొని రాజమండ్రి నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇక్కడ ఆమెకు టికెట్ ఖరారైనట్టేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ పోటీ చేసే మరో లోక్‌సభ స్థానం అరకు. ఇక్కడా మొదట నుంచి పార్టీని నమ్ముకున్న వారిని కాదని ఐదేళ్ల క్రితం బీజేపీలో చేరిన కొత్తపల్లి గీతకు టికెట్ ఇప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నరసాపురం లోక్‌సభ స్థానంలోనూ వైఎస్సార్‌సీపీ తరపున గెలిచి, చంద్రబాబుకు కీలుబొమ్మగా మారిన రఘురామకృష్ణరాజును బీజేపీలో చేర్పించి, ఆయనకు టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే రాజకీయం

టీడీపీతో పొత్తు లేదని గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీకి కూడా నిరాకరించిన కామినేని శ్రీనివాస్ ఇప్పుడు మళ్లీ పొత్తు కుదరగానే కైకలూరు అసెంబ్లీ నుంచి కమలం గుర్తుపైనే పోటీకి సిద్ధపడుతూ ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. కామినేని శ్రీనివాస్ కూడా బాబుకు దగ్గరైన నాయకుడే. 2019 ఎన్నికల్లో జమ్మలమడుగు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆదినారాయణ ఆ ఎన్నికల అనంతరం బీజేపీలో చేరిపోయారు. ఆయన కోసమే జమ్మలమడుగు స్థానాన్ని బాబు బీజేపీకి కేటాయిస్తున్నట్లు సమాచారం. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలోనూ 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వరదాపురం సూరి ఆ ఎన్నికల్లో ఓడిపోగానే బీజేపీలో చేరారు. బీజేపీతో పొత్తు ఖరారు కాకముందు ఆయన మళ్లీ ధర్మవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు చంద్రబాబుతో చర్చలు కూడా జరిపారు. ఇప్పుడు సూరి కోసం ధర్మవరం సీటును బీజేపీకి చంద్రబాబు కేటాయిస్తున్నట్లు సమాచారం. బీజేపీలో ఉన్న చంద్రబాబు సన్నిహితుడు సీఎం రమేష్ గతంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మహిళా నేతకు బద్వేలు అసెంబ్లీ టికెట్ ఇప్పించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం బద్వేలును బీజేపీకి కేటాయించారు. సీఎం రమేష్ సూచించిన అభ్యర్థితో సహా బద్వేలు సీటు కోసం పురందేశ్వరి ప్రతిపాదించిన ముగ్గురు ఇప్పటికీ బీజేపీలో చేరలేదు. ఆమె ప్రతిపాదించిన వారిలో ఒకరికి అవకాశం ఇస్తే.. వారు పార్టీలో చేరి, పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇలా బద్వేలు అసెంబ్లీ సీటు కూడా పరోక్షంగా టీడీపీకి ఇచ్చినట్లేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

టీడీపీ మూడో జాబితా విడుదల

11 ఎమ్మెల్యే, 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను వెల్లడించిన చంద్రబాబు

సాక్షి, అమరావతి : తెలుగుదేశం పార్టీ మరో 11 అసెంబ్లీ స్థానాలు, 13 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితాను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు ఆ పార్టీ 139 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. పొత్తులో భాగంగా 144 స్థానాల్లో పోటీచేయాల్సి వుండగా ఇంకా ఐదు స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. అలాగే, పొత్తులో 8 ఎంపీ స్థానాలు వదులుకోవడంతో 17 స్థానాలకుగానూ 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన 4 స్థానాలకు ఖరారు చేయాల్సి వుంది.

మూడో జాబితా ఇలా..

ఎమ్మెల్యే అభ్యర్థులు..

పలాస	- గౌతు శిరీష
పాతపట్నం	- మామిడి గోవిందరావు
శ్రీకాకుళం	- గొండు శంకర్
ఎస్.కోట	- కోళ్ల లలితకుమారి
కాకినాడ సిటీ	- వనమాడి వెంకటేశ్వరరావు
అమలాపురం	- అయితాబత్తుల ఆనందరావు
పెనమలూరు	- బోడె ప్రసాద్
మైలవరం	- వసంత కృష్ణప్రసాద్
నరసరావుపేట	- డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు
చీరాల	- ఎం. మాలకొండయ్య యాదవ్
సర్వేపల్లి	- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

టీడీపీ ఎంపీ అభ్యర్థులు వీరే..

శ్రీకాకుళం	- కింజరాపు రామ్మోహన్ నాయుడు
విశాఖపట్నం	- మాత్కుమిల్లి భరత్
అమలాపురం	- గంటి హరీష్ మాధుర్
ఏలూరు	- పుట్టా మహేష్ యాదవ్
విజయవాడ	- కేశినేని శివనాథ్ (చిన్ని)
గుంటూరు	- పెమ్మసాని చంద్రశేఖర్
నరసరావుపేట	- లావు శ్రీకృష్ణదేవరాయలు
బాపట్ల	- తెన్నేటి కృష్ణప్రసాద్
నెల్లూరు	- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
చిత్తూరు	- దగ్గుమళ్ల ప్రసాదరావు
కర్నూలు	- బస్తిపాటి నాగరాజు
నంద్యాల	- బైరెడ్డి శబరి
హిందూపురం	- బీకే పార్థసారథి

ఎంపీ సీట్లలోనూ బీసీలకు అరకొరే

- ప్రకటించిన 13 సీట్లలో 6 ఓసీలకే..
- కేవలం నాలుగు మాత్రమే బీసీలకు
- ఎమ్మెల్యే సీట్లలోనూ బీసీలకు అన్యాయం

సాక్షి, అమరావతి: బీసీలపై బాబుది కపట ప్రేమేనని మరోసారి తేలిపోయింది. ఎంపీ సీట్ల కేటాయింపులో ఆయన బీసీలను చిన్నచూపు చూశారు. 13 ఎంపీ స్థానాలకు శుక్రవారం అభ్యర్థులను ప్రకటించగా అందులో ఓసీలకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో ఆరు సీట్లను ఓసీలకే కట్టబెట్టి కేవలం నాలుగు స్థానాలను మాత్రమే బీసీలకు ఇచ్చారు. ఓవైపు వైఎస్సార్‌సీపీ బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వగా.. టీడీపీ మాత్రం వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అవమానిస్తోంది. ఓసీలకిచ్చిన ఆరు స్థానాల్లో నాలుగింటిని బాబు తన సొంత సామాజికవర్గానికి కేటాయించుకున్నారు. మరో రెండు స్థానాలను రెడ్డి సామాజికవర్గానికి.. మూడు సీట్లను తప్పనిసరి పరిస్థితుల్లో రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీలకు కేటాయించారు. 13 మంది ఎంపీ అభ్యర్థుల్లో ఒకేఒక్క మహిళకు అవకాశం ఇవ్వడం విశేషం.

కమ్మ వర్గానికి 30 అసెంబ్లీ సీట్లు..

ఇదిలా ఉంటే.. మూడో విడత ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాతో చంద్రబాబు పూర్తిగా సొంత సామాజికవర్గం కోసమే పనిచేస్తున్నట్లు స్పష్టమైంది. ఇప్పటివరకు ఖరారు చేసిన 139 సీట్లలో 30 మంది కమ్మ అభ్యర్థులు కావడం గమనార్హం. మొత్తంగా 75 మంది ఓసీలకు ఆయన సీట్లిచ్చి తన ప్రాధాన్యతను తెలియజెప్పారు. బీసీలకు 31 సీట్లు మాత్రమే ఇచ్చారు. బీసీల పార్టీ అని డప్పు కొట్టుకుంటున్న బాబు ఆ వర్గానికి గతంలో ఇచ్చినన్ని సీట్లు కూడా ఈసారి ఇవ్వకపోవడంతో ఆ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో 43 సీట్లు బీసీలకు ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు కేవలం 31 సీట్లతో సరిపెట్టేశారు. కాపులకు 8 సీట్లు ఇచ్చి వారిని మరింత అవమానించారు. మైనారిటీలకూ కేవలం 3 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఎస్సీలకు 26 సీట్లు కేటాయించారు. దీన్నిబట్టి టీడీపీలో సామాజిక న్యాయం లేదని మరోసారి ప్రస్ఫుటమైంది. కేవలం అగ్రవర్ణాలు, ధనికుల కోసమే బాబు రాజకీయాలు చేస్తున్నట్లు సీట్ల కేటాయింపు ద్వారా తేలిపోయింది.

ధనబలం ఉన్న వారికే ఎంపీ సీట్లు

కేశినేని చిన్ని, ఎన్నారై పెమ్మసానికి బెజవాడ, గుంటూరు స్థానాలు

- పార్టీ ఫిరాయించిన లావు, వేమిరెడ్డిలకు నరసరావుపేట, నెల్లూరు
- విశాఖలో జీవీఎల్‌కు బాబు ఝలక్.. బాలకృష్ణ రెండో అల్లుడు భరత్‌కు టికెట్
- ఏలూరు ఎంపీ సీటు యనమల అల్లుడికి కేటాయింపు
- ఎవరూ దొరక్క తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ సీటు
- మైలవరం అసెంబ్లీ సీటు వసంతకే.. దేవినేని ఉమాకు షాక్
- ఎట్టకేలకు పెనమలూరు సీటు బోడెకు ఖరారు
- సర్వేపల్లి మళ్లీ సోమిరెడ్డికే




భరత్, కేశినేని చిన్ని, పెమ్మసాని చంద్రశేఖర్

సాక్షి, అమరావతి :తెలుగుదేశంలో పార్టీలో అనుకున్నదే జరుగుతోంది. ధనస్వామ్యానికే చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారు. డబ్బున్నవారికే సీట్లు కట్టబెడుతున్నారు. తాజాగా.. శుక్రవారం ప్రకటించిన టీడీపీ మూడో జాబితాలో ఈ విషయం తేలిపోయింది. ఉదా.. విజయవాడ, గుంటూరు స్థానాలను అనుకున్నట్లుగానే ధనబలం ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఎంపీ సీట్లు కేటాయించారు. నరసరావుపేట, నెల్లూరు స్థానాలను సైతం ఫిరాయింపు నేతలైన లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కట్టబెట్టారు. ఇక బీజేపీ కోరుతున్న విశాఖ ఎంపీ స్థానాన్ని బాలకృష్ణ రెండవ అల్లుడు, లోకేశ్ తోడల్లుడు అయిన మోత్కుమిల్లి భరత్‌కు కట్టబెట్టారు. దీంతో ఈ స్థానంపై ఆశలు పెట్టుకున్న బీజేపీ సీనియర్ నేత జీవీఎల్ నరసింహారావుకు చంద్రబాబు షాక్ ఇచ్చారు.

కడప నేతకు ఏలూరు సీటు..

ఏలూరు ఎంపీ సీటును మాత్రం అనూహ్యంగా యనమల రామకృష్ణుడి అల్లుడు పుట్టా మహేష్ యాదవ్‌కి కేటాయించారు. కడప ప్రాంతానికి చెందిన టీడీపీ నేత పుట్టా సుధాకర్ కుమారుడైన మహేష్‌కి ఏలూరు సీటు కట్టబెట్టడంతో ఆ ప్రాంత టీడీపీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఆ సీటును ఆశించి అక్కడ పనిచేస్తున్న గోపాల్ యాదవ్, మాజీ ఎంపీ మాగంటి బాబులను పక్కనపెట్టి మహేష్‌కి ఇవ్వడమేమిటని అక్కడి నేతలు రగిలిపోతున్నారు.

తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ సీటు..

బాపట్ల ఎంపీ సీటును ఆశ్చర్యకరంగా తెలంగాణకు చెందిన బీజేపీ నేత, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్‌కి ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో టీడీపీ శ్రేణులే అవాక్కయ్యాయి. ఆయన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి కావడంతోపాటు పుట్టి పెరిగింది అంతా తెలంగాణలోనే. అలాంటి వ్యక్తికి చంద్రబాబు ఏపీలో సీటు ఇచ్చారు. బాపట్ల స్థానానికి అభ్యర్థి దొరక్క చంద్రబాబు చాలారోజులపాటు అన్వేషణ కొనసాగించారు. ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఇవ్వాలని చూసినా ఆయనకు చిత్తూరు సీటు ఇచ్చి ఆఖరి నిమిషంలో కృష్ణప్రసాద్‌కు బాపట్ల సీటు ఇచ్చారు. నిజానికి.. వరంగల్ ఎంపీ సీటు కోసం బీజేపీ తరఫున పోటీచేసేందుకు కృష్ణప్రసాద్ ప్రయత్నించి విఫలమయ్యారు. ఈయనకు చంద్రబాబు అనూహ్యంగా ఏపీలో సీటు ఇవ్వడం గమనార్హం.

దేవినేని ఉమాకు షాక్.. వసంతకే మైలవరం టికెట్

మరోవైపు.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివాదంగా మారిన పెనమలూరు, మైలవరం అసెంబ్లీ సీట్లకు బోడె ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్ పేర్లను ఖరారుచేశారు. మైలవరం సీటు కోసం ఫిరాయింపు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బొమ్మసాని సుబ్బారావులు గట్టిగా పోటీపడ్డారు. ఈ స్థానాన్ని నిలుపుకునేందుకు దేవినేని ఉమా గట్టిగా పట్టుబట్టినా ఇటీవలే టీడీపీలో చేరిన కృష్ణప్రసాద్ ధనబలంతో దాన్ని చేజిక్కించుకున్నట్లు చెబుతున్నారు. మైలవరం టికెట్‌ను ఫిరాయింపు నేతకు ఇస్తున్న నేపథ్యంలో పెనమలూరు సీటుకు దేవినేని ఉమా పేరును పరిగణలోకి తీసుకుని అక్కడికి పంపుతున్నట్లు హడావుడి చేశారు. అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్‌ను పక్కనపెడుతున్నట్లు హంగామా చేసినా చివరికి ఆయనకే సీటు ఇచ్చారు. దీనివెనుకా భారీగా డబ్బు దండుకునే వ్యూహం అమలైనట్లు తెలుస్తోంది. ఆ వ్యూహంలో చిక్కుకున్న బోడె ప్రసాద్ ఎలాగోలా టీడీపీ పెద్దలను సంతృప్తిపరచడంతో ఆయనకే సీటు ఖరారుచేశారు. దీంతో.. రెండు స్థానాల్లో ఏదీ దక్కక టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు అభాసుపాలయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పిన ఉమాను అన్నిరకాలుగా వాడుకున్న చంద్రబాబు చివరికి కరివేపాకులా పక్కన పడేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సోమిరెడ్డికే సర్వేపల్లి టికెట్..

అలాగే, నరసరావుపేట అసెంబ్లీ స్థానంలో పలువురి కొత్త నేతల పేర్లు తెరపైకి తెచ్చి హడావుడి చేసినా చివరికి అక్కడి ఇన్‌ఛార్జి చదలవాడ అరవింద్‌బాబుకే ఆ సీటు కేటాయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్వేపల్లిని ఎట్టకేలకు మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి కేటాయించారు. ఆ సీట్లో వరుసగా ఓడిపోతున్న సోమిరెడ్డి స్థానంలో కొత్త వ్యక్తికి అవకాశం ఇవ్వాలని ప్రయత్నించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీలో చేరిన తర్వాత సోమిరెడ్డి స్థానంలో మరొకరికి ఇచ్చేలా రాజకీయం చేశారు. ఒక దశలో సోమిరెడ్డి కాకపోతే ఆయన కుటుంబంలో ఎవరికైనా సీటు ఇవ్వాలని చూశారు. కానీ, చివరికి సోమిరెడ్డికే సీటు ఖరారుచేశారు.

ధర్మవరం, హిందూపురం.. గరం గరం..

ఇక ధర్మవరం సీటు హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడ ఓ వైపు పరిటాల శ్రీరాం, మరోవైపు వరదాపురం సూరి మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో.. హిందూపురం ఎంపీ సీటు టీడీపీకి కేటాయించడంతో ధర్మవరం సీటు బీజేపీకి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అలాగే, హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా బీకే పార్థసారథి పేరు ఖరారు చేయడంతో నిమ్మల కిష్టప్ప, అంబికా లక్ష్మీనారాయణ ఆశలు ఆవిరయ్యాయి. ఎంపీ టికెట్ తనదేనని ప్రచారం చేస్తున్న బీజేపీ నేత పరిపూర్ణానందస్వామి దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అలాగే, వైఎస్సార్ జిల్లా కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డికి వాసు కారణంగానే టికెట్ దక్కలేదని అభిప్రాయపడుతున్నారు. వరుసగా మూడుసార్లు ఓడినోళ్లకు ఎన్నికల్లో టికెట్ లేదని గతంలో నారా లోకేశ్ ప్రకటించినా నెల్లూరు జిల్లా సర్వేపల్లి అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రకటించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కూడా ఊరించి ఉసూరుమనిపించారు.

ఒంటరి మహిళను వేధించినవారిపై చర్యలు తీసుకోండి

రాజంపేట ఘటనపై ఎస్పీకి మహిళా కమిషన్ ఆదేశం

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఒంటరి మహిళను వేధించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ ఘటనకు సంబంధించి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి శుక్రవారం అన్నమయ్య జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. శ్రీ అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (మోదుగల కళావతమ్మ ఇంజినీరింగ్ కళాశాల) అధినేత, టీడీపీ సీనియర్ నాయకుడు మోదుగల పెంచలయ్య స్థానిక ఉస్మాన్ నగర్‌లో ఉంటున్న ఒంటరి మహిళను వేధించాడు. బుధవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లిన పెంచలయ్య లైంగిక వాంఛ తీర్చాలని బలవంతం చేశాడు. భయంతో ఆమె బయటకు పారిపోయి అతన్ని ఇంట్లో ఉంచి తలుపు గడియ పెట్టి పోలీసులకు ఫోన్ చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలుసుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఘటనకు కారకుడైన పెంచలయ్యపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. బాధితురాలికి మహిళా కమిషన్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఘటనకు శ్రీ అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కాలేజీ యజమాని పెంచలయ్య బాధ్యుడు కావడంతో ఆ కాలేజీపైన విచారణ జరపాలని జేఎన్‌టీయూ–అనంతపురం వైస్ ఛాన్సలర్‌ను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆదేశించారు.

తేలని సీట్ల పంచాయితీ

ప్రశ్నార్థకంగా గంటా, కళా వెంకట్రావు భవితవ్యం

గుమ్మనూరు జయరాంకు ఇంకా ఎదురుచూపులే..

- ఇటీవలే పార్టీలో చేరిన మాగుంటకు ఖరారుకాని సీటు
- దర్శి, అనంతపురం అర్బన్, రాజంపేట స్థానాలపై గందరగోళం
- నరసాపురం ఎంపీ సీటుపైనా అదే పరిస్థితి
- కూటమి సీట్ల సర్దుబాటూ కుదరక అంతటా అయోమయం

సాక్షి, అమరావతి/సాక్షి, పుట్టపర్తి/ విజయవాడ/ మచిలీపట్నం/కడప : మూడు జాబితాలు విడుదలైనా టీడీపీలో సీట్ల పంచాయితీలు కొలిక్కి రాలేదు. సీనియర్ నేతలైన గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు పోటీచేసే సీట్లను చంద్రబాబు ఈ జాబితాలోనూ ఖరారు చేయకపోవడంతో గందరగోళం నెలకొంది. గంటా విశాఖ జిల్లా భీమిలి సీటు అడుగుతున్నా విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లాలని కోరుతుండడంతో ప్రతిష్టంభన ఏర్పడింది. ఆయన్ను చీపురుపల్లి నుంచి పోటీచేయించడానికి బాబు శతవిధాలా ప్రయత్నిస్తున్నా ఆయన అంగీకరించడంలేదు. ఆయన కోరుతున్న భీమిలి సీటును పొత్తులో జనసేనకు కేటాయించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ పొత్తులో ఆ సీటు పోకపోయినా గంటాకు మాత్రం భీమిలి సీటు ఇచ్చే ఉద్దేశం చంద్రబాబుకు లేదని చెబుతున్నారు. దీంతో గంటా భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అలాగే, టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కళా వెంకట్రావుకు ఎచ్చెర్ల సీటును నిరాకరించి ఆయన్ను కూడా చీపురుపల్లి వెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి బలమైన సీటు కావడం, ఓటమి తెలిసి పోటీ చేయడం ఎందుకనే ఉద్దేశంతో చీపురుపల్లి సీటు తీసుకునేందుకు కళా కూడా ఒప్పుకోవడంలేదు. ఈ సీటును అడ్డుపెట్టి కళా, గంటాకు బాబు చెక్ పెట్టాలని చూస్తున్నారు. కళా ఇన్‌ఛార్జిగా ఉన్న ఎచ్చెర్ల సీటును బీజేపీకి ఇచ్చే ఉద్దేశంతో ఆయన్ను చీపురుపల్లి పంపి బలిచేయాలని చూస్తున్నట్లు ప్రచారం.

జయరాంకు ఝలక్

ఇటీవలే టీడీపీలోకి ఫిరాయించిన గుమ్మనూరు జయరాంకి చంద్రబాబు ఝలక్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనకు గుంతకల్లు సీటు ఇస్తానని చెప్పి పార్టీలో చేర్చుకుని ఇప్పుడు నాన్చుతుండడంతో ఆయన పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. ఆలూరు, గుంతకల్లు స్థానాల్లో ఏదో ఒకటి తనకు ఇస్తారనే ఆశతో ఆయన ఎదురుచూస్తున్నారు. ఎంత డబ్బు ఖర్చు పెట్టయినా సరే సీటు దక్కించుకోవడానికి ఆయన శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. జయరాంను సాకుగా చూపి ఆలూరి స్థానాన్ని ఖరారు చేయకపోవడంతో కోట్ల సుజాతమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవలే ఆమె అనుచరులు హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసం వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. మరోవైపు.. బీజేపీతో సీట్ల సర్దుబాటు కొలిక్కి రాకపోవడంతో జమ్మలమడుగు, బద్వేలు స్థానాలను పెండింగ్‌లో ఉంచారు. రాజంపేట, రైల్వేకోడూరు సీట్లకు సైతం ఇదే కారణంతో అభ్యర్థులను ఖరారు చేయలేదు. దర్శి, అనంతపురం అర్బన్ సీట్లపైనా చంద్రబాబు ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు.

ఎంపీ సీట్లపై తర్జనభర్జనలు..

ఇక ఎంపీ సీట్ల విషయంలోనూ కూటమిలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా నరసాపురం సీటును ఎవరికి కేటాయిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారనే ప్రచారం జరుగుతుండడం దానికోసం ముఖ్యులు పోటీ పడుతుండడంతో రఘురామకృష్ణరాజు పరిస్థితి ఇరకాటంలో పడింది. టీడీపీలో చేరి పోటీచేద్దామనుకున్నా చంద్రబాబు వ్యూహాత్మకంగా ఆ సీటును బీజేపీకి కేటాయిస్తుండడం, బీజేపీ సొంత అభ్యర్థిని చూస్తుండడంతో నరసాపురం రాజకీయం రంజుగా మారింది. అలాగే, ఒంగోలు ఎంపీ సీటును ఇటీవలే పార్టీలో చేరిన మాగుంట శ్రీనివాసులు కుటుంబానికి ఇస్తారని ప్రచారం జరిగినా జాబితాలో ఆయన పేరు లేకపోవడం చర్చనీయాంశమైంది. అలాగే, విజయనగరం, రాజమండ్రి, అరకు, రాజంపేట, కడప, అనంతపురం, తిరుపతి సీట్లపైనా ప్రతిష్టంభన కొనసాగుతోంది. బీజేపీ పోటీచేసే సీట్లు తేలకపోవడంతో వీటన్నింటినీ పెండింగ్‌లో ఉంచారు. దీంతో అవి ఎప్పటికి ఖరారవుతాయోనని పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

క్లుప్తంగా...

టీడీపీ ప్రచారంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్/చంద్రగిరి (తిరుపతి జిల్లా): ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా టీడీపీ ప్రచారంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగులను అధికారులు ఉద్యోగాల నుంచి తొలగించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని హెచ్ఐవీ, ఏఆర్‌టీ సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కృష్ణమూర్తి గురువారం సోమల మండలంలో టీడీపీ నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నాడు. దీంతో కృష్ణమూర్తిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా ఈ నెల 18వ తేదీన చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ పంచాయతీలో జరిగిన టీడీపీ ఎన్నికల ప్రచారసభలో సంఘమిత్ర-1 లత పాల్గొన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లతను కూడా విధుల నుంచి తొలగించారు. మరోవైపు చంద్రగిరి మండలం గంగుడుపల్లి గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మండపంపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గురవారెడ్డి అన్నీ తానై వ్యవహరించారు. ఎన్నికల అధికారులు తక్షణమే గురవారెడ్డిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ సర్పంచ్, అనుచరులపై కేసు నమోదు

మదనపల్లె: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు ఉల్లంఘించినందుకు చీకలబైలు టీడీపీ సర్పంచ్ ప్రభాకర్, అనుచరులపై కేసు నమోదుచేసినట్లు అన్నమయ్య జిల్లా మదనపల్లెవన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం టీడీపీ సర్పంచ్ ప్రభాకర్ తన అనుచరులతో కలిసి ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి గాంధీరోడ్డు మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకపోవడంతో పట్టణ ఎంసీసీ కోడ్ పర్యవేక్షణాధికారి నాగేశ్వరరావు ఫిర్యాదుమేరకు 188, 171-హెచ్, 290రెడ్‌విత్34 ఐపీసీ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పిఠాపురం నుంచే పవన్ ప్రచారం ఆరంభం



సాక్షి, అమరావతి: కాకినాడ జిల్లా పిఠాపురం నుంచే తన ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్టు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో నాయకులతో ఆయన చర్చించినట్టు ఆ పార్టీ మీడియా విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. వారాహి వాహనం నుంచి ప్రచారం మొదలుపెడతారని, తొలి మూడు రోజులు ప్రచారం తాను పోటీ చేసే పిఠాపురం నియోజకవర్గంలోనే కొనసాగించనున్నారని తెలిపింది. కాగా, ఈ నెల 27వ తేదీ నుంచి పవన్ కళ్యాణ్ తన ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

కామన్ సింబల్ కోసం హైకోర్టుకు కేఏ పాల్

- కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీకి కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కిలారి ఆనంద్ పాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, పాల్ పిటిషన్‌లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పాల్ వాదనలు వినిపిస్తూ, తమ పార్టీకి కామన్ సింబల్ కోసం వినతి పత్రం ఇచ్చినా ఎన్నికల సంఘం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. ఎన్నికల సంఘం తరపు న్యాయవాది శివ దర్శన్ వాదనలు వినిపిస్తూ పాల్ దరఖాస్తు నిర్దేశిత నమూనాలో లేదని చెప్పారు. తిరిగి నిర్దేశిత నమూనాలో పాల్ సమర్పించిన దరఖాస్తు పరిశీలనలో ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఎన్నికల గుర్తుల అంశం పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలోని వ్యవహారమని తేల్చి చెప్పారు. ఆ విషయంలో ఎన్నికల సంఘం దాఖలు చేసే కౌంటర్ ఆధారంగా ఉత్తర్వులిస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ

కవితకు దక్కని ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తన అరెస్టు అక్రమమంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లాలని సూచించింది. కేసులో రాజకీయ నేత ప్రమేయం ఉన్న కారణంగా చట్టబద్ధమైన పరిష్కారాలు దాటవేయలేమని వ్యాఖ్యానించింది. పిటిషన్‌లో లేవనెత్తిన రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు మాత్రమే విచారిస్తామని స్పష్టం చేసింది. కవిత పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఇదిలా ఉంటే.. ఈడీ కస్టడీలో ఉన్న కవితతో శుక్రవారం సాయంత్రం ఆమె కుమారుడు ఆర్య, మరదలు అఖిల, స్నేహితురాలు వినూత ములాఖత్ అయ్యారు. ఈడీ అధికారులు ఆరో రోజూ కవితను సుదీర్ఘంగా విచారించారు.

'దేశ' ముదుర్లు

కాంగ్రెస్ ఖాతాలోకి సీఎం రమేశ్ రూ.30 కోట్లు..

ఇవీ.. బాండ్ నంబర్లు

కాంగ్రెస్‌కు సీఎం రమేశ్ కంపెనీ రిత్విక్ ప్రాజెక్ట్స్ ఇచ్చిన బాండ్ల నంబర్లు. ఒక్కొక్కటీ రూ.కోటి విలువ గల 30 బాండ్లను... అంటే రూ.30 కోట్లను కాంగ్రెస్‌కు అందజేశారు. 14402, 14412, 14414, 14416, 14418, 14420, 14422, 14424, 14426, 14427, 14429, 14431, 14433, 14435, 14437, 14439, 14441, 14443, 14445, 14447, 14449, 14451, 14454, 14456, 14458, 14460, 14462, 14464, 14466, 14477.

▶ మొదటి పేజీ తరువాయి

రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థను ఆరంభించి... చంద్రబాబు అండదండలతో భారీ కాంట్రాక్టులు పొందారు. బాబు మనిషిగా సింగపూర్, మారిషస్‌ల నుంచి నిధులు తెచ్చుకుని చాలా తక్కువ కాలంలోనే వేల కోట్లకు ఎదిగాడు. అందుకే... 2019లో తాను ఓడిపోగానే సీఎం రమేశ్‌ను బీజేపీలోకి పంపించేశాడు చంద్రబాబు నాయుడు. ఇక అప్పటి నుంచి బీజేపీలో ఉంటూనే... నారా వారి ప్రయోజనాల కోసం సకల కార్యాలూ చక్కబెట్టడం మొదలెట్టాడు సీఎం రమేశ్. అలాంటి సీఎం రమేశ్... బీజేపీలో ఉంటూ బీజేపీకి ఒక్క పైసా కూడా అధికారికంగా ఇవ్వకపోయినా... రూ.30 కోట్లను మాత్రం బీజేపీకి బద్ధ శత్రువైన కాంగ్రెస్ ఖాతాలో వేయటం అందరినీ ఆశ్చర్యపరిచేదే. అంతేకాదు. చంద్రబాబు ఎవరెవరిని వాడాలని అనుకుంటున్నారో... వారందరికీ అవసరమైన ఖర్చులు పెట్టడం, ప్రత్యేక విమానాలు సమకూర్చటం ఇవన్నీ రమేశ్ విధులే. ఈయన విమానాన్ని ఇటీవల షర్మిల, పవన్ కల్యాణ్, ప్రశాంత్ కిషోర్ సహా బాబు బ్యాచ్ మొత్తం వాడేస్తుండటం అందరికీ తెలిసిన విషయమే.

జగన్ టార్గెట్‌గా బాబు పావులు...

2019లో ప్రజా క్షేత్రంలో దారుణంగా ఓడిపోయినప్పటి నుంచీ చంద్రబాబు ఎన్ని పాచికలు వేసినా పారటం లేదు. ఆ తరవాత జరిగిన స్థానిక ఎన్నికలతో సహా ప్రతి ఎన్నికలోనూ ఘోరమైన ఓటమి పాలవుతుండటంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నేరుగా ప్రజాక్షేత్రంలో ఢీకొనటం కష్టమని తెలుసుకుని మాయోపాయాలకు దిగాడు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ఆసరాగా చేసుకుని ఆయన కుటుంబీకుల్లో చిచ్చు పెడితే వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఇబ్బంది పెట్టవచ్చనే నిర్ణయానికి వచ్చి... ఆ దిశగా పావులు కదిపాడు. హత్య కేసులో తన భర్త పాత్ర బయటపడి ఇరుక్కుంటామేమోనని భయపడుతున్న సునీతను చేరదీయటంతో పాటు... అధికారం ఆశ చూపించి వైఎస్ షర్మిలనూ తమవైపు తిప్పుకున్నారు. వారు గనక తెలుగుదేశంలో నేరుగా చేరితే తమ మాటలెవరూ నమ్మరన్న ఉద్దేశంతో... తన సన్నిహితుడు రేవంత్ రెడ్డి ద్వారా కాంగ్రెస్‌లో ఆమె పార్టీని విలీనం చేయించటం వంటి కార్యక్రమాలను దిగ్విజయంగా చేయించాడు. ఇదే సమయంలో ఈ కార్యక్రమాలన్నీ చేయటానికి కాంగ్రెస్‌కు తన బంటు సీఎం రమేశ్ ద్వారా రూ.30 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందజేశారు. నిజానికి ఎలక్టోరల్ బాండ్ల విషయంలో చాలా కంపెనీలు 2019 ఎన్నికల ముందు కొనుగోలు చేసి ఆయా పార్టీలకు అందజేశాయి. సీఎం రమేశ్ మాత్రం 2023లోనే తన రిత్విక్ ప్రాజెక్ట్ ద్వారా రూ.45 కోట్ల మేర ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి, అందులో రూ.30 కోట్లను కాంగ్రెస్ ఖాతాలోకి, రూ.5 కోట్లను తెలుగుదేశం ఖాతాలోకి, మరో 10 కోట్లను కర్ణాటకకు చెందిన జనతాదళ్ (ఎస్) ఖాతాలోకి వేశారు.

కాంగ్రెస్‌లో మారిన పరిణామాలు...

తెలుగుదేశం తరపున రాజ్యసభకు ఎన్నికై ... బీజేపీలో కొనసాగుతూ... కాంగ్రెస్‌కు భారీగా నిధులిచ్చిన సీఎం రమేశ్... ఇటీవల చంద్రబాబు నాయుడిని ఢిల్లీలో బీజేపీ పెద్దలు కలవటానికి కూడా ఇష్టపడనప్పుడు మొత్తం వ్యవహారాన్ని వెనక ఉండి నడిపించారు. మొత్తానికి బీజేపీ పెద్దల అపాయింట్‌మెంట్లు సంపాదించి బాబును వారితో భేటీ అయ్యేలా చేశారు. ఇక వాళ్లేం చెబితే అది చేస్తానని చంద్రబాబు సాగిలపడటంతో వారు కూడా పొత్తుకు సరేనన్న విషయం బహిరంగ రహస్యమే. ఆ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా నేరుగానే చెప్పారు. బాబుకు బుద్ధొచ్చింది కనకనే తిరిగి తమ వద్దకు వచ్చాడని ఆయన చెప్పగా... గతంలో చంద్రబాబుజీ... నాయుడుజీ అన్న ప్రధాన మంత్రి మోదీ... ఇటీవల చిలకలూరిపేట సభలో మాత్రం నేరుగా చంద్రబాబు నాయుడు అని మాత్రమే... అదికూడా ఒక్కసారే సంబోధించడం గమనార్హం. బాబు మాత్రం మోదీజీ గారు అంటూ అతివినయం ప్రదర్శించటం ఎవ్వరి దృష్టినీ దాటిపోలేదు కూడా. కాకపోతే సీఎం రమేశ్ కాంగ్రెస్ పార్టీకి నిధులిచ్చాక పరిణామాలు వేగంగా మారాయి. కాంగ్రెస్‌లో షర్మిల పార్టీని విలీనం చేయటంతో పాటు ఆమెను కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలిగా నియమించారు. నాటి నుంచీ ఆమె నేరుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే టార్గెట్‌గా చేసుకుని రకరకాల విమర్శలు చేస్తున్నారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతకు కూడా తాను అండగా ఉన్నానని చెబుతూ... వివేకా హత్య విషయంలో కూడా జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలకు దిగారు. ఒక దశలో వివేకా భార్యను గానీ, సునీతను గానీ కడపలో పోటీ చేయించాలని భావించి... ఇపుడు మాత్రం చంద్రబాబు సూచనలతో నేరుగా తానే పోటీకి దిగే ప్రయత్నాలూ చేస్తున్నారు. కాకపోతే ఇప్పటిదాకా ఈ వ్యవహారాలపై ఎన్ని విమర్శలొచ్చినా కాంగ్రెస్‌తో తమకేం సంబంధమంటూ చంద్రబాబు దాటవేశారు. అటు కాంగ్రెస్ నేతలు కూడా ఇదే తరహాలో స్పందించేవారు. కాకపోతే సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎన్నికల కమిషన్ ఎలక్టోరల్ బాండ్ల మొత్తం వివరాలన్నీ బయటపెట్టింది. ఎవరు కొన్నారు? ఏ పార్టీకి ఇచ్చారు? ఎంత ఇచ్చారు? అనే వివరాలన్నీ వెల్లడించటంతో... సీఎం రమేశ్ సంస్థ కాంగ్రెస్ పార్టీకి 30 కోట్లు ఇచ్చిన వ్యవహారం బట్టబయలయి... దొంగలు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు.

మే13న పోలింగ్ నేపథ్యంలో సెలవు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికలు జరిగే మే13వ తేదీన స్థానిక సెలవుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మే13న సెలవు ప్రకటించాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ప్రైవేటు సంస్థలకు మే13న చెల్లింపు సెలవు దినంగా ప్రకటించింది. ఆ రోజు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సెలవు తీసుకున్న వారికి పూర్తిస్థాయిలో కూలి లేదా వేతనం చెల్లించాలని, సంస్థలు కూలి లేదా వేతనంలో కోత విధిస్తే రూ.500 వరకు పెనాల్టీ విధించే అవకాశం ఉందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. షిఫ్టుల్లో పనిచేసే చోట సెలవును ఓటు హక్కు వినియోగించుకునే సమయం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే పరిగణిస్తారని స్పష్టం చేసింది. రోజువారీ కూలీలకు కూడా సెలవు వర్తిస్తుందని పేర్కొంది. విధులు నిర్వహించకపోతే ప్రమాదం లేదా భారీ నష్టం సంభవించే పరిస్థితులు ఉన్న ఓటర్లకు ఈ సెలవు వర్తించదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'పశ్చిమ' వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న చేరికలు

టీడీపీ, జనసేనను వీడిన 400 మందికి పైగా నేతలు, కార్యకర్తలు

ఏలూరు టౌన్/పెనుగొండ/భీమవరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వైఎస్సార్‌సీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఏలూరు పోణంగికి చెందిన గేదెల సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో 200 మందికి పైగా టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు..ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని రెండో డివిజన్‌కు చెందిన జనసేన నాయకుడు పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 మందికి పైగా జనసేన కార్యకర్తలు, కత్తేపువీధికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలైన ముస్లింలు 100 మందికి పైగా ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన టీడీపీ నేతలైన నీటి సంఘ మాజీ డైరెక్టర్ ప్రవా వెంకట రమణారావు, గ్రామ రైతు సంఘ అధ్యక్షుడు, టీడీపీ మాజీ బూత్ కన్వీనరు నిమ్మకాయల గంగరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు బిర్రా సుబ్బారావు, బూత్ మాజీ కన్వీనర్ నిమ్మకాయల గంగరావు, నక్కా నాగేశ్వరరావు, వర్ధనపు అశోక్, రొక్కాల రవికుమార్, రొక్కాల సత్యనారాయణ, రొక్కాల సాంబమూర్తి, అన్నంవీడి వెంకటేశ్వరరావు తదితరులు మాజీ మంత్రి చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. భీమవరం మండలం కరుకువాడ బేతపూడికి చెందిన జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలైన పాకెళ్ల దిలీప్ కుమార్, పవన్ కుమార్, పెనుమాల రాహుల్, విన్సెంట్, కల్లబతుల సతీష్, బల్లపు ఇమ్మానియేల్, కుచ్చనపల్లి సుందర్రావు, చలపతిరావు, సన్నీ, సామేలు, బుంగా ధనరాజు, గోపిభాను తదితరులు ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



భీమవరంలో జనసేన, టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్



ఏలూరులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ముస్లిం సోదరులు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి

జలదంకి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తానని, తనకు రాజకీయాలు తప్ప వేరే వ్యాపకాలు లేవని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం జమ్ములపాలెం నుంచి బ్రాహ్మణక్రాక వరకు ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఎన్‌ఆర్‌ఐలను పలుచోట్ల అభ్యర్థులుగా ప్రకటించిందని, అటువంటి వారిని ఎన్నుకుంటే ప్రజలకు ఏ విధంగా సేవ చేయగలరో ఓటర్లు ఆలోచించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే మేకపాటి కుటుంబానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు ఒక్క నెల్లూరు జిల్లాలోనే రెండు పోర్టులు ఉన్నాయని గ్రహించాలన్నారు. రామాయపట్నం పోర్టును సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో రికార్డు సమయంలో నిర్మించారని తెలిపారు. సోమశిల ప్రాజెక్టుకు సంబంధించి పూడికతీత పనులు ప్రారంభమయ్యాయని, జలదంకి ప్రాంతానికి నీటిని త్వరలోనే తీసుకువస్తామని, దీంతో సాగు, తాగునీటి సమస్యలు శాశ్వతంగా తీరతాయన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో నాలుగేళ్ల క్రితం ఇళ్ల స్థలాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చెల్లిస్తామని చెప్పారు. బ్రాహ్మణక్రాకలో ఓ నాయకుడు తమకు 5వేల ఓట్లు ఉన్నాయని చెప్పుకుని రూ.7 కోట్లు తీసుకుని టీడీపీ కండువా కప్పుకున్నాడన్నారు. ఐదేళ్లపాటు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉండి ఎన్నికల సమయంలో డబ్బు సంచులకు అమ్ముడుపోయి గోడలు దూకేవారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో వైనాట్ 175 అన్నది తమ పార్టీ లక్ష్యమని, ప్రజల సహకారంతో ఆ లక్ష్యాన్ని చేరుకుంటామని విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి అయిన తనను, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కుల, మత, పార్టీ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల తదితరులు పాల్గొన్నారు.



విజయసాయిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

టీడీపీలో ఆగ్రహ జ్వాల

టికెట్ల కేటాయింపుపై భగ్గుమన్న నిరసనలు.. పార్టీ జెండాలు కాల్చివేత



శ్రీకాకుళంలో టీడీపీ జెండాలను మంటల్లో వేస్తున్న కార్యకర్తలు



కామవరపుకోటలో నిరసన తెలుపుతున్న గోరుముచ్చు గోపాల్ యాదవ్ మద్దతుదారులు



సత్యవేడు మండలం మదనంబేడులో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: టీడీపీలో మూడోవిడత టికెట్ల జాబితాపై ఆపార్టీ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. టికెట్ మంటలు రాజుకుంటున్నాయి. ఇప్పటికే టికెట్ వస్తుందని ఆశపెట్టుకున్న వారంతా జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆందోళనబాట పట్టారు. తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. వారి అనుయాయులు పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను మంటల్లో వేసి తగులబెట్టారు. మొత్తమ్మీద రాష్ట్ర వ్యాప్తంగా తలెత్తిన వ్యతిరేక పవనాలు పార్టీ అధిష్టానం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. శ్రీకాకుళంలో గుండ లక్ష్మీదేవి, పాతపట్నంలో కలమట వెంకటరమణను కాదని రూ.కోట్లు ముట్టచెప్పినవారికి టికెట్లు ఇచ్చారంటూ టీడీపీలోని సీనియర్ కేడర్ రగిలిపోయింది. పార్టీ కరపత్రాలు, బ్రోచర్లు, ఇతరత్రా మెటీరియల్‌ను తగలబెట్టి తమ నిరసన తెలియజేశారు. 'తెలుగుదేశం పార్టీ వద్దు.. సైకిల్ గుర్తు అసలొద్దు.. టీడీపీ జెండాలు.. చంద్రబాబు అజెండా మనకొద్దు' అంటూ శ్రీకాకుళంలో ఆ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళంలో సీనియర్ నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులకు పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని, ఆమెకు సీటు రాకుండా అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు అడ్డుకున్నారని తెలుగు తమ్ముళ్లు ఒంటి కాలితో లేచారు. ఏ మాత్రం పట్టులేని గొండు శంకర్‌కు టికెట్ ఇచ్చి, సీనియర్లకు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, లోకేశ్ ఫొటోలను ధ్వంసం చేసి, మంటల్లో తగలెట్టారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ రామ్మోహన్‌నాయుడిని ఓడించి తీరుతామని శపథం చేశారు. ఈ సందర్భంగా ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని గుండ ఫ్యామిలీపై అనుచరులంతా ఒత్తిడి చేశారు. లేదంటే వైఎస్సార్‌సీపీలో చేరాలని కోరారు. శుక్రవారం సాయంత్రం తన అనుయాయుల అభీష్టం మేరకు ఇండిపెండెంట్‌గా పోటీకి దిగనున్నట్టు మాజీ శాసనసభ్యురాలు గుండ లక్ష్మీదేవి ప్రకటించారు. అప్పలసూర్యనారాయణ కూడా ఇండిపెండెంట్‌గా ఎంపీగా బరిలోకి దిగాలని కార్యకర్తలు కోరగా ఆదివారం దీనిపై నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

పాతపట్నంలో మూకుమ్మడి రాజీనామాలు

పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు చంద్రబాబు మొండి చేయి చూపడంతో ఆయన అనుచరులు మండిపడ్డారు. పది కార్లు వేసుకుని, పదిమందిని వెంట బెట్టుకుని, నియోజకవర్గంలో షో చేసిన మామిడిగోవిందరావుకు టికెట్ ఇవ్వడంపై వారు నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో టీడీపీ ఎలా గెలుస్తుందో చూస్తామని సవాల్ చేశారు. ఈ సందర్భంగా పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, కొత్తూరులో కలమటకు మద్దతుగా రోడ్డెక్కి టీడీపీ ఫ్లెక్సీలు, కరపత్రాలను తగలబెట్టారు. పార్టీ మండలాధ్యక్షులు సైతం రాజీనామా చేశారు. చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు తదితరుల ఫ్లెక్సీలను మంటల్లో దహనం చేశారు. నిరసన ర్యాలీలు చేసి, కలమట అనుచరులంతా మూకుమ్మడిగా పార్టీకి రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారు.



పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ జెండాలు, బ్యానర్లు తగులబెడుతున్న తెలుగు తమ్ముళ్లు

రాష్ట్ర కార్యదర్శి పదవికి గొంపకృష్ణ రాజీనామా

విజయనగరం జిల్లా శృంగవరపుకోట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పేరును ఖరారు చేయడంతో ఇప్పటివరకూ అక్కడి టికెట్‌కోసం ఎదురుచూసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అసంతృప్తితో రగిలిపోయారు. పార్టీ పదవికి రాజీనామా చేసి, ఇండిపెండెంట్‌గా బరిలో దిగనున్నట్టు ప్రకటించారు. ఆయనతో పాటు వేపాడ, కొత్తవలస, జామి మండలాల టీడీపీ అధ్యక్షులు గొంప వెంకటరావు, గొరపల్లి రాము, లగుడు రవికుమార్, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి వారి పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం తన అభిమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గొంపకృష్ణ మాట్లాడుతూ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతానని ప్రకటించారు. టీడీపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి ఉన్న తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తును పెయింట్‌తో చెరిపేశారు.

అమలాపురంలో అసంతృప్తి జ్వాలలు

అమలాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా అయితాబత్తుల ఆనందరావును, పార్లమెంట్ అభ్యర్థిగా గంటి హరీష్‌ను పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై అక్కడి నాయకులు మండిపడుతున్నారు. ఆనందరావుకు సీటు రాకుండా రాజప్ప సోదరుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు ఆధ్వర్యంలో పరమట శ్యామ్‌కుమార్ గట్టి ప్రయత్నం చేశారు. అయినా ఆయనకే టికెట్ కేటాయించడంతో నాయకులు, కార్యకర్తలు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన వారిలో జనసేన నాయకులు కూడా ఉండటం గమనార్హం.

ఆదిమూలంను మార్చాలని డిమాండ్

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను ప్రకటించడంపై సత్యవేడు, నాగలాపురం మండలాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మదనంబేడులో శుక్రవారం సాయంత్రం పంచాయతీ పరిధిలో తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. ఆదిమూలం టీడీపీ కార్యకర్తలపై చిన్నపాటి గొడవలను భూతద్దంలో చూపించి అట్రాసిటీ కేసులు పెట్టించారని గుర్తుచేశారు. అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. నాగలాపురంలో కూడా పలువురు తెలుగు తమ్ముళ్లు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు.

రగిలిపోతున్న పోతిన మహేష్

విజయవాడ వెస్ట్ నుంచి సీటు ఆశిస్తున్న పోతిన మహేష్ భంగపాటుకు గురయ్యాడు. కానీ పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నట్టు పవన్ తేల్చి చెప్పారు. ఈ ప్రకటనతో కంగుతిన్న మహేష్ డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ నమ్మించి మోసం చేశారని, ఇలాగైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని హెచ్చరికలు పంపారు.

ఎక్కడ 'పుట్టా'వో మాకెందుకు?

ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా, టీటీడీ మాజీ చైర్మన్, కడప జిల్లా టీడీపీ నేత పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు పుట్టా మహేష్‌ను ఎంపిక చేయడంపై అక్కడి బీజేపీ నేతలు మండిపడుతున్నారు. టికెట్ ఇస్తామని సింగపూర్‌లో ఉన్న తనను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఆర్థికంగా ఉపయోగించుకున్నారని, టీడీపీ జెండా మోయటానికే జనాలు ముందుకు రాని సందర్భంలో ఏడాది పాటు కష్టపడి పనిచేశానని ఎన్‌ఆర్‌ఐ గోరుముచ్చు గోపాల్ యాదవ్ చెప్పారు. తన అసంతృప్తిని వీడియో రూపంలో విడుదల చేశారు. బీసీలంటే యనమల కుటుంబం ఒక్కటేనా, ఆయన కుటుంబంలోనే మూడు టికెట్లు ఇస్తారా, మిగతా వెనకబడిన కులాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా గ్రేట్ అని.. ఆయన ధైర్యాన్ని ఎప్పుడూ మెచ్చుకుంటానని, తాను ఆయనపై ఏమైనా విమర్శలు చేసి ఉంటే పార్టీ పరంగా తప్ప వేరేగా కాదని వివరించారు. ఈ నెల 25న కామవరపుకోటలో దగాపడ్డ బీసీ సోదరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. 'కడప నేత వద్దు– స్థానిక బీజేపీ నేతలకే టికెట్ ఇవ్వాల'ని పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ గాదిరాంబాబు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్లు, పార్టీ వివిధ విభాగాల నేతలు విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. స్థానిక అశోక్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఏలూరు టికెట్ విషయంలో బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు పునరాలోచన చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కామవరపుకోట చెక్ పోస్ట్ సెంటర్‌లో గోరుముచ్చు గోపాల్ యాదవ్ మద్దతుదారులు శుక్రవారం రాత్రి టైర్లకు నిప్పంటించి నిరసన తెలిపారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

పురందేశ్వరి కోసం మమ్మల్ని బలి చేస్తారా?

విపక్ష కూటమిలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానం అభ్యర్థిత్వం కలకలం రేపుతోంది. టీడీపీ ప్రకటించిన మూడో జాబితాలో టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరి పేరు లేకపోవడంపై ఆ వర్గం నేతలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. జనసేన కోసం ఇప్పటికే రాజానగరం ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన ఆయనకు.. ఇప్పుడు బీజేపీ కోసం ఎంపీ స్థానం వదుకోవాల్సి వస్తుందన్న ఆందోళన నెలకొంది. ఎంపీ టికెట్ అయినా వస్తుందనుకుంటే అదీ దక్కే అవకాశం కనిపించకపోవడంతో ఆ వర్గం టీడీపీ అధినేతపై మండిపడుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిని రాజమహేంద్రవరం ఎంపీగా బరిలోకి దింపేందుకు కమలనాథులు పావులు కదుపుతూండటంతో తన రాజకీయ భవిష్యత్తు ఏమిటని ఆయన కార్యకర్తల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుంటే నట్టేట ముంచారని ఆయన పేర్కొన్నట్టు తెలిసింది.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఏఐతో బోధన

ప్రస్తుత సెమిస్టర్ నుంచి ఆరు కళాశాలల్లో అమలు

- ఇప్పటికే కళాశాలలకు చేరిన జెడ్‌స్పేస్ సాంకేతిక టెక్నాలజీ
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి దశల వారీగా 50 కళాశాలలకు పెంపు
- తొలుత ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో ఏఐ బోధన
- త్రీడీ అద్దాలు లేకుండానే ఆ అనుభూతిని కలిగించేలా వర్చువల్ ల్యాబ్స్
- వీఆర్, ఏఆర్ విధానంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపు



రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో ప్రొజెక్టర్‌పై ఏఐ బోధన చేస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యలో ప్రపంచ స్థాయి బోధన ప్రమాణాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కృత్రిమ మేధ (ఏఐ)తో పాఠాలు బోధించనుంది. అధ్యాపకులు పాఠ్యపుస్తకాలు చూస్తూ, బ్లాక్ బోర్డులపై రాస్తూ పాఠాలు చెప్పే విధానాన్ని ఏఐతో భర్తీ చేయనుంది. విద్యార్థులను ఆకట్టుకుంటూ వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంచేలా అగ్‌మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్)ల్లో బోధించనుంది. ఈ మేరకు దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 'వర్చువల్ లెర్నింగ్ ల్యాబ్స్'ను అందుబాటులోకి తెస్తోంది. ఈ మేరకు కళాశాల విద్యాశాఖ అమెరికాకు చెందిన 'జెడ్ స్పేస్' ఇండియాతో ఒప్పందం చేసుకుంది.

తొలి దశలో సైన్స్ పాఠాలు..

విద్యార్థులకు పాఠ్యాంశాలను త్రీడీ విధానంలో విజువలైజ్ చేసి బోధించడం తాజా ప్రాజెక్ట్ లక్ష్యం. ఇందుకోసం జెడ్‌స్పేస్ అందించే ప్రత్యేక ల్యాప్‌టాప్‌ను వినియోగించనున్నారు. తొలి దశలో సైన్స్ కోర్సుల్లోని పలు సబ్జెక్టుల పాఠ్యాంశాలకు వర్చువల్ కంటెంట్‌ను తయారు చేసి బోధన చేయనున్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో సుమారు 40 టాపిక్స్‌కు చెందిన కంటెంట్‌ను జెడ్‌స్పేస్ ఉచితంగా అందిస్తోంది. దీనికి అదనంగా మరో 60 టాపిక్స్‌కు కంటెంట్‌ను కళాశాల విద్యాశాఖ రూపొందించనుంది. దీనికోసం జెడ్‌స్పేస్ అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది.

పైలట్ ప్రాజెక్టుగా ఏఐ బోధన..

ఇప్పటికే ప్రభుత్వం డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు తరగతి గది బోధనతోపాటు 10 నెలల ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడం ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తోంది. ఇందులో భాగంగానే 2023–24లో సింగిల్ మేజర్, సింగిల్ మైనర్ సబ్జెక్టు విధానాన్ని అమల్లోకి తెచ్చింది. తద్వారా ఒక విద్యార్థి ఒక సబ్జెక్టులో పరిపూర్ణ విజ్ఞానాన్ని సాధించేలా మార్గం సుగమం చేసింది. ఈ క్రమంలోనే కళాశాల విద్యాశాఖ సుమారు 80 రకాల సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అందిస్తోంది. ఆర్ట్స్‌లో 23, కామర్స్‌లో 15, బయోలాజికల్ సైన్స్‌లో 15, ఫిజికల్ సైన్స్‌లో 15, కెమికల్ సైన్స్‌లో 5, మ్యాథ్స్‌లో 3, ఒకేషనల్ కోర్సుల్లో 4 ప్రోగ్రామ్స్‌ను ప్రవేశపెట్టింది. తొలుత ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ నాలుగు కోర్సుల్లో సింగిల్ మేజర్లు ఉన్న కళాశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా 'ఏఐ' విధానంతో బోధనను తెస్తోంది.

త్రీడీ అద్దాలు లేకుండానే..

జెడ్‌స్పేస్ ల్యాప్‌టాప్‌లు వర్చువల్ రియాలిటీ సామర్థ్యాలతో కూడిన పోర్టబుల్ వర్క్‌స్టేషన్‌లుగా పనిచేస్తాయి. దీన్ని ఉపయోగించే వ్యక్తులు త్రీడీ అద్దాలు ధరించాల్సిన అవసరం లేదు. ఇందులోని వర్చువల్ ఆబ్జెక్టులు స్క్రీన్ వెలుపల, లోపలకి కదలాడుతూ వాస్తవికంగా కనిపిస్తాయి. ఉదాహరణకు అనాటమీ టాపిక్ బోధనలో మానవ శరీర నిర్మాణాన్ని త్రీడీ ఇమేజ్‌ల ద్వారా ఒక్కో లేయర్‌ను వివరిస్తూ లోపలి భాగాలను క్షుణ్ణంగా అర్థం చేసుకునేందుకు వీలుగా బోధన చేయొచ్చు. వాస్తవానికి జెడ్‌స్పేస్ ల్యాప్‌టాప్ ఎదురుగా కూర్చుని ఆపరేట్ చేసే వ్యక్తికి మాత్రమే త్రీడీ ఎఫెక్ట్స్‌లో సబ్జెక్ట్ కనిపిస్తుంది. ఈ ల్యాప్‌టాప్‌కు ప్రత్యేకంగా జెడ్‌వ్యూ కెమెరాను అమర్చడం ద్వారా ప్రొజెక్టర్‌ను ఉపయోగించి ఎక్కువ మందికి స్క్రీన్‌పై త్రీడీ అనుభూతిని అందించవచ్చు. ఇందుకు వీలుగా సాధారణ ప్రొజెక్టర్స్ స్థానంలో అత్యాధునిక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను సైతం అందుబాటులోకి తీసుకురానుంది.

తొలుత ఆరు కళాశాలల్లో..

ప్రస్తుత సెమిస్టర్ నుంచి ఏఐ టెక్నాలజీ సాయంతో బోధన చేసేందుకు వీలుగా కళాశాల విద్యాశాఖ ఆరు కళాశాలలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. కడప (మహిళ), అనంతపురం (మెన్), రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ, విజయవాడ ఎస్ఆర్ఆర్– సీవీఆర్ డిగ్రీ కాలేజీ, గుంటూరు (మహిళ), విశాఖపట్నంలోని వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జెడ్‌స్పేస్ ల్యాప్‌టాప్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. అనంతరం వచ్చే విద్యా సంవత్సరం నుంచి దశలవారీగా సుమారు 50 కళాశాలల్లో అమలు చేయనుంది. జెడ్‌స్పేస్ సాంకేతికత వినియోగంపై ఇప్పటికే అధ్యాపకులకు సైతం శిక్షణ పూర్తయింది.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విధానం భేష్



కానూరు వీఆర్ సిద్ధార్థ కళాశాలలో అధ్యాపకులతో సమావేశమైన కేంద్ర బృందం సభ్యులు ఆశీష్ కుమార్ సక్సేనా, హరీష్‌చంద్ర, ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తదితరులు

కేంద్ర బృందం సభ్యులు ఆశీష్ కుమార్, హరీష్‌చంద్ర కితాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజిటల్ విద్యా విధానంపై కేంద్ర బృందం సభ్యులు కితాబునిచ్చారు. ఇన్నోవేషన్ వర్క్‌షాప్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ లైబ్రరీ, విద్యార్థులకు ట్యాబ్‌లు, ఐఎఫ్‌బీ ప్యానల్స్ అమర్చి విద్యావిధానం చేసే తీరును కేంద్ర బృందం సభ్యులైన ఆశీష్ కుమార్ సక్సేనా, హరీష్‌చంద్ర పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ విద్యాబోధనతో పాటు డిజిటల్ విధానంలో చేస్తున్న బోధనను విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లాలోని వానపాముల జిల్లా పరిషత్ హైస్కూల్, మచిలీపట్నం మునిసిపల్ పార్కులోని బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలోని డిజిటల్ విద్యావిధానాన్ని కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, సమగ్ర శిక్షా అసిస్టెంట్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి. శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 162 ఆదర్శ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆదర్శ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యా బోధన అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ /ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28 నుంచి మే 22 వరకు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. అనంతరం విద్యార్థికి కేటాయించే జనరల్ నంబరు ఆధారంగా https://apms.-apcfss.in/, https://cse.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నగదు, బంగారం పట్టివేత

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎటువంటి పత్రాలు, ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న నగదు, బంగారాన్ని విజయవాడలో అధికారులు, పోలీసుల బృందం పట్టుకుంది. శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి, స్టాటిక్ సర్వేలెన్స్ టీం, విజయవాడ గవర్నర్‌పేట సీఐ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో భాగంగా గవర్నర్‌పేట పరిధిలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద కారులో తీసుకెళ్తున్న రూ. 26.33 లక్షల నగదు, 2.6 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. ఆకారు గాదె రవీంద్రబాబు అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించారు. పట్టుబడిన నగదు, బంగారానికి సంబంధించి సరైన పత్రాలు, ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. అనంతరం ఐటీ, జీఎస్టీ అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు గవర్నర్‌పేట పోలీసులు తెలిపారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి గోవింద్ ప్రవీణ్ కుమార్, జి.సుబ్బారెడ్డి, గవర్నర్‌పేట సీఐ, ఎస్సై పాల్గొన్నారు.

మేనిఫెస్టోను దాచేసిన ఘనుడు చంద్రబాబు

- వందశాతం అమలు చేసిన వైఎస్ జగన్
- 'సత్యవేడు' శంఖారావంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



టీడీపీ, బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, యువతతో మంత్రి పెద్దిరెడ్డి

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి చంద్రబాబు ప్రజలను దగాచేస్తే.. తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసి ప్రజలకు సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండలాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొని ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. మేనిఫెస్టోను జగన్ పవిత్ర గ్రంథంగా భావిస్తే.. 14ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు 2014లో ఇచ్చిన 600 మేనిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారని పెద్దిరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి మద్దిల గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పేదరికాన్ని కొలమానంగా తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు పథకాలు అందజేస్తే.. చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకమైనా పేదల కోసం ప్రవేశపెట్టగలిగారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తే రాష్ట్రంలో ఆర్థికమాంద్యం ఏర్పడుతుందని, మరో శ్రీలంక అవుతుందని పచ్చ పత్రికల ద్వారా చంద్రబాబు ఊదరగొట్టి.. నేడు రూ.2.50 లక్షల కోట్లతో సూపర్‌సిక్స్ పథకాలను ఎన్నికల హామీలుగా ఎలా అమలు చేయగలుగుతారని ప్రశ్నించారు. మతతత్వ బీజేపీ, జనసేన పార్టీల పొత్తుతో వస్తున్న చంద్రబాబుకు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ భాషా స్పష్టంచేశారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్, మాజీ ఎమ్మెల్యే సురాజ్, మాజీ ఎమ్మెల్సీ ఎండపల్లి శ్రీనివాసులు రెడ్డి, బీరేంద్ర వర్మ, అన్ని మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకట రమణ శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ఈవో కేఎస్ రామరావు సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న జస్టిస్ వెంకటరమణ ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఏఈవో ఎన్.రమేష్‌బాబు, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

జిల్లా వార్తలు

చదువుతో పాటు నైపుణ్యాలు అవసరం

ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ వైస్ చైర్మన్ సయ్యద్ మొహమ్మద్ అబ్బాస్



మాట్లాడుతున్న ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ వైస్ చైర్మన్ మొహమ్మద్ అబ్బాస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కామర్స్ విద్యార్థులకు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ వైస్ చైర్మన్ సయ్యద్ మొహమ్మద్ అబ్బాస్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కాంక్వెస్ట్ 2కే24 ఉత్సాహపూరితమైన వాతావరణంలో జరిగింది. నగరంలోని వివిధ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన మొహమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆర్థిక రంగానికి సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరో అతిథి ఐసీఎస్ఐ కోశాధికారి నాగరాజు మాట్లాడుతూ కంపెనీ సెక్రటరీ కోర్సుకు అత్యంత డిమాండ్ ఉందని చెప్పారు. విద్యార్థులు ఆ రంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. తమ సంస్థ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ అనలిటిక్స్, క్విజ్, పీపీటీ, పోస్టర్ మేకింగ్, స్పాట్ ఫొటోగ్రఫీ, అంత్యాక్షరి, గ్రూప్‌డాన్స్ వంటి పోటీలు నిర్వహించారు. వాటిలో విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, కామర్స్ హెచ్‌ఓడీ జె.వంసత్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధనరావు

సాక్షి, అమరావతి: ఆహార పదార్థాల తయారీదారులు, స్టోరేజ్, రవాణా చేసేవారు నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీఈవో జి. కమలవర్ధనరావు సూచించారు. ఆహార పదార్థాల ప్యాకింగ్, రవాణాలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా వదిలేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆహార అనుబంధ వ్యాపార సంస్థల ప్రతినిధులతో శుక్రవారం విజయవాడలో ఆయన సమావేశమయ్యారు. కమలవర్ధనరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1.50 కోట్ల మంది ఆహార పదార్థాల తయారీ, అమ్మకందారులు, అనుబంధ సంస్థల వ్యాపారులున్నారన్నారు. ఈ క్రమంలో ఆహార పదార్థాల నాణ్యత విషయంలో స్థిరమైన ప్రమాణాలను అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్ తరాలకు మెరుగైన ఆహార పదార్థాలను అందించడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఆహారానికి సంబంధించిన చట్టాలను ఏకీకృతం చేయడంతో పాటు ఆహార పదార్థాలకు సైన్స్ ఆధారిత ప్రమాణాలను నిర్దేశించడానికి, లభ్యతను నిర్ధారించడం ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రధాన లక్ష్యమన్నారు.

రాష్ట్ర ఫుడ్ ల్యాబొరేటరీ ప్రారంభం

విభజిత ఏపీలో రాష్ట్రస్థాయి ఫుడ్ ల్యాబొరేటరీని ఇటీవలే విశాఖపట్నంలో ప్రారంభించామని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. రూ.80 కోట్లతో గుంటూరు, విశాఖపట్నం, తిరుపతిల్లో ల్యాబ్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నాలుగు మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ఇంచార్జి డైరెక్టర్ ఎస్.పూర్ణ చంద్రరావు, విజయవాడ ఫుడ్ కంట్రోలర్ గౌస్‌మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'నారీ కేర్ సిరప్' సీజ్

తయారీ సంస్థపై కేసు

లబ్బీపేట (విజయవాడతూర్పు): నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్‌లోకి విడుదల చేసిన 'నారీ కేర్ సిరప్'ను ఔషధ నియంత్రణ మండలి అధికారులు సీజ్ చేశారు. ఔషధ నియంత్రణ మండలి అసిస్టెంట్ డైరెక్టర్ కోట అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏదైనా మందును విడుదల చేసేటప్పుడు అది ఏ జబ్బుకు పని చేస్తుందనేది దానిపై ముద్రించ కూడదన్నారు. కానీ నారీ కేర్ సిరప్‌పై ఇన్‌ఫెర్టిలిటీ (సంతాన సాఫల్యం)తో పాటు, రుతు సమస్యలకు పని చేస్తుందని ముద్రించి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు ఔషధ నియంత్రణ మండలి అధికారులకు సమాచారం అందింది. దీంతో విజయవాడ న్యూ అయోధ్యనగర్, గీతా అపార్ట్‌మెంట్ రోడ్డులోని ఆ సిరప్ తయారీ సంస్థ కె.కె. ప్రొడక్ట్స్‌పై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జె.వినోద్, డి.అన్వేష్ రెడ్డి శుక్రవారం దాడులు నిర్వహించారు. వారి తనిఖీల్లో అక్కడ నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్న 'నారీ కేర్ సిరప్'లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఆ మందులు ఎక్కడా విక్రయించరాదని రిటైలర్స్‌కు సైతం ఆదేశాలు జారీ చేశారు. తయారీ సంస్థపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్లు ఏడీ కోట అనిల్‌కుమార్ తెలిపారు.

యువతలో హైపర్ టెన్షన్

- ఇరవై రోజుల కిందట రాణిగారితోటకు చెందిన 26 ఏళ్ల యువకుడు ఫోన్‌లో సీరియస్‌గా చాటింగ్ చేస్తూ బీపీ పెరిగి బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లిపోగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డాడు.
- ఇబ్రహీంపట్నంకు చెందిన 28 ఏళ్ల యువకుడు అధిక రక్తపోటుతో ఇబ్బంది పడుతున్నాడు. ఎంతకీ కంట్రోల్ కాకపోవడం, స్ట్రోక్ ముప్పు పొంచి ఉండటంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసి వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేసిన ప్రభుత్వం
- ఆరోగ్య సలహాలతో పాటు ఉచితంగా మందులు
- దుష్ఫలితాలు రాకుండా నివారించే యత్నం



శిబిరంలో బీపీ చెక్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): యువతలో హైపర్ టెన్షన్ ముప్పు పొంచి ఉంది. అందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో రెండు పదుల వయస్సులోనే హైపర్ టెన్షన్ కారణంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురవుతున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తుంది. యువత గుండెలను సైలెంట్‌గా పట్టేస్తుంది. మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తుంది. పక్షవాతంతో పాటు, జ్ఞాపకశక్తి సన్నగిల్లేలా చేస్తోంది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో చిన్న వయస్సులోనే హైపర్ టెన్షన్ బారిన పడుతున్న వారి సంఖ్య అధికమవుతుంది. ఈ నేపథ్యంలో రక్తపోటుతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. దానికి తోడు కుటుంబ డాక్టర్, ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమం ఇలా...

ఇండియా హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా రక్తపోటు బాధితులను గుర్తించేందుకు కేంద్ర ఆరోగ్యశాఖ మూడేళ్ల కిందట ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తొలుత ఉమ్మడి కృష్ణాను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టగా, అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నారు. ప్రజల్లో రక్తపోటుపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు. రక్తపోటు ఉన్న వారిని గుర్తించి వారికి సరైన చికిత్స అందేలా చూడటం ఈ కార్యక్రమం ఉద్దేశం. పట్టణ ప్రజలు ఎక్కువగా రక్తపోటుకు గురవుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం తొలుత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేసింది. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అమలు చేస్తున్నారు.

వరంలా మారిన వెల్నెస్ సెంటర్‌లు....

ఒకప్పుడు రక్తపోటును పరీక్షించుకోవాలంటే గ్రామీణులు దూర ప్రాంతంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వారి ఇంటి సమీపంలోనే విలేజ్ హెల్త్ క్లినిక్స్(వెల్నెస్ సెంటర్స్) అందుబాటులోకి వచ్చాయి. దీంతో బీపీ చెక్ చేయించుకునేందుకు ఎప్పుడైనా వెళ్లవచ్చు. అంతేకాదు రక్తపోటు ఉందని నిర్ధారణ అయితే కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా నెలలో రెండు సార్లు వారి గ్రామానికే వస్తున్న వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. దీంతో గ్రామీణులు రక్తపోటును అదుపులో ఉంచుకునే అవకాశం లభించింది. పట్టణ వాసులు సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఎప్పుడైన పరీక్ష చేయించుకుని మందులు వాడుకోవచ్చు.

అదుపులో ఉండాలంటే...

- రక్తపోటు అదుపులో ఉండాలంటే ప్రతిరోజూ 45 నిమిషాలు చొప్పున వారంలో ఐదు రోజులు వ్యాయామం, వాకింగ్ లాంటివి తప్పక చేయాలి.
- ఒత్తిళ్లను అధిగమించేందుకు యోగా చేయడం మంచిది.
- ఆహారంలో కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- ప్రతి మనిషి నెలలో 500 గ్రాములకు మించి వంట నూనెలు వాడరాదు. అధికంగా నూనెలు వినియోగించడం చాలా ప్రమాదకరం
- ఒకే నూనె కాకుండా మార్చి మార్చి వాడటం మంచిది.

అవగాహన పెరగాలి



జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఉరుకులు, పరుగుల జీవన విధానంలో తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కోవడం కూడా చిన్న వయస్సులోనే రక్తపోటుకు దారితీస్తున్నాయి. రక్తపోటును అదుపులో ఉంచుకునే మార్గాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలి. చాలా మందికి గుండె, మెదడు పోటు వంటి వాటికి గురయ్యే వరకూ తమకు రక్తపోటు ఉందని గుర్తించలేకపోతున్నారు. తరచూ రక్తపోటును పరీక్షించుకోవడం, అధిక బరువు తగ్గించుకోవడం, వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి.

– డాక్టర్ టీవీ మురళీకృష్ణ, ఫిజీషియన్

రక్తపోటుకు కారణాలివే

- జీవనశైలిలో మార్పులు, మాంసాహారం, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే జంక్ ఫుడ్స్ తీసుకోవడం.
- శారీరక శ్రమ లేకపోవడం, ఆహారంలో ఉప్పు అధికంగా తీసుకోవడం రక్తపోటు పెరగడానికి కారణంగా వైద్యులు చెబుతున్నారు.
- ఇటీవల రెండు పదులు దాటిన వారు కూడా బ్రెయిన్‌స్ట్రోక్, గుండెపోటుకు గురైన సందర్భాలు ఉన్నాయి.
- ఎక్కువగా ఫోన్‌లో చాటింగ్, వీడియో గేమ్స్ కూడా రక్తపోటుకు కారణమని నిపుణులు అంటున్నారు.

ఎస్‌బీడీ పేరుతో డూప్లికేట్ బీడీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తమిళనాడు వెల్లూరు జిల్లా కేంద్రంగా ఉత్పత్తి అయ్యే ఎస్ బీడీలను విజయవాడలో నకిలీలు అక్రమంగా విక్రయిస్తున్నారని ఆ సంస్థ మార్కెటింగ్ సేల్స్ సూపర్‌వైజర్ అబ్దుల్‌లతీఫ్ తెలిపారు. పాతబస్తీలో వివిధ పాన్ దుకాణాల్లో గుర్తించిన నకిలీ ఎస్ బీడీల సరుకుతో రథం సెంటర్‌లోని డిస్ట్రిబ్యూటర్ వద్ద శుక్రవారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌లతీఫ్ మాట్లాడుతూ తమ సరుకు తక్కువగా మార్కెట్లోకి వెళ్తుండటంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అసలు విషయం బయటకు వచ్చిందన్నారు. ఎస్ బీడీలు మార్కెట్లో గత 60 ఏళ్లుగా ఎంతో పేరుగాంచినవని చెప్పారు. అటువంటి కంపెనీ పేరుతో డూప్లికేట్ తయారుచేసి మార్కెట్లో అమ్ముతున్నారని తెలిపారు. తమకు వచ్చిన అనుమానంతో మార్కెట్లోకి వెళ్లి ఆరా తీయగా సుమారుగా 200 దిండ్లు తమకు దొరికాయని పేర్కొన్నారు. డూప్లికేట్ బీడీల వల్ల ప్రజల ఆరోగ్యం పూర్తిగా పాడైపోతుందన్నారు. అదేవిధంగా ఒరిజినల్ బీడీల ధర రూ.530 ఉండగా డూప్లికేట్ బీడీలు రూ.200కే మార్కెట్లో అమ్ముతున్నారని వెల్లడించారు. వరంగల్ నుంచి ఈ డూప్లికేట్ సరుకు వస్తున్నట్లు తమ సమాచారం అందిందని వివరించారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరు అమ్ముతున్నది కచ్చితంగా తెలియలేదని దానిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌బీడీ డిస్ట్రిబ్యూటర్ ఓం కార్ ట్రేడర్స్ నిర్వాహకులు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని కృష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం అత్యవసర సేవల కింద ప్రకటించిన 33 కేటగిరీలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయుటకు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ ఓటింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, హోం ఓటింగ్ విధానం అమలుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల్లో మద్యం, నగదు, వస్తు ప్రలోభాల అక్రమ రవాణా అరికట్టే అంశాల్లో స్టాటిక్ సర్వేలెన్స్ టీంలను అప్రమత్తం చేయాలని కోరారు.

జెడ్పీ సీఈవో జ్యోతిబసు బదిలీ



చిలకలపూడి(మచిలీపట్నం): జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు బదిలీ అయ్యారు. ఎన్నికల సమయంలో సొంత జిల్లాలో విధులు నిర్వహించకూడదన్న నిబంధనల మేరకు బదిలీ చేశారు. డెప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనందకుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జ్యోతిబసు ప్రభుత్వానికి రిపోర్ట్ చేశారు.



డయాబెటిస్‌కు సూపర్ ఫుడ్

ప్రస్తుత కాలంలో డయాబెటిస్ సమస్య అందరిలోనూ కనిపిస్తోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ముఖ్యంగా జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల మధుమేహం సమస్య నానాటికి పెరిగిపోతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. మధుమేహం విషయంలో, రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణంగా ఉండేలా చూసుకోవడం మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలి.

రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉంటే, దానిని తగ్గించుకోవడానికి కొన్ని సూపర్‌ఫుడ్‌ల సహాయం తీసుకోవచ్చు. అవేంటో చూద్దామా...

దాల్చిన చెక్క: రక్త ప్రవాహంలో చక్కెర కదలికను పెంచడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.





సొరకాయ: సొరకాయలో 92% నీరు, 8% ఫైబర్ ఉంటుంది. దీనిలో గ్లూకోజ్, చక్కెర సంబంధిత సమ్మేళనాల పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ఇది డయాబెటిక్ రోగులకు అద్భుతమైన కూరగాయగా పరిగణిస్తారు.



కాకరకాయ: రుచికి చేదుగా ఉండే కాకరకాయలో పాలీపెప్టైడ్-పి ఉంటుంది. ఇది ఇన్సులిన్ లాంటి హైపోగ్లైసిమిక్ ప్రోటీన్. ఇది కణాలలోకి గ్లూకోజ్‌ని తీసుకురావడంలో సహాయపడుతుంది.

మెంతులు: ఇవి ఫైబర్, ఇతర రసాయనాలను కలిగి ఉంటాయి. ఇవి జీర్ణక్రియను నెమ్మదిస్తాయి. శరీరంలోని కార్బోహైడ్రేట్లు, చక్కెరను గ్రహించడంలో సహాయపడతాయి. దీని కారణంగా రక్తంలో చక్కెర సాధారణంగా ఉంటుంది.



ఆకు కూరలు: ఈ కూరగాయలలో ఫైబర్, మెగ్నీషియం, విటమిన్ ఎ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెరను తగ్గించడంలో సహాయపడతాయి.



జొన్నలు, రాగులు: జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలలో డయాబెటిస్‌ను నియంత్రించే కారకాలు ఉంటాయి. రాగి జావ, జొన్న రవ్వతో చేసిన ఉప్మా, జొన్న రొట్టెలు, రాగి జావ, రాగి రొట్టెలు తీసుకోవడం డయాబెటిక్స్‌కు చాలా మంచిది.

మజ్జిగ తీసుకున్నారా?

వేసవి కాలం వచ్చేసింది. వాతావరణంలో వచ్చే మార్పులతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ వేసవి తాపానికి అల్లాడవలసిందే. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం కొబ్బరి బొండాలు, చెరుకు రసం, పళ్లరసాలు, మజ్జిగ వంటి వాటిని తరచు తాగుతూ ఉంటాం. అయితే వీటన్నింటిలోనూ మజ్జిగ తీసుకోవడం వల్ల ఎక్కువ లాభాలున్నాయని అంటున్నారు పోషకాహార నిపుణులు. మజ్జిగను ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం..



వేసవికాలంలో రోజూ రెండుసార్లు మజ్జిగ తాగడం వలన ఆరోగ్యానికి మంచిది. అయితే కొన్ని పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి. అవేమిటో, వాటిని ఎలా పుచ్చుకోవాలో చూద్దాం...

మజ్జిగలో వేయించిన జీలకర్ర పొడి కలుపుకుని తాగడం వలన వేసవి తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది.

వ్యాధినిరోధక శక్తిని పెంచే గుణం మజ్జిగలో పుష్కలంగా ఉంది. అంతేకాదు రోజూ మజ్జిగను తాగడం వలన జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది.

మజ్జిగలో కరివేపాకు, నిమ్మరసం, ఉప్పు కలిపి తీసుకోవడం వలన దాహార్తి తీరుతుంది.

గ్లాసు పల్చటి మజ్జిగలో చిటికడు సొంఠి, చిటికడు సైంధవ లవణం కలుపుకుని తాగితే వేసవి నుంచి ఉపశమనం కలుగుతుంది.

మజ్జిగలో ఉప్పు, కొత్తిమీర, నిమ్మరసం, దబ్బాకులు, పచ్చిమిర్చి ముక్కలు వేసి సేవించడం వలన దాహార్తి తీరడమే కాదు.. శక్తి కూడా చేకూరుతుంది.

వేసవి వేడికి తిన్న ఆహారం అరగక ఒక్కోసారి వాంతులు అవుతుంటాయి. అలాంటప్పుడు చిటికడు జాజికాయ పొడిని మజ్జిగలో కలుపుకుని సేవించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

మజ్జిగలో విటమిన్ బి12, పొటాషియం, ఫాస్పరస్, క్యాల్షియం ఉంటాయి. ఇవి శరీరానికి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

మజ్జిగ ఆరోగ్యకరమైన పానీయం. కనుక వేసవిలో కూల్ డ్రింక్స్ కంటే ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ రెండుసార్లు మజ్జిగను తీసుకోండి.

చిప్స్ అలవాటు చేసేముందు ఆలోచించండి!

చిప్స్‌లో ఎక్కువ కాల నిల్వ ఉంచేందుకు ఇందులో సోడియంను ఎక్కువగా ఉపయోగిస్తారు. సోడియం ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే వీటి తయారీలో ఉపయోగించే నూనె కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.



చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఇష్టపడి తినే స్నాక్స్‌లో చిప్స్ ఒకటి. రకరకాల రంగుల కవర్స్‌తో ఆకర్షణీయంగా ప్యాక్ చేసిన చిప్స్‌ను చిన్నారులు ఎంతో ఇష్టపడి తింటుంటారు. అయితే చిప్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తెలిస్తే మాత్రం ఇకపై వాటిని తినాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే. చిప్స్ తీసుకోవడం వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్ ఏంటో తెలుసుకుందాం..

- ఎక్కువ కాల నిల్వ ఉంచేందుకు చిప్స్‌లో సోడియంను ఎక్కువగా ఉపయోగిస్తారు. సోడియం ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే వీటి తయారీలో ఉపయోగించే నూనె కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యాన్ని చిప్స్ క్రమంగా దెబ్బతీస్తాయి. చిప్స్‌లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్ కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ధమనుల్లో రక్త ప్రసరణను అడ్డుకుంటుంది. దీంతో ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.
- శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పెరగడానికి గల కారణాలలో చిప్స్ ముఖ్య కారణం. దీని వల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల్లో ఊబకాయానికి చిప్స్ కారణమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- చిప్స్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరం ఒక్కసారిగా బరువు పెరుగుతుంది. చిప్స్‌లో ఫైబర్ కంటెంట్ అనేది అస్సలు ఉండదు. దీంతో చిన్నారుల్లో ఇది మలబద్ధకానికి దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది మరెన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- చిప్స్‌ని ఎక్కువగా తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అంతే కాదు.. వంధ్యత్వానికి దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బరువు పెరుగుతారు. కడుపులో గ్యాస్, జీర్ణ సంబంధిత సమస్యలకు చిప్స్ కారణమవుతుందని చెబుతున్నారు. రోగ నిరోధక శక్తి బలహీన పడి వైరస్‌లు, బ్యాక్టీరియా దాడులు పెరుగుతాయని చెబుతున్నారు.
- అందువల్ల పిల్లలకు జంక్ ఫుడ్ ఇచ్చే విషయంలో పెద్దలు కాస్త జంకడం మంచిది. వీలయినంత వరకు వారికి పండ్లు, డ్రై ఫ్రూట్స్, మొలకెత్తిన గింజలతో చేసిన వంటకాలు, పచ్చి కూరగాయలతో చేసిన సలాడ్స్ వంటివి అలవాటు చేయడం మంచిది.

మీకు తెలుసా?

మీ పొట్ట పరిశుభ్రంగానే ఉందా?



పొట్ట శుభ్రంగా లేకపోతే మలబద్ధకం, అజీర్ణం, ఉబ్బరం, కడుపునొప్పి, గ్యాస్, అజీర్ణం, వాంతులు, వికారం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. అంతే కాదు.. తలనొప్పి, అలసట, బరువు పెరగడం, అలసట లేదా బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

- ఒక గ్లాసు గోరువెచ్చని నీరు, అర టీస్పూన్ నల్ల ఉప్పు, టీస్పూన్ నిమ్మరసం తీసుకుని బాగా కలపండి. ఈ పానీయం పొద్దున్నే ఖాళీ కడుపుతో తాగాలి
- రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల యాపిల్ వెనిగర్ మిక్స్ చేస్తే పొట్ట శుభ్రపడుతుంది. నైట్ నిద్రించే ముందు ఈ పానియం తాగండి
- దీనితో పాటు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇందుకోసం ఆహారంలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్స్ వంటి పోషకాలను చేర్చుకోవాలి.

హెల్త్ టిప్స్



- తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడుసార్లు తీసుకోవాలి.
- పెరుగులో మిరియాల పొడి, బెల్లం కలిపిన మిశ్రమాన్ని నిద్రించే ముందు తీసుకుంటే జలుబు తగ్గుతుంది
- బొప్పాయి కాయ లేదా ఆకుని మెత్తగా నూరి ఆ ముద్దని అరికాళ్ళ ఆనెల మీద పెట్టి, కట్టుకడితే అవి మెత్తబడతాయి.



సినిమా



• 'దేవర' సినిమా లొకేషన్‌లో..

గోవాలో ఆటా పాటా

గోవాలో ఆట పాటలతో సందడి చేస్తున్నాడు 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ మూవీ తర్వాత ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం ఇది. ఈ మూవీతో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తెలుగుకి పరిచయమవుతున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఓ మాంటేజ్ సాంగ్ చిత్రీకరణ కోసం గోవా చేరుకుంది 'దేవర' యూనిట్. గోవాలో మొదలైన కొత్త షెడ్యూల్‌లో రాజు సుందరం మాస్టర్ నేతృత్వంలో ఓ మాంటేజ్ సాంగ్ తెరకెక్కిస్తున్నారు కొరటాల. ఈ సందర్భంగా 'దేవర' నుంచి ఓ వర్కింగ్ స్టిల్ విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్‌తో పాటు కొరటాల శివ, రాజు సుందరం మాస్టర్ కనిపిస్తున్నారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఇప్పటికే గోవాలో కొంత టాకీ పార్ట్ చిత్రీకరించాం. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరికొత్త మాస్ పాత్రలో కనిపిస్తారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం మొదటి భాగాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు మేకర్స్. సైఫ్ అలీఖాన్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు.



• ఖుషీ కపూర్

బేబమ్మగా ఖుషీ

దివంగత నటి శ్రీదేవి, నిర్మాత బోనీ కపూర్‌ల చిన్న కుమార్తె ఖుషీ కపూర్ 'ఉప్పెన' హిందీ రీమేక్‌లో నటించనున్నారని టాక్. వైష్ణవ్ తేజ్, కృతీ శెట్టి జంటగా బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'ఉప్పెన' (2021) తెలుగులో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కరోనా సమయంలో విడుదలైన ఈ మూవీ రూ. 100 కోట్ల వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ చిత్రంలో బేబమ్మగా తనదైన నటనతో అలరించిన కృతీ శెట్టి ప్రేక్షకుల మనసుల్లో బేబమ్మగా క్రేజ్ సంపాదించుకున్నారు. ఈ హిట్ మూవీని నిర్మాత బోనీ కపూర్ హిందీలో రీమేక్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ విషయాన్ని పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ తెలుగులో అంగీకరించిన రెండో చిత్రం సందర్భంగా చెప్పారట బోనీ. 'దేవర' (ఎన్టీఆర్ హీరో) మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు జాన్వీ. ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే రామ్ చరణ్‌తో నటించే క్రేజీ ఆఫర్ సొంతం చేసుకున్నారీ బ్యూటీ. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవంలో జాన్వీ కపూర్‌తో పాటు ఆమె తండ్రి బోనీ కపూర్ కూడా పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన అతిథులతో సరదాగా ముచ్చటించిన బోనీ కపూర్.. ''బుచ్చిబాబు తీసిన 'ఉప్పెన' సినిమా చూశాను. కథ నాకు బాగా నచ్చింది. ఈ సినిమాని హిందీలో రీమేక్ చేయాలనే ఆలోచన ఉంది. మా చిన్నమ్మాయి ఖుషీ కపూర్‌ని 'ఉప్పెన' మూవీ చూడమని చెప్పాను'' అన్నారట. దీంతో 'ఉప్పెన' బాలీవుడ్ రీమేక్‌లో హీరోయిన్‌గా ఖుషీ నటిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి.



• 'తండేల్' సినిమా లొకేషన్‌లో..

హైదరాబాద్‌లో తండేల్

నాగచైతన్య హీరోగా నటిస్తున్న 'తండేల్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. 'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత నాగచైతన్య, డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో రూపొందుతోన్న మూడో చిత్రం 'తండేల్'. 'లవ్ స్టోరీ' వంటి హిట్ మూవీ తర్వాత నాగచైతన్యతో రెండోసారి 'తండేల్'లో నటిస్తున్నారు సాయి పల్లవి. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ మూవీ తాజా షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా షూట్ డైరీస్ పేరుతో సెట్స్‌లోని కొన్ని ఫొటోలను విడుదల చేశారు మేకర్స్. ''దేశభక్తి అంశాలతో కూడిన రస్టిక్ లవ్ స్టోరీ 'తండేల్'. ప్రస్తుతం నాగ చైతన్య, సాయి పల్లవితో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. పాత్రలకు అనుగుణంగా నాగచైతన్య-సాయిపల్లవి డీ-గ్లామర్‌గా కనిపిస్తారు. నటీనటుల గెటప్, క్యాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాసలతో సహా ప్రతిదీ పర్ఫెక్ట్‌గా కనిపించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు చందు మొండేటి'' అని చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: శ్యామ్‌దత్.



• అభిషేక్ బచ్చన్

సెలబ్రేటింగ్ లైఫ్

'విక్కీ డోనర్', 'మద్రాస్ కేఫ్', 'పింక్', 'అక్టోబరు' 'సర్దామ్ ఉద్దమ్' వంటి సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు సూజిత్ సర్కార్ నెక్ట్స్ ఫిల్మ్ ఖరారైంది. ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్ హీరో. జానీ లీవర్, జయంత్ క్రిప్లానీ, అహిల్య బమ్రూ కీలక పాత్రధారులు. ''సెలబ్రేటింగ్ లైఫ్. నా కెరీర్‌లో ఈ సినిమా ప్రత్యేకమైనది'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు అభిషేక్ బచ్చన్. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. రైజింగ్ సన్ ఫిలింస్ సమర్పణలో రోనీ లాహిరి, షీల్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది క్రిస్మస్ పండగ సందర్భంగా డిసెంబరులో విడుదల కానుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.



• సీలియన్ మర్ఫీ

సెప్టెంబరులో స్టార్ట్

క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో వచ్చిన 'ఆపెన్ హైమర్' చిత్రంలో మంచి నటన కనబరచి 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఉత్తమ నటుడిగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్నారు నటుడు సీలియన్ మర్ఫీ. దీంతో సీలియన్ తర్వాతి చిత్రాలపై హాలీవుడ్‌లో ఫోకస్ పెరిగింది. కాగా సీలియన్ నటించనున్న కొత్త చిత్రం సెప్టెంబరులో స్టార్ట్ కానున్నట్లు హాలీవుడ్ సమాచారం. హాలీవుడ్ హిట్ సిరీస్ 'పీకీ బ్లైండర్స్' ఆధారంగా ఓ సినిమా తీయాలనుకుంటున్నారు ఈ సిరీస్ రూపకర్త స్టీవెన్ నైట్. 'పీకీ బ్లైండర్స్' ఆధారంగా ఈ సినిమాను సెప్టెంబరులో స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. 'పీకీ బ్లైండర్స్' సిరీస్‌లో థామస్ షెల్బీగా నటించిన సీలియన్ మర్ఫీ ఈ సినిమాలోనూ నటిస్తారన్నట్లుగా స్టీవెన్ ఇటీవల పాల్గొన్న ఓ కార్యక్రమంలో వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధం నేపథ్యంలో సాగే ఈ సినిమా 2025 చివర్లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అది నా అదృష్టం

- పృథ్వీరాజ్ సుకుమారన్

''సలార్' సినిమాలో వరద రాజ మన్నార్ అనే కింగ్ పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. ఇప్పుడు 'ది గోట్ లైఫ్' సినిమాతో నజీబ్ అనే బానిసగా రాబోతున్నాను. 'ది గోట్ లైఫ్' నిజంగా జరిగిన కథ.'' అని పృథ్వీరాజ్ సుకుమారన్ అన్నారు. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ది గోట్ లైఫ్' (మలయాళంలో 'ఆడు జీవితం'). బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా బ్లెస్సీ దర్శకత్వంలో విజువల్ రొమాన్స్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 28న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ప్రెస్ మీట్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం 30 కేజీలు తగ్గాను. నజీబ్ పాత్ర నాకే రావడం నా అదృష్టం'' అన్నారు. ''150 రోజులు చిత్రీకరణ చేశాం'' అన్నారు దర్శకుడు బ్లెస్సీ. ''ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అన్నారు నిర్మాత రవిశంకర్. ''ఇందులో ఇబ్రహీం ఖాద్రీగా నటించాను'' అన్నారు యాక్టర్ జిమ్మీ జీన్. మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి మాట్లాడారు.



• జిమ్మీ జీన్, బ్లెస్సీ, రవిశంకర్, పృథ్వీరాజ్

నా పేరు సుబ్రమణ్యం

రావు రమేశ్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతీనగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మారుతీ నగర్లో ఫేమస్ అంటే నేనేలే...అందరూ ఇదే మాట అంటారులే!' అంటూ మొదలై, 'నేనే సుబ్రమణ్యం... మై నేమ్ ఈజ్ సుబ్రమణ్యం' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. కల్యాణ్ నాయక్ సంగీత సారథ్యంలో భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల పాడారు.



• రావు రమేశ్

మా జీవితాలను మలుపు తిప్పింది

- మారుతి



శ్రీనివాస్, రేష్మా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈ రోజుల్లో..'. 2012లో విడుదలైన ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అయ్యారు మారుతి. ఎస్‌కేఎన్, శ్రేయాస్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు (శనివారం) రీ–రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ–''మా జీవితాలను మలుపు తిప్పిన సినిమా ఇది. మా జర్నీ సక్సెస్‌ఫుల్‌గా కంటిన్యూ అవుతోంది'' అన్నారు. ''ఈ 12 ఏళ్లలో మేం ఎంత ఎదిగామో మాకు గుర్తు చేసే తీపి గుర్తు ఈ చిత్రం'' అన్నారు ఎస్‌కేఎన్. ''అప్పట్లో కేవలం 50 లక్షల రూపాయలతో నిర్మించి సంచలన విజయం అందుకున్నాం'' అన్నారు శ్రేయాస్ శ్రీనివాస్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	191	72,832
నిఫ్టీ ▲	83	22,097

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,450	▲	50
డోజోన్స్	39,597	▽	184
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,931	▲	48
డాక్స్	18,215	▲	36
పాంఘై	3,048	▽	29
నికాయ్	40,888	▲	72

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	66,245	▽	669
బంగారం (99.5 స్వచ్ఛత)	65,980	▽	666
వెండి (కిలో)	73,787	▽	1,256

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.66
€	యూరో	ఎస్‌బీఐ	89.19	91.57
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.43	55.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.42
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.46	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.51

డాక్టర్ రెడ్డీస్‌కు సెంథాక్విన్ ఔషధ హక్కులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రాణాంతకమైన హైపోవోలెమిక్ షాక్ అనే అనారోగ్య సంబంధ చికిత్సలో ఉపయోగించే సెంథాక్విన్ ఔషధాన్ని భారత్‌లో మార్కెటింగ్, పంపిణీ చేసేందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ హక్కులు దక్కించుకుంది. ఇందుకోసం అమెరికాకు చెందిన బయోఫార్మా సంస్థ ఫార్మాజ్‌తో లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఈ ఔషధాన్ని లైఫాక్విన్ బ్రాండ్ పేరిట డాక్టర్ రెడ్డీస్ విక్రయించనుంది. ప్రతిగా ఫార్మాజ్‌కు రాయల్టీలు మొదలైనవి చెల్లించనుంది. నేపాల్‌లోనూ లైఫాక్విన్‌ను మార్కెటింగ్ చేసే హక్కులు పొందినట్లు సంస్థ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	72.00
22-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

హిందుస్తాన్ జింక్ విభజనకు కేంద్రం నో...

న్యూఢిల్లీ: ప్రమోటర్ గ్రూప్.. వేదాంతా ప్రతిపాదిత హిందుస్తాన్ జింక్ కంపెనీ విభజనకు గనుల శాఖ నో చెప్పింది. హిందుస్తాన్ జింక్‌ను రెండు విభిన్న సంస్థలుగా విడదీసేందుకు వేదాంతా గ్రూప్ చేసిన ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు మైన్స్ సెక్రటరీ వీఎల్ కాంతారావు తాజాగా వెల్లడించారు. వాటాదారుగా కంపెనీ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యంగా లేదని తెలియజేశారు. వెరసి విభజన ప్రతిపాదనను అంగీకరించలేదని స్పష్టం చేశారు. కంపెనీలో ప్రభుత్వం 29.54 శాతం వాటాతో అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)ను పెంచుకునే బాటలో జింక్, సిల్వర్‌సహా బిజినెస్‌లను రెండు ప్రత్యేక కంపెనీలుగా ఏర్పాటు చేసేందుకు హిందుస్తాన్ జింక్ ఇంతక్రితం ప్రతిపాదించింది. కాగా.. బిజినెస్‌ల విభజనకు సలహాదారు సంస్థను నియమించుకునే యోచనలో ఉన్నట్లు గతంలో హిందుస్తాన్ జింక్ ప్రకటించింది. కంపెనీ విలువను మెరుగుపరచేందుకు కార్పొరేట్ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు బోర్డు నిర్ణయించినట్లు కంపెనీ పేర్కొంది. జింక్, లెడ్, సిల్వర్, రీసైక్లింగ్ బిజినెస్‌లను రెండు చట్టబద్ధ కంపెనీలుగా ఏర్పాటు చేయనున్నట్లు ఇంతక్రితం నియంత్రణ సంస్థలకు తెలియజేసింది.

సీఎన్‌జీ బైక్‌పై బజాజ్ ఆటో కసరత్తు


జూన్‌లో మార్కెట్లోకి



పుణే: పర్యావరణ అనుకూల సీఎన్‌జీ ఇంధనంతో నడిచే మోటార్‌సైకిళ్ల తయారీపై ద్విచక్ర వాహనాల దిగ్గజం బజాజ్ ఆటో కసరత్తు చేస్తోంది. జూన్ కల్లా ఈ బైకు మార్కెట్లోకి రాగలదని కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్ తెలిపారు. మైలేజీని కోరుకునే కస్టమర్ల కోసం రూపొందిస్తున్న ఈ వాహనాన్ని వేరే బ్రాండ్ కింద ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. వచ్చే అయిదేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యతా కార్యక్రమాలపై (సీఎస్‌ఆర్) రూ. 5,000 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించిన సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. పెట్రోల్‌తో నడిచే మోటర్‌సైకిళ్లతో పోలిస్తే దీని ధర కొంత అధికంగా ఉండవచ్చని అంచనా. కస్టమర్ల సౌకర్యార్థం పెట్రోల్, సీఎన్‌జీ ఇంధనాల ఆప్షన్లు ఉండేలా ట్యాంకును ప్రత్యేకంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉండటం వల్ల తయారీ కోసం మరింత ఎక్కువగా వెచ్చించాల్సి రానుండటమే ఇందుకు కారణం. గ్రూప్‌నకు చెందిన అన్ని సీఎస్‌ఆర్, సేవా కార్యక్రమాలను 'బజాజ్ బియాండ్' పేరిట సంస్థ నిర్వహించనుంది. దీని కింద ప్రధానంగా నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడంపై దృష్టి పెట్టనుంది.

మూడో రోజూ లాభాలు

సూచీలకు ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, మారుతీ షేర్ల దన్ను



ముంబై: ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, మారుతీ సుజుకీ షేర్ల రికార్డుల ర్యాలీతో పాటు ఈ ఏడాదిలో మూడు సార్లు వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చనే ఫెడ్ రిజర్వ్ సంకేతాలతో స్టాక్ సూచీలు మూడోరోజూ లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 191 పాయింట్లు పెరిగి 72,832 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 83 పాయింట్లు బలపడి 22,097 వద్ద నిలిచింది. ఉదయం భారీ నష్టాలతో మొదలైన సూచీలు జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల సంకేతాల ప్రభావంతో వెంటనే లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 474 పాయింట్లు పెరిగి 73,115 వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు ఎగసి 22,181 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే యాక్సెంచర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) ఆదాయ వృద్ధి అంచనాల తగ్గింపుతో ఐటీ, టెక్ షేర్లలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడి సూచీల లాభాలను పరిమితం చేసింది. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ ఇండెక్సులు వరుసగా 1.06%, 0.38% చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. రంగాల వారీగా బీఎస్‌ఈలో టెలికమ్యూనికేషన్ 2.28%, ఆటో 1.67%, రియల్టీ 1.40% కన్జూమర్ డిస్క్రిషనరీ 1.20%, ఇండస్ట్రీస్, మెటల్స్ 1.17%, ప్రభుత్వరంగ బ్యాంకులు 1% చొప్పున లాభపడ్డాయి.

జీవితకాల కనిష్టానికి రూపాయి



రూపాయి విలువ శుక్రవారం జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలు, డాలర్ బలోపేత ధోరణి, దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోవడం రూపాయి కోతకు కారణమయ్యాయని ట్రేడర్లు తెలిపారు. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంతో పోలిస్తే 83.28 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో ఏకంగా 52 పైసలు క్షీణించి 83.65 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 48 పైసలు కోల్పోయి జీవితకాల కనిష్టం 83.61 వద్ద ముగిసింది. కాగా, ఇప్పటి వరకూ డాలర్ మారకంలో రూపాయి కనిష్ట ముగింపు (2023 డిసెంబర్13) 83.40 గా ఉంది.

ఐపీఓకు స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్, శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో ట్రేడింగ్...

కొద్ది రోజులుగా కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్ల ప్రభావంతో తాజాగా రెండు కంపెనీలు ఐపీవో బాట పట్టాయి. ఇందుకు అనుమతించమంటూ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. జాబితాలో మహారాష్ట్ర కంపెనీ స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్, మధ్యప్రదేశ్ కంపెనీ శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో ట్రేడింగ్ ఉన్నాయి.

విజయా డయాగ్నొస్టిక్స్ విస్తరణ ప్రణాళిక

ఏటా 10 సెంటర్స్ ఏర్పాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్యపరీక్షల సేవల సంస్థ విజయా డయాగ్నొస్టిక్స్ ఏటా 8-10 కేంద్రాలను ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో మొత్తం 140 పైచిలుకు డయాగ్నొస్టిక్ సెంటర్స్ ఉండగా తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నాయి. తమ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఫ్యూజిఫిల్మ్‌కి చెందిన అధునాతన ఓపెన్ ఎంఆర్‌ఐ మెషీన్‌ను ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సంస్థ సీవోవో శేషాద్రి వాసన్ ఈ విషయాలు తెలిపారు. క్లోజ్డ్‌గా ఉండే ఎంఆర్‌ఐతో పోలిస్తే ఓపెన్‌గా ఉండే అపెర్టో లూసెంట్ మెషీన్.. పేషంట్లలో ఆదుర్దాను తగ్గించగలిగేలా ఉంటుందని ఫ్యూజి ఫిల్మ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (హెల్త్‌కేర్ విభాగం) చందర్ శేఖర్ సిబాల్ తెలిపారు. వచ్చే రెండేళ్లలో భారత్‌లోనూ తయారీ, అభివృద్ధి కార్యకలాపాలు ప్రారంభించే యోచనలో కంపెనీ ఉన్నట్లు వివరించారు. ఫ్యూజిఫిల్మ్ ఇండియా ఎండీ కోజీ వాడా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





రెడీ మిక్స్ కాంక్రీట్‌లోకి శ్రీ సిమెంట్

న్యూఢిల్లీ: సిమెంటు తయారీ దిగ్గజం శ్రీ సిమెంట్ తాజాగా రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) విభాగంలోకి ప్రవేశించింది. తమ తొలి ప్లాంటును హైదరాబాద్‌లో ప్రారంభించింది. గంటకు 90 ఘనపు మీటర్ల సామర్థ్యంతో ఇది పని చేస్తుందని సంస్థ తెలిపింది. ఈ విభాగానికి సంబంధించి ఇప్పటికే స్టార్‌క్రీట్ సంస్థకు ముంబైలో ఉన్న అయిదు ప్లాంట్లను రూ. 33.5 కోట్లకు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. మొత్తం మీద తమ సంస్థ ఆర్ఎంసీ సామర్థ్యాలు గంటకు 512 ఘనపు మీటర్లుగా ఉంటుందని శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖోరి తెలిపారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మరింతగా దృష్టి పెడుతుండటం, హౌసింగ్ రంగం పుంజుకుంటూ ఉండటం మొదలైన అంశాలు ఆర్ఎంసీ వ్యాపారానికి సానుకూలంగా దోహదపడగలవని ఆయన పేర్కొన్నారు.

వొడాఫోన్ ప్రత్యేక ఐపీఎల్ ఆఫర్లు

ముంబై: వొడాఫోన్ ఐడియా (వీఐ) తాజాగా ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. వీటితో డిస్కౌంట్లు, అదనపు డేటా పొందవచ్చని సంస్థ తెలిపింది. వీఐ యాప్ ద్వారా మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. వీటి ప్రకారం రూ. 1,449 ప్యాక్‌పై రూ. 50 మేర, రూ. 3,199 ప్యాక్‌పై రూ. 100 డిస్కౌంటు లభిస్తుంది. రూ. 181 ప్యాక్‌పై 50%, రూ. 75 ప్యాక్‌పై 25 శాతం అదనపు డేటా పొందవచ్చు.

అదానీ టోటల్ ఎనర్జీస్‌తో మహీంద్రా జట్టు

ముంబై: దేశీయంగా ఎలక్ట్రిక్ చార్జింగ్ సదుపాయాలను మరింత పెంచే దిశగా అదానీ టోటల్ ఎనర్జీస్‌తో ఎంఅండ్ఎం అవగాహన కుదుర్చుకున్నాయి. దీనితో చార్జింగ్ స్టేషన్ల డిస్కవరీ, లభ్యత, నావిగేషన్, లావాదేవీల నిర్వహణకు అవసరమైన ఈ-మొబిలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంఅండ్ఎం ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ నక్రా తెలిపారు. ఎక్స్‌యూవీ400 కస్టమర్లకు బ్లూసెన్స్‌ప్లస్ యాప్‌లో 1,100 పైచిలుకు చార్జర్లు అందుబాటులో ఉంటాయి.



సత్యన్‌కు తొలి డబ్ల్యూటీటీ టైటిల్

భారత స్టార్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ 'డబ్ల్యూటీటీ' ఫీడర్ సిరీస్‌లో టైటిల్ సాధించిన తొలి భారత ఆటగాడిగా ఘనతకెక్కాడు. లెబనాన్‌లోని బీరుట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్యే టైటిల్ పోరు జరిగింది. ఈ టోర్నీలో 11వ సీడ్‌గా బరిలోకి దిగిన సత్యన్ 3-1 (6-11, 11-7, 11-7, 11-4)తో సహచరుడు, తొమ్మిదో సీడ్ మానవ్ ఠక్కర్‌పై విజయం సాధించాడు. దాదాపు మూడేళ్ల తర్వాత సత్యన్ అంతర్జాతీయ ర్యాంకింగ్ ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. 2021 ఆగస్టులో జరిగిన ఐటీటీఎఫ్ చెక్ ఇంటర్నేషనల్ ఓపెన్‌లో అతను టైటిల్ గెలిచాడు. మరోవైపు భారత జోడీల మధ్యే జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో దియా చిటాలే-మానుష్ షా ద్వయం విజేతగా నిలిచింది. టైటిల్ పోరులో దియా-మానుష్ 3-1 (11-6, 10-12, 11-6, 11-6)తో అర్చన కామత్-మానవ్ ఠక్కర్‌లపై గెలుపొందారు. పురుషుల డబుల్స్ తుది పోరులో మానవ్ ఠక్కర్-మానుష్ జంట రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

0-0

భారత్, అఫ్గానిస్తాన్ మ్యాచ్ 'డ్రా'

అబా (సౌదీ అరేబియా): 'ఫిఫా' ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో బలహీన ప్రత్యర్థిపై గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ పేలవ ఆటతీరు కనబర్చి 'డ్రా'గా ముగించింది. గ్రూప్ 'ఎ'లో భారత్, అఫ్గానిస్తాన్‌ల మధ్య గురువారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్... ఒక్క గోల్ అయినా నమోదు కాకుండా 'డ్రా' అయ్యింది. తొలి అర్ధ భాగంలో మన్‌వీర్ సింగ్ రెండు సార్లు గోల్స్ చేసేందుకు ప్రత్యర్థి గోల్‌పోస్ట్ వైపు దూసుకెళ్లాడు. కానీ గోల్ మాత్రం చేయలేకపోయాడు. రెండో అర్ధ భాగంలో విక్రమ్ ప్రతాప్ కూడా గోల్ కోసం విఫల యత్నాలు చేశాడు. మళ్లీ ఫినిషింగ్ లోపాలతో భారత్ ఖాతా తెరవలేకపోయింది. సులువైన ప్రత్యర్థి జట్టు డిఫెన్స్‌ను ఛేదించలేకపోవడంపై భారత కోచ్ ఇగర్ స్టిమాక్ అసహనం వ్యక్తం చేశారు. తాజా 'డ్రా'తో భారత్ ఈ గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో ఉంది. మూడు మ్యాచ్‌లాడిన భారత్ ఖాతాలో 4 పాయింట్లున్నాయి. 3 మ్యాచ్‌ల ద్వారా 9 పాయింట్లు సాధించిన ఖతర్ అగ్ర స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో ఖతర్ 3-0తో కువైట్‌పై గెలుపొందింది.



సెమీఫైనల్లో శ్రీకాంత్

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో అతను 21-10, 21-14తో చియా హే లీ (చైనీస్ తైపీ)ని వరుస గేముల్లో కంగుతినిపించాడు. రెండు ఒలింపిక్ పతకాల విజేత పూసర్ల వెంకట సింధు, లక్ష్యసేన్‌లకు ప్రి క్వార్టర్ ఫైనల్లోనే చుక్కెదురైంది. పురుషుల ప్రిక్వార్టర్ ఫైనల్లో అన్‌సీడెడ్ శ్రీకాంత్ 21-16, 21-15తో మలేసియన్ టాప్ సీడ్ ప్లేయర్ లీ జీ జియాను వరుస గేముల్లో కంగు తినిపించాడు. కానీ ఏడో సీడ్ లక్ష్యసేన్ 17-21, 15-21తో చియా హే లీ (చైనీస్ తైపీ) జోరుకు నిలువలేకపోయాడు. మహిళల ప్రిక్వార్టర్స్‌లో నాలుగో సీడ్ సింధు 21-16, 19-21, 16-21తో జూనియర్ ప్రపంచ చాంపియన్, 17 ఏళ్ల టొమొకా మియజకి (జపాన్) చేతిలో పరాజయం చవిచూడగా, మహిళల డబుల్స్‌లో 8వ సీడ్ గాయత్రి-ట్రిసా జాలీ జంట 14-21, 15-21తో సెటియానా-ఎంజెలా యూ (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో కంగుతింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జంట 11-21, 14-21తో రాబిన్ టాబెలింగ్-సెలెనా పెక్ (నెదర్లాండ్స్) జోడీ చేతిలో ఓడింది.

చెన్నై జోరు





ముస్తఫిజుర్ బౌలింగ్‌లో గ్రీన్ క్లీన్‌బౌల్డ్

తొలి పోరులో ఘన విజయం	6 వికెట్లతో బెంగళూరు ఓటమి	ముస్తఫిజుర్‌కు 4 వికెట్లు

డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సొంత మైదానంలో శుభారంభం చేసింది... ఐపీఎల్ కొత్త సీజన్ తొలి పోరులో సమష్టి ప్రదర్శనతో బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌పై పైచేయి సాధించింది...ముందుగా బౌలింగ్‌లో పదునైన బంతులతో చెలరేగిన ముస్తఫిజుర్ బెంగళూరును సాధారణ స్కోరుకే పరిమితం చేశాడు. ఆపై ఛేదనలో ఎలాంటి ఆటంకం లేకుండా చెన్నై సులువుగా పని పూర్తి చేసింది. కెప్టెన్‌గా రుతురాజ్ తొలి పోరులో తన పేరిట విజయాన్ని నమోదు చేసుకోగా...ఐపీఎల్‌లో తన మొదటి మ్యాచ్‌లోనే రచిన్ రవీంద్ర ఆకట్టుకోవడం హైలైట్.

చెన్నై: ఐపీఎల్-2024ను సూపర్ కింగ్స్ దర్జాగా గెలుపుతో మొదలు పెట్టింది. శుక్రవారం జరిగిన పోరులో చెన్నై 6 వికెట్ల తేడాతో బెంగళూరును ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అనూజ్ రావత్ (25 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), దినేశ్ కార్తీక్ (26 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 50 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. ముస్తఫిజుర్ రహమాన్ (4/29) ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. అనంతరం చెన్నై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 176 పరుగులు చేసింది. శివమ్ దూబే (28 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (15 బంతుల్లో 37; 3 ఫోర్లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

బెంగళూరు ఇన్నింగ్స్‌లో 11.4 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 78/5...ఈ స్థితినుంచి జట్టు చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగిందంటే రావత్, కార్తీక్ భాగస్వామ్యమే కారణం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత డుప్లెసిస్ ధాటిగా ఆడటంతో బెంగళూరు ఇన్నింగ్స్ మెరుగ్గానే మొదలైంది. విరాట్ కోహ్లి (20 బంతుల్లో 21; 1 సిక్స్) పెద్దగా ప్రభావం చూపకపోయినా తొలి వికెట్‌కు 27 బంతుల్లో 41 పరుగులు వచ్చాయి. అయితే ముస్తఫిజుర్ చెలరేగడంతో పరుగు వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. రచిన్ చక్కటి ఫీల్డింగ్‌కు డుప్లెసిస్ వెనుదిరగ్గా, రహానే ఫీల్డింగ్ నైపుణ్యంతో కోహ్లి పెవిలియన్ చేరాడు. మ్యాక్స్‌వెల్ (0) తొలి బంతికే అవుట్ కాగా, గ్రీన్ (18)ను ముస్తఫిజుర్ బౌల్డ్ చేశాడు. ఇలాంటి సమయంలో 28 బంతుల పాటు ఒక్క బౌండరీ కూడా ఆర్‌సీబీ ఖాతాలో చేరలేదు! అయితే కుదురుకున్న తర్వాత రావత్, కార్తీక్ దూకుడు పెంచి బౌండరీలతో పరుగులు రాబట్టారు. తుషార్ వేసిన 18వ ఓవర్లో రావత్ 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టగా, కార్తీక్ మరో సిక్స్ బాదడంతో మొత్తం 25 పరుగులు వచ్చాయి. ఆఖరి 5 ఓవర్లలో ఆర్‌సీబీ 71 పరుగులు సాధించింది.

సమష్టి ప్రదర్శన...

ఛేదనలో సీఎస్‌కే బ్యాటర్లు అంతా తలా ఓ చేయి వేశారు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లో రుతురాజ్ (15) విఫలమైనా...ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లోనే రచిన్ చక్కటి షాట్లతో అలరిస్తూ బౌండరీలతో వేగంగా పరుగులు సాధించాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 62 పరుగులకు చేరింది. ఆ తర్వాత రహానే (19 బంతుల్లో 27; 2 సిక్స్‌లు), డారిల్ మిచెల్ (18 బంతుల్లో 22; 2 సిక్స్‌లు) కీలక పరుగులతో జట్టును విజయం దిశగా నడిపించారు. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా...దూబే, రవీంద్ర జడేజా (17 బంతుల్లో 25 నాటౌట్; 1 సిక్స్) కలిసి 8 బంతుల ముందే మ్యాచ్‌ను ముగించారు.

స్కోరు వివరాలు:

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 21; డుప్లెసిస్ (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 35; పటిదార్ (సి) ధోని (బి) ముస్తఫిజుర్ 0; మ్యాక్స్‌వెల్ (సి) ధోని (బి) చహర్ 0; గ్రీన్ (బి) ముస్తఫిజుర్ 18; రావత్ (రనౌట్) 48; కార్తీక్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-42, 4-77, 5-78, 6-173. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-37-1, తుషార్ 4-0-47-0, తీక్షణ 4-0-36-0, ముస్తఫిజుర్ 4-0-29-4, జడేజా 4-0-21-0.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) గ్రీన్ (బి) దయాళ్ 15; రచిన్ (సి) పటిదార్ (బి) కరణ్ 37; రహానే (సి) మ్యాక్స్‌వెల్ (బి) గ్రీన్ 27; మిచెల్ (సి) పటిదార్ (బి) గ్రీన్ 22; దూబే (నాటౌట్) 34; జడేజా (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 176. వికెట్ల పతనం:** 1-38, 2-71, 3-99, 4-110. **బౌలింగ్:** సిరాజ్ 4-0-38-0, యశ్ దయాళ్ 3-0-28-1, జోసెఫ్ 3.4-0-38-0, కరణ్ శర్మ 2-0-24-1, డాగర్ 2-0-6-0, గ్రీన్ 3-0-27-2, మ్యాక్స్‌వెల్ 1-0-7-0.

అలరించిన ఆరంభ వేడుకలు



తొలి మ్యాచ్‌కు ముందు చిదంబరం స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ నేతృత్వంలో గాయకులు సోనూ నిగమ్, మోహిత్ చౌహాన్, నీతి మోహన్ తమ పాటలతో అలరించారు. అంతకు ముందు నటులు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రదర్శన కూడా ఆకట్టుకుంది. దీంతో పాటు లేజర్ షోతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగియి. పెద్ద సైజు ఐపీఎల్ ట్రోఫీ రెప్లికాను ఈ సందర్భంగా మైదానంలో ప్రదర్శించారు.



ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X ఢిల్లీ
వేదిక: ముల్లన్‌పూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

కోల్‌కతా X హైదరాబాద్
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

4వ తేదీ నుంచి డిపార్ట్‌మెంటల్ టెస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు డిపార్ట్‌మెంటల్ టెస్టులకు సంబంధించి శుక్రవారం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. వివరాలను https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

స్టార్టప్స్ ప్రోత్సాహమే లక్ష్యం



స్టార్టప్ కంపెనీల ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో స్టార్టప్ కంపెనీల ఏర్పాటును ప్రోత్సహించడమే ఆంగ్రూ అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ లక్ష్యమని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీ రమణ తెలిపారు. శుక్రవారం తిరుపతి ఆర్ఏఆర్ఎస్‌లో అగ్రి విజన్ 1.0 అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కళాశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే విధంగా నూతన ఆవిష్కరణలను చేయడమే లక్ష్యం కావాలన్నారు. పెద్ద ఎత్తున స్టార్టప్స్ ఏర్పాటు అయితే పది మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందనేది అగ్రి ఇంక్యుబేటర్ ధ్యేయమన్నారు. అగ్రి బిజినెస్ ఇన్‌స్టిట్యూట్ అధిపతి డాక్టర్ పి.వి. సత్యగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాల కోసం వేచి చూడకుండా వినూత్నమైన ఆవిష్కరణల వైపు దృష్టిసారించి స్టార్టప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకుని, ఆర్థిక సహకారాన్ని పొందిన మొదటి, రెండో బ్యాచ్‌కు చెందిన స్టార్టప్ కంపెనీల ప్రతినిధులకు ఈ సందర్భంగా అతిథులు సర్టిఫికెట్లను అందజేశారు.

రెంటచింతలలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతలలో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రత 40.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.4 డిగ్రీలుగా నమోదైంది. ఏటా వేసవిలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతాల్లో ఒకటి రెంటచింతల. ఇక్కడ రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు.

విభిన్న విభాగాలతో పెద్ద యూనివర్సిటీగా ఏయూ



ఏయూ వీసీ ప్రసాదరెడ్డితో అమెరికా నావికాదళ బృందం

ప్రశంసించిన అమెరికా నావికాదళ బృందం

ఏయూక్యాంపస్ (విశాఖ జిల్లా): ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికా నావికాదళానికి చెందిన బృందం శుక్రవారం సందర్శించింది. ఏయూ పరిపాలనా భవనం వద్ద వీరికి ఏయూ ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో వర్సిటీ పరిపాలనా భవనంలో బృందం సమావేశమైంది. యుఎస్ నేవీ కమాండింగ్ ఆఫీసర్, కెప్టెన్ మిచెల్ సి.బ్రాండ్‌తో కూడిన పలువురు నావికాదళ సిబ్బంది ఏయూలో రెండు గంటల సేపు గడిపారు. అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ..మల్టీ డిసిప్లినరీ వర్సిటీగా ఏయూ నిలుస్తుందని చెప్పారు. యోగా, క్రీడలు, సైకాలజీ, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ వంటి వైవిధ్యమైన విభాగాలు ఇక్కడ ఉన్నాయని వివరించారు. రక్షణ రంగాల ఉద్యోగులకు విద్య పరంగా సేవలు అందిస్తోన్న వర్సిటీగా ఏయూ పేరుగాంచిందన్నారు. భారత్‌లోని త్రివిధ దళాలకు ఉన్నత విద్యను చేరువ చేస్తున్నామని, భవిష్యత్‌లో విదేశీ సైనికులకు సైతం ఉన్నత విద్య అవకాశాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇతర దేశాల నుంచి అటువంటి ప్రతిపాదన వస్తే తాము స్వాగతిస్తామన్నారు. మిచెల్ సి.బ్రాండ్ మాట్లాడుతూ విభిన్నవిభాగాలతో పెద్ద విశ్వవిద్యాలయంగా ఏయూ తమకు దర్శనమిస్తోందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అమెరికన్ కాన్సులేట్ అధికారి జో క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ అమెరికన్ కార్నర్ వద్ద మొక్కలునాటి, వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో అమెరికా నేవీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అమెరికన్ కార్నర్‌లో నిర్వహించిన విద్యార్థులతో ఇష్టాగోష్ఠిలో వీరు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు టీడీపీ సర్పంచ్ స్వాహా

- సొంతంగా రూ.6.54 లక్షలు విత్‌డ్రా చేసుకున్న పుల్లేటికుర్రు సర్పంచ్
- ఉన్నతాధికారులకు కార్యదర్శి ఫిర్యాదు

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామ టీడీపీ సర్పంచ్ జల్లి బాలరాజు అక్రమంగా పంచాయతీ నిధులను స్వాహా చేశారు. ఈ విషయంపై పంచాయతి కార్యదర్శి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలు... పుల్లేటికుర్రు గ్రామ పంచాయతికి సంబంధించి పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్) 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,36,136లను ప్రభుత్వం 2023 జూలై 25న పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ ఖాతాలో జమచేసింది. అయితే, నిబంధనలకు అనుగుణంగా పీఎఫ్ఎంఎస్ విధివిధానాలు అమలు కాకుండానే సర్పంచ్ బాలరాజు నేరుగా నాలుగు విడతల్లో రూ.6.54 లక్షలు విత్‌డ్రా చేసినట్లు పంచాయతి కార్యదర్శి వి.వెంకటరమణ గుర్తించారు. 2023 జూలై 27న రూ.లక్ష, ఆగస్టు ఒకటిన రూ.1.56 లక్షలు, అదేరోజు మరో రూ.1.56 లక్షలు, ఆగస్టు 23న రూ.2.42 లక్షలు కలిపి నాలుగు విడతల్లో మొత్తం రూ.6.54 లక్షలను సర్పంచ్ విత్‌డ్రా చేశారని నిర్ధారించుకుని ఈవోపీఆర్డీ, డీఎల్‌పీవోలకు గత నెలలోనే పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. స్థానిక పంచాయతీ నుంచి రూ.6.54 లక్షల చెల్లింపుల విషయంలో చెక్ బుక్, పాస్‌బుక్‌లు తనవద్ద లేవని, సదరు చెల్లింపులను ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ విధివిధానాలకు వ్యతిరేకంగా నిర్వహించారని కార్యదర్శి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పంచాయతీలో ఉన్న రికార్డులను తనిఖీ నిమిత్తం డీఎల్‌పీవో తీసుకువెళ్లారని ఈవోపీఆర్‌డీ బి.మమత తెలిపారు. దీనిపై డీపీవో దుండి రాంబాబును వివరణ కోరగా, సర్పంచ్ బాలరాజు చెక్కుల ద్వారా రూ.6.54 లక్షలు విత్‌డ్రా చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. దీనిపై డీఎల్‌పీవో అందజేసే నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 23 । మార్చి । 2024



పులకించిన కూచిపూడి

నాట్యక్షేత్రం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదిక పై జరిగిన నాట్య ప్రదర్శనల్లో కళాకారుల అందెల రవళులతో కూచిపూడి కళా కుటుంబం పులకించింది. -IIలో▸



భద్రత కట్టుదిట్టం

ఎన్నికల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఇరు రాష్ట్రాల పోలీసులు సమ న్వయంతో తనిఖీలు చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. -IIలో▸

రంజాన్ ప్రార్థనలు



రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం విజయ వాడలోని లబ్బీపేటలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని మతపెద్దలు తెలిపారు.



	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
విజయవాడ	6.24	4.52
జగ్గయ్యపేట	6.26	4.58
మచిలీపట్నం	6.23	4.49
గుడివాడ	6.24	4.52

రంజాన్ వేళలు

సంచార జీవులకు శాశ్వత చిరునామా

- యానాదులకు పక్కా గృహ నిర్మాణాలు
- అదనంగా రూ.63 వేలు సాయం
- ఉమ్మడి కృష్ణాలో మొదటి దశలో 457 కుటుంబాలకు లబ్ధి
- నిర్మాణాలు పూర్తి కావస్తున్న యాభై శాతం గృహాలు

సంచార జీవులైన యానాదులకు శాశ్వత చిరునామా కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు పొందుతున్న వారి సొంతింటి కలను సాకారం చేయడానికి అదనంగా ఆర్థిక సాయం అందజేస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 457 కుటుంబాలు లబ్ధి పొందాయి.

జి.కొండూరు: సంపూర్ణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక వినూత్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. సగటు మానవుడికి అవసరమైన ఇల్లు, ఆహారం, విద్య, వైద్యం వంటి వాటిని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వందశాతం విజయం సాధించిందనే చెప్పవచ్చు. ఈ క్రమంలోనే జీవనోపాధి వెతుక్కుంటూ ఊరూరా తిరుగుతూ సంచార జీవనం సాగించే యానాదులకు శాశ్వత చిరునామా దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేసింది. తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవించే యానాదుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల నుంచి ఇప్పటికే లబ్ధి పొందుతున్న యానాదులకు, పక్కా గృహాలను నిర్మించడానికి అదనంగా ఆర్థిక సాయం అందిస్తున్నారు.

అదనంగా రూ.63 వేలు

యానాదులకు పక్కా గృహాలకు నిర్మించడానికి ఇళ్ల పట్టాలను సైతం ప్రభుత్వం అందజేసింది. ఈ క్రమంలో పక్కా గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.1.8 లక్షలను అందిస్తోంది. దీనికి తోడు యానాదులకు అదనంగా ఎస్టీ కార్పొరేషన్ నుంచి రూ.63 వేలు అందించడానికి ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు సర్వే చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇప్పటికే గుర్తించిన 457మంది లబ్ధిదారులకు మొదటి దశలో అదనపు సాయాన్ని అందజేశారు. దీన్ని పొందిన లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. వీటిలో 50 శాతానికి పైగా చివరి దశలో ఉండగా మిగిలినవి పలు చోట్ల వివిధ దశల్లో ఉన్నాయి.



యానాదులు పక్కా గృహాలు నిర్మించుకుంటున్న చెర్వుమాధవరం జగనన్న కాలనీ



నిర్మాణ దశలో యానాదుల గృహాలు

నాలుగు వేలకు పైగా కుటుంబాలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో యానాదులకు అదనపు సాయం అందించడానికి ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు చేపట్టిన సర్వేలో 4,551 యానాది కుటుంబాలను గుర్తించారు. 18,233 మంది జనాభా ఉన్నట్లు లెక్కలు తేల్చారు. వీరిలో అర్హతను బట్టి లబ్ధిదారులను గుర్తించి వివిధ దశల్లో అదనపు సాయం అందించనున్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎస్టీ కార్పొరేషన్ నుంచి పక్కా గృహాల నిర్మాణానికి అదనంగా సాయం పొందిన లబ్ధిదారుల వివరాలు

మండలం/పట్టణం	లబ్ధిదారులు
మచిలీపట్నం	159
చల్లపల్లి	28
కృత్తివెన్ను	58
తోట్లవల్లూరు	08
పమిడిముక్కల	38
పెనమలూరు	18
మోపిదేవి	09
మైలవరం	14
చందర్లపాడు	71
విజయవాడరూరల్	32
జి.కొండూరు	22

అదనంగా సాయం చేసి ఆదుకున్నారు



ఇల్లు కట్టుకోవడానికి అదనంగా 63వేలు ఇచ్చి ఈ ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. ప్రత్యేక శ్రద్ధపెట్టి యానాదులను గుర్తించి సాయం చేయడం గొప్ప విషయం. ప్రభుత్వ ప్రోత్సాహంతో జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

–కొమరగిరి రమణమ్మ, లబ్ధిదారు, చెర్వుమాధవరం

సాయం చేస్తారని ఊహించలేదు



ఇంటి నిర్మాణానికి అదనంగా ఆర్థికసాయం అందిస్తారని ఊహించలేదు. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. సొంతింటి కల నెరవేర బోతుంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మా గ్రామంలోనే నివాసం ఉంటాం.

–తుపాకుల వెంకటలక్ష్మి, లబ్ధిదారు, చెర్వుమాధవరం

మా కష్టాలను ప్రభుత్వం గుర్తించింది



యానాదులు పడే కష్టాలను ఈ ప్రభుత్వం గుర్తించింది. పథకాలు అందించడంతో పాటు సొంతింటి కలను సాకారం చేశారు. ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న మాకు అదనంగా రూ.63వేలు అందించడం హర్షణీయం.

– జయమ్మ, లబ్ధిదారు, చెర్వుమాధవరం

సిఫారసు దర్శనాలకు బ్రేక్...!

స్కానింగ్ పాయింట్‌లో ఈవో తనిఖీలు



ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సిఫారసులు, వీఐపీల పేరిట జరిగే దర్శనాలకు దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు బ్రేక్ వేశారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం ఈవో కేఎస్ రామారావు పలు విభాగాలను తనిఖీ చేశారు. స్కానింగ్ పాయింట్ వద్ద టికెట్ల విక్రయ కౌంటర్ పరిశీలించారు. వీఐపీల పేరిట వచ్చే వారు తప్పని సరిగా టికెట్లు కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు స్కానింగ్ పాయింట్‌ను తనిఖీ చేసిన ఈవో దర్శనాల రికార్డులను పరిశీలించారు. సమాచార కేంద్రం నుంచి సిబ్బంది, అధికారులు, ప్రముఖుల పేరిట తీసువచ్చే వారి వివరాలను, తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. దేవస్థాన సిబ్బంది, అధికారుల బంధువులు, పోలీసు, రెవెన్యూ, మీడియా పేరిట ఎంత మంది వస్తున్నారనే వివరాలను సిబ్బందిని ఈఓ రామారావు అడిగి తెలుసుకున్నారు. దేవస్థానానికి ఆదాయం పెరగాలంటే తప్పని సరిగా ప్రతి ఒక్కరూ దర్శన టికెట్లు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని టికెట్ల చెక్ పాయింట్ వద్ద భక్తులకు వద్ద ఉన్న దర్శన టికెట్లను పరిశీలించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ. 10 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు శుక్రవారం రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన ఎస్‌పీ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఎస్. పుల్లారెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ఈవో కేఎస్ రామారావును కలిసిన దాతలు నిత్యాన్నదానానికి రూ. 10,03,000 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత దాతలకు ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పది పరీక్షకు 1,450 మంది గైర్హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో నాలుగో రోజు పరీక్షకు శుక్రవారం 1450 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 178 పరీక్ష కేంద్రాల్లో 31695 మంది విద్యార్థులు పరీక్షను రాయాల్సి ఉంది. అయితే 30,245 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు ఏపీ విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ నగరంలో పర్యటించారు. డీఈవీ సుబ్బారావు నగరంలోని రెండు పరీక్ష కేంద్రాలను, పరిశీలించారు. జిల్లాలో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు 39 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసింది. జిల్లాలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షకు 1678 మంది విద్యార్థులకుగాను 1518 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇంటర్మీడియెట్‌కు సంబంధించి 103 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తజన సందడి ఎక్కువగా కనిపించింది. అమ్మవారి ప్రధాన ఆలయంలో జరిగిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం రెండో అంతస్తులో శుక్రవారం పెద్ద ఎత్తున వివాహాలు జరిగాయి. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో రామారావు క్యూలైన్లను పరిశీలించారు.

బ్యాంక్ ఖాతాదారుడి నిజాయతీ



మచిలీపట్నంటౌన్: నగరంలో ఎల్ఐసీ ఆవరణలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ఖాతాదారుడు ఎండీ నియాస్ నిజాయతీతో వ్యవహరించారు. బ్యాంక్ ఖాతాదారుడు మల్లికార్జునరావు శుక్రవారం బ్యాంకులో రూ. 1.50 లక్షలు డ్రా చేసుకుని వెళ్లారు. అతను బ్యాంకు బయట బైక్ పార్కింగ్ వద్ద రూ. 50 వేలు జారవిడుచుకున్నాడు. దీన్ని గమనించిన మరో ఖాతాదారుడు ఎండీ నియాస్ ఆ డబ్బును బ్రాంచ్ మేనేజర్ టి.నవక్రాంత్‌కు అందజేశారు. నగదు పోగొట్టుకున్న మల్లికార్జునరావును పిలిపించి బ్యాంకు రీజనల్ హెడ్ కె.వెంకట్రావు సమక్షంలో ఈ మొత్తాన్ని ఆయనకు అందజేసినట్లు మేనేజర్ నవక్రాంత్ తెలిపారు. రూ. 50 వేలు.. నిజాయతీగా అప్పగించిన ఎండీ నియాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు.

టీడీపీలో టికెట్ల చిచ్చు

- ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో మైలవరం, పెనమలూరు టీడీపీ టికెట్లు ఖరారు
- విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కేశినేని చిన్ని
- ముగిసిన దేవినేని ఉమా రాజకీయ శకం
- బోడెకు టికెట్ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి
- పశ్చిమలో పట్టువీడని పోతిన మహేష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ టికెట్ల చిచ్చు రగులుతూనే ఉంది. టీడీపీ శుక్రవారం.. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మూడో జాబితాను ప్రకటించింది. టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమాకు షాక్ తగిలింది. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా కేశినేని శివనాథ్(చిన్ని)ని ప్రకటించడంతో పార్టీలో సీనియర్లు రగిలిపోతున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి కాకుండా డబ్బు సంచులతో వచ్చిన వారికే టికెట్లు ఖరారు చేశారని అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి.

దేవినేని ఉమాకు షాక్..

టీడీపీ మూడో జాబితా అభ్యర్థుల ప్రకటనతో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని మైలవరం, పెనమలూరు టికెట్లపై సందిగ్ధత తొలగింది. మైలవరం టీడీపీ అభ్యర్థిగా వసంతకృష్ణ ప్రసాద్, పెనమలూరు అభ్యర్థిగా బోడె ప్రసాద్‌ను ఖరారు చేసింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 12 నియోజక వర్గాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించడంతో దేవినేని ఉమా ఆశలు ఆవిరయ్యాయి. మైలవరం నియోజక టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఆయన్ను కాదని, ఇటీవల పార్టీలో చేరిన వసంత కృష్ణప్రసాద్‌కు టికెట్ కేటాయించడంతో దేవినేని ఉమా వర్గం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతోంది. కృష్ణప్రసాద్, దేవినేని ఉమా మధ్య దశాబ్దాలుగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయ వైరం ఉంది. ఈ నేపథ్యంలో దేవినేని ఉమాకు చంద్రబాబు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా, క్షేత్రస్థాయిలో క్యాడర్ కలిసి పని చేసే అవకాశం లేదని టీడీపీ వర్గాలే పేర్కొంటున్నాయి.

డబ్బు సంచులకే ప్రాధాన్యం



సీటు రానందుకు నిరసనగా జక్కంపూడిలో బలప్రదర్శన చేస్తున్న దేవినేని ఉమా

మైలవరంలో టికెట్ ఇవ్వలేక పోతున్నాం..

పెనమలూరు టికెట్ ఇస్తామని దేవినేని ఉమాను మభ్యపెట్టారు. సర్వేల సాకు చూపి చివరకు అక్కడ మొండి చేయి చూపారు. దీంతో ఆయన రగిలిపోతున్నారు. తనకు జరిగిన అవమానం బయటికి చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. పార్టీలో సీనియర్ల అడ్డు తొలగించుకోవటం, లోకేష్ నాయకత్వానికి ఇబ్బంది లేకుండా చేయడంలో భాగంగానే ఉమాకు చెక్ పెట్టినట్లు చర్చ సాగుతోంది. ఆయనకు కనీసం ఎమ్మెల్సీ హామీ కూడా ఇవ్వక పోడంతో, ఆయన రాజకీయ శకం ముగిసిందనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. వసంతకు గట్టి బుద్ధి చెబుతామని దేవినేని వర్గీయులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఉమా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

పెనమలూరులో అసంతృప్తి..

పెనమలూరు టికెట్‌పై చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. సర్వేల పేరుతో పలుపేర్లు తెరపైకి వచ్చాయి. పెనమలూరు టికెట్ లేదని బోడె ప్రసాద్‌కు తొలుత చంద్రబాబు చెప్పారు. అయితే తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని బాబును బోడె బ్లాక్ మెయిల్ చేశారని తెలుస్తోంది. బోడె కొంతమంది ఎన్ఆర్ఐల ద్వారా కథ నడిపారు. చినబాబుకు ముడుపులు ముట్టడంతోపాటు, నియోజకవర్గంలో అయ్యే ఖర్చును తామే భరిస్తామని చెప్పడంతో చివరకు ఆయనకే టికెట్ కేటాయించారనే చర్చ సాగుతోంది. చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత గ్రామాల్లో బోడెకు పోటాపోటీగా ఇప్పటి వరకు ప్రచారం చేశారు. ఆ వర్గం బోడెకు సహకరించే అవకాశం లేదు. ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ వర్గం కలిసి పని చేసే పరిస్థితి లేదు. ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వర్గం నుంచి బోడె ప్రసాద్ ప్రతికూలత ఎదుర్కొంటున్నారు. మొత్తం మీద పెనమలూరు నియోజకవర్గంలో టీడీపీ గ్రూపుల గోల బోడెను పుట్టి ముంచుతుందని పార్టీ నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇండిపెండెంట్‌గా మహేష్!

పొత్తుల్లో భాగంగా విజయవాడ వెస్ట్ సీట్ జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి టికెట్ తనకే ఖరారైందని పోతిన మహేష్ ఇంటింటికీ ప్రచారం చేశారు. అయితే పొత్తులో భాగంగా వెస్ట్ సీటును బీజేపీకి కేటాయిస్తున్నట్లు పవన్ తేల్చి చెప్పారు. పవన్ తీరుపై పోతిన మహేష్, జనసేన కార్యకర్తలు మండిపడ్డారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని హెచ్చరికలు పంపారు. విజయవాడ పశ్చిమంలో బీజేపీకి సంబంధించి రోజుకొక పేరు తెరపైకి వస్తోంది. పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించినా.. అక్కడ పార్టీ కోసం కష్ట పడిన నేతలను కాదని ఎన్ఆర్ఐల వైపు చూడటాన్ని జనసేన కార్యకర్తలు, నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు.

సీ-విజిల్ ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీ-విజిల్, 1950 హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ), కలెక్టరేట్ కంట్రోల్ రూం నంబర్ (0866-2570051) తదితరాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం, నివేదికల సమర్పణ, పోలింగ్ అధికారులు, సిబ్బంది శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాట్లపై చర్చించి.. ప్రతి విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బందికి ఇచ్చే నాణ్యమైన శిక్షణ కీలకమని.. ఇప్పటికే వివిధ దశల్లో శిక్షణ ఇచ్చామని చెప్పారు. ప్రణాళిక ప్రకారం ఇకపై వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి శిక్షణ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీఓలు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్ర, కె.మాధవి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, నోడల్ అధికారులు కె.శ్రీనివాసరావు, ఎం.రజనీ కుమారి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన ఉండాలి

డీసీపీఓ రాజేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: బాలలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎన్టీఆర్ జిల్లా బాలల పరిరక్షణ అధికారి(డీసీపీవో) రాజేశ్వరరావు పేర్కొన్నారు. అంగన్‌వాడీ పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాలల చట్టాలపై అవగాహన సదస్సు, సామర్థ్యం పెంపుదల కార్యక్రమం చిల్లకల్లు ఏసీడీపీవో నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డీసీపీవో రాజేశ్వరరావు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలబాలికలతో ఇంటి వద్ద కానీ మరెక్కడైనా ఇబ్బందికరంగా ఎవరైనా ప్రవర్తిస్తే వెంటనే 1098(చైల్డ్‌లైన్)కు ఫోన్ చేసి తెలియజేస్తే వారిని కాపాడతారని తెలిపారు. బాలలకు జీవించే హక్కు, రక్షణ, అభివృద్ధి, భాగస్వామ్య హక్కుల ద్వారా, చట్టాలను అమలు చేయించే సంస్థల ద్వారా మిమ్మల్ని మీరే కాపాడుకోవచ్చని చెప్పారు. జిల్లా లీగల్ కామ్ ప్రొహిబిషన్(పోక్సో) ఆఫీసర్ కట్టా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణ చట్టం, శిక్షల గురించి వివరించారు. ప్రతి సన్నివేశంలోనూ మంచి, చెడు ఉంటాయని, మంచి అనేది భవిష్యత్‌లో ఎదుగుదలకు ఉపయోగపడుతుందని తెలిపారు



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ సమస్య నుంచి ముందుగా ఎలా తప్పించుకోవాలి, అన్యాయం జరిగితే ప్రభుత్వ సేవల ద్వారా న్యాయం జరిగేలా చేయడానికి, ధైర్యవంతులుగా జీవించే విధానాన్ని వివరించారు. ఐసీడీఎస్ చిల్లకల్లు ఏసీడీపీవో నాగమణి మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం-శిక్షలను విద్యార్థులకు వివరించారు. గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత, సోషల్ వర్కర్ లత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉష, రజనీజ్వాల, బీబీజాన్, శారద, సువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్ వర్మ

ఇబ్రహీంపట్నం: క్రీడలు జీవితంలో భాగం కావాలని ఏపీ ప్రత్యేక రక్షణదళం డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్ వర్మ అన్నారు. క్రీడలతో ఒత్తిడి దూరమవుతుందని, మానసిక శారీరక దృఢత్వం అలవడుతుందని చెప్పారు. ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో విజయవాడ జోనల్ లెవల్ ఎస్పీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీలో ఆయన బ్యాటింగ్, ఫీల్డింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. హైకోర్టు జట్టు విజేతగా నిలవగా ఎన్టీటీపీఎస్ టీం రన్నర్‌గా నిలిచింది. కెప్టెన్లకు ట్రోఫీలు అందజేశారు.



పోటీలు తిలకిస్తున్న త్రివిక్రమ్ వర్మ, చీఫ్ ఇంజినీర్ నాగరాజు

ఈ కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజు, ఎస్పీఎఫ్ జోనల్ కమాండెంట్ శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు సికింద్రాబాద్-సత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): హోలీ పండుగ వేళ రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా సికింద్రాబాద్-సత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-సత్రాగచ్చి ప్రత్యేక రైలు (07645) శనివారం రాత్రి 9.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు అర్ధరాత్రి 12.15 గంటలకు సత్రాగచ్చి చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07646) 25 ఉదయం 5.45 గంటలకు సత్రాగచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని తెలిపారు.

అభయాంజనేయుడి ఆదాయం రూ.12.58 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం రూ.12.58 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ సమీపంలోని యనమదల రామస్వామి ధర్మసత్రం ప్రాంగణంలో దేవదాయ అధికారుల సమక్షంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. గత 71 రోజులకు రూ.12,58, 970 వచ్చినట్లు ఈవో శ్రీనివాస్ చెప్పారు.

క్లుప్తంగా

తెలంగాణ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న తెలంగాణ మద్యం చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

తిరువూరు: తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గంపలగూడెం మండలం నెమలి వద్ద బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సబ్ ఇన్‌స్పెక్టర్ అరిఫ్ జరిపిన తనిఖీల్లో 312 మద్యం సీసాలను ఒక మినీ వ్యాన్ లో తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ నుంచి మద్యం తెచ్చి విక్రయిస్తున్న చందర్లపాడుకు చెందిన కనగాల రాజేష్, షేక్ ఇస్మాయిల్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ అశోక్ తిరువూరులో విలేకరులకు తెలిపారు. నిందితులను గంపలగూడెం తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.70 వేలకు పైగా ఉంటుందని చెప్పారు.

హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పద్మశ్రీకి స్థానం



కంకిపాడు: వేర్వేరు మహిళా గాయనీ మణులు ఆలపించిన గీతాలను గానం చేసిన రుగ్వేదం పద్మశ్రీ హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మొదటి యువ గాయనిగా స్థానం పొందింది. ఆ సంస్థ నుంచి సర్టిఫికెట్, మెమొంటోలను శుక్రవారం ఆమె అందుకున్నారు. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన రుగ్వేదం పద్మశ్రీ ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో చిత్రగీతాలు ఆలపించారు. కేవలం 4 గంటల 40 నిమిషాల్లో పలువురు గాయనీమణులు ఆలపించిన 116 తెలుగు పాటలను ఆలపించారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ సినీగీతాలు ఆలపించిన మొదటి యువ గాయనిగా గుర్తింపు సాధించింది. దీంతో హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. ఈ సందర్భంగా పద్మశ్రీ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు పాటలు 116 పాడటం జరిగిందన్నారు. హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కటం సంతోషంగా ఉందన్నారు. సినీ సంగీతం, శాస్త్రీయ సంగీతంలో ప్రావీణ్యం పొంది, సినీరంగంలో రాణించాలన్నది తన ఆకాంక్ష అని చెప్పారు.

సమర్థవంతంగా ఎన్నికల నియమావళి అమలు


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని సమర్థవంతంగా అమలుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి హాజరయ్యారు. ఫారాల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, వివిధ రకాల అనుమతుల జారీ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సీఈవో సమీక్షించారు. కలెక్టర్ ఢిల్లీరావు జిల్లాలో ఎంసీసీ అమలు సరళితో పాటు వివిధ అంశాలను వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎంసీసీని పటిష్టంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 42 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్‌లతో కూడిన 30 ఎంసీసీ బృందాలు పనిచేస్తున్నట్లు చెప్పారు. సీ విజిల్ ద్వారా మార్చి 21 వరకు 109 ఫిర్యాదులు అందాయన్నారు. సీ విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులతో పాటు ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌జీఎస్‌పీ, కలెక్టరేట్ కంట్రోల్ రూం తదితరాల ద్వారా అందుతున్న ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీఓలు బీహెచ్ భవానీ శంకర్, కె.మాధవి, కేఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఆరు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు
- 25న స్వామి తిరుకల్యాణ మహోత్సవం

నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో విశిష్టమైన నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి ఆరురోజులపాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యుల పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఉత్సవాల వివరాలను ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ప్రారంభిస్తారు. 24న వేణుగోపాలుడు శేషవాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. రాత్రికి గాంధీబొమ్మ సెంటర్‌లో వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ అమ్మవార్ల ఎదురుకోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. 25న స్వామి కల్యాణ మహోత్సవం, 26న సాయంత్రం రథోత్సవం అట్టహాసంగా చేయనున్నారు. 27న రాత్రి పల్లకీ, తెప్పోత్సవం, 28న ముగింపు ఉత్సవం. బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణంరోజు భక్తులు సౌకర్యార్థం తిరువూరు, తెలంగాణ రాష్ట్రం మధిర, ఖమ్మం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు.

లారీ బోల్తా.. క్లీనర్ దుర్మరణం

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): లారీ అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని లంబసింగి ఘాట్ తురుబాడగెడ్డ సమీపంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఒడిశాలోని చిత్రకొండలో సిమెంట్ లోడ్ దించి తిరుగు ప్రయాణంలో వస్తుండగా లారీకి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన లారీ క్లీనర్ రత్నరాజు (32) ఘటన స్థలంలోనే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన డ్రైవర్ కె.కొండలు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానికులు వెంటనే డౌనూరు పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. లోయలో పడిపోయిన మృతదేహాన్ని బయటకు తీసేందుకు చర్యలు చేపట్టామని ఆయన వివరించారు.

లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

భవానీపురం: రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడు లారీ డ్రైవర్‌కు ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. పటమట పోలీస్ స్టేషన్‌లో నమోదయిన కేసులో బాపట్ల జిల్లా రావినూతలపాడుకు చెందిన పునతి రాంబాబుపై నేరం రుజువైనందున శుక్రవారం 8వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ విజయ్‌కుమార్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. మచిలీపట్నంకు చెందిన గట్టా శేషగిరి 2022 జూలై 26వ తేదీ న ఎనికేపాడు రామాలయం వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో శేషగిరి కుడికాలుకి, ఎడమ కాలు పాదానికి గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధిక్ అహ్మద్, అప్పటి ఎస్ఐ పవన్‌కుమార్ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో విచారించారు.

బీసీ మహిళా చైర్‌పర్సన్‌ను తొలగించేందుకు కుట్ర

- ఎస్సీ, బీసీలు ఉన్నత స్థానంలో ఉండకూడదా?
- ఎమ్మెల్యేగా గెలవరని తెలిసే.. కౌన్సిలర్లకు ఎర
- రూ. 15–20 లక్షలు ఆశ చూపుతున్న టీడీపీ
- రానున్న ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదే


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ఎస్సీ, బీసీ మహిళలు తమకన్నా ఉన్నత పదవుల్లో ఉండటం టీడీపీ నాయకులకు నచ్చదని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న మహిళను తొలగించాలనే దుర్బుద్ధితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ చైర్మన్ మండవ వరలక్ష్మి మృతి చెందిన సమయంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాడుగుల నాగరత్నంను ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా నియమిస్తే కులం పేరుతో దూషించారని చెప్పారు. ఇప్పుడు బీసీ మహిళను తొలగించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆర్థికంగా బలహీనంగా ఉన్న కౌన్సిలర్‌లను గుర్తించి ఒక్కొక్కరికి రూ. 15 లక్షలు, రూ.20 లక్షలు ఎర చూపి ముగ్గురు కౌన్సిలర్‌లను టీడీపీలోకి తీసుకున్నారని మండిపడ్డారు.

ఎమ్మెల్యేగా గెలవలేరని.. మున్సిపాలిటీపై కన్ను

అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేరని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేతలు అడ్డదారిలో మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు యత్నిస్తున్నారని అరుణకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందిగామ మున్సిపాలిటీని కైవసం చేసుకుంటామనే కలలు కంటున్నారని మున్సిపాలిటీ ఎప్పటికే వైఎస్సార్ సీపీదేననే విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. పార్టీ మారిన వారిని వార్డులో సమావేశం పెట్టి పార్టీ ఎందుకు మారాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అందక పార్టీ మారారా లేక అభివృద్ధి జరగక పార్టీ మారారా లేకుంటే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వల్ల నష్టం జరిగి పార్టీ మారాల్సి వచ్చిందా అనేది ఓట్లేసి గెలిపించిన ప్రజలకు చెప్పాలని సూచించారు.

మెండుగా ప్రజాబలం....

అధికారంలోకి వస్తున్నామని ఊకదంపుడు ప్రచారాలు చేయటం తప్ప అధికారంలోకి వస్తే ప్రజలకు ఇది చేస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కన్నా మిన్నగా సంక్షేమ పథకాలు అందిస్తాం .. జగన్‌మోహన్‌రెడ్డి కన్నా మిన్నగా అభివృద్ధి చేస్తామని చెప్పలేని వారు కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం మెండుగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, శాసనసభ్యునిగా డాక్టర్ జగన్‌మోహనరావు విజయం సాధించడం ఖాయమని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, ములకలపల్లి కృష్ణమోహన్, ఓర్సు జ్వాలా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భర్త గొంతు కోసిన భార్య

మక్కపేట(వత్సవాయి) : భర్త గొంతును భార్య బ్లేడ్‌తో కోసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దారావతు ఏడుకొండలు, పార్వతి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కుమార్తె వివాహం కాగా కుమారుడు తొమ్మిదో తరగతి చదువుకుంటున్నాడు. గత కొంతకాలం నుంచి దంపతుల మధ్య కలహాలు జరుగుతున్నాయి. కేసులు నమోదై కోర్టుల్లో వాయిదాలకు కూడా తిరుగుతున్నారు. అయినప్పటికీ ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కోర్టులో వాయిదా ఉంది వీరికి. దీనిపై ఇద్దరి మధ్య మాటమాటా పెరిగింది. భార్య పార్వతి తన దగ్గర ఉన్న బ్లేడ్‌తో భర్త గొంతు కోసింది. దీంతో పక్కనే ఉన్న వారు వెంటనే 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి.అభిమన్యు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఇబ్రహీంపట్నం :ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం పోలీసులకు లభ్యమైంది. కెనాల్ రెండో గేటు వద్ద మృత దేహాన్ని గమనించిన ఎన్టీటీపీఎస్ బొగ్గు విభాగం ఏఈ రాంబాబు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అనూష అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్పించారు. వయస్సు సుమారు 50 ఏళ్లు, ఎత్తు 5.7 అడుగులు కలిగి ఉన్నాడు. ఆకుపచ్చ, నలుపు, పసుపు, తెలుపు రంగులు గల ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించాడు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27084, 93906 81266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ ఎం.సత్యనారాయణ కోరారు.

రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ

జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ టి.సతీష్

చిలకలపూడి(మచిలీపట్నం): ధాన్యం విక్రయించిన రైతులకు రెండు రోజుల్లో నగదు జమకానున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ తోట వెంకటసతీష్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 55,562 మంది రైతుల వద్ద నుంచి 4,83,188.06 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. వీటి విలువ రూ. 1038.52 కోట్లు కాగా ఇప్పటి వరకు 38,592 మంది రైతులకు గానూ రూ. 713.50 కోట్లు చెల్లించామని వెల్లడించారు. ఇంకా 16,970 మంది రైతులకు రూ. 325 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మొత్తం రాబోయే రెండు పనిదినాల్లో సంబంధిత రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో భద్రత కట్టుదిట్టం

- ఏపీ, తెలంగాణ అధికారులు సమన్వయంతో పని చేద్దాం
- గరికపాడు చెక్‌పోస్టును సందర్శించిన సూర్యాపేట ఎస్పీ


రాంపురం సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ట్రావెల్స్ బస్సులో బ్యాగులు పరిశీలిస్తున్న ఎస్పీ, డీసీపీ

గరికపాడు(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో తనిఖీలు ముమ్మరం చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. మండలంలోని ఏపీ, తెలంగాణ గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టును శుక్రవారం విజయవాడ డీసీపీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రాష్ట్రాల వద్దనున్న గరికపాడు, రాంపురం క్రాస్‌రోడ్డు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పని చేసి ఎన్నికలు ముగిసే వరకు మద్యం, నగదు, బంగారం, వెండి, తదితర అక్రమ రవాణా నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా ఉంచాలని సూచించారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టును పరిశీలించామని చెప్పారు. విజయవాడ డీసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ. 48 లక్షల నగదు, 300 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐ జానకిరామ్, ఎస్ఐ సతీష్, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెండ్యాల పీహెచ్‌సీకి వైద్య పరికరాల వితరణ


వైద్య పరికరాలు అందజేస్తున్న స్వర్ణ టోల్‌వేస్ ప్రతినిధులు కిరణ్‌బాబు తదితరులు

పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కీసర స్వర్ణ టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా ఆరోగ్య పరికరాలను శుక్రవారం అందజేశారు. ఈ మేరకు టోల్ వేస్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌బాబు మాట్లాడుతూ టోల్‌వేస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేసిందని ప్రజలంతా ఆనందిస్తున్నారన్నారు. తమ వంతు కూడా విద్య వైద్య రంగానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వైద్యశాలకు వచ్చే ప్రజలు కాని, రోగులు కాని, వైద్య సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రూ. 2లక్షల విలువగల వైద్య పరికరాలు అందజేశామన్నారు. వాటిలో ఫింగర్ పల్స్ ఆక్సీమీటర్, డిజిటల్ బేబి వేయింగ్ మిషన్, శాస్వల్ రిమోవల్ సిజర్స్, బెడ్ సైడ్ స్టూల్, స్టీల్ 3 సీటర్ చైర్స్, ఆఫీస్ ఎస్ టైప్ చైర్, పాటల్ డిప్పాయిర్ తదితర పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ రమణసాయి, సీఓఎం రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, వైద్యులు జెస్సీ లివింగ్ ఫెయిత్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందెల రవళితో పులకించిన కూచిపూడి


నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

కూచిపూడి(మొవ్వ): నాట్యక్షేత్రం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదికపై జరిగిన నాట్య ప్రదర్శనల్లో కళాకారుల అందెల రవళులతో కూచిపూడి కళా కుటుంబం పులకించింది. నాట్యాచార్యుల ఇలవేలుపు శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి వార్ల 261 వార్షిక కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని సాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం నాటికి మూడో రోజుకి చేరుకున్నాయి. బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో సాగిన మోహిని భస్మాసుర నృత్య రూపకంలో శరణ్య భస్మాసుర పాత్రలో నాగ సుస్మిత మోహినిగా, వి.లలిత విష్ణుమూర్తిగా లక్ష్మీదేవిగా ఈశ్వరీ, గ్రావ్య గ్రీష్మ శివునిగా, పార్వతిగా తేజస్సు, నారధునిగా పి.చరిత శ్రీ అంజని నర్తించి నృత్య రూపకానికి జీవం పోశారు. నర్సపురానికి చెందిన దామెర్ల కనక విజయలక్ష్మి భరతముని నాట్య శాస్త్రంలోని దశ రూపకాల్లో ఒకటైన బాణ రూపక ఛాయలతో ప్రయోగాత్మకంగా చేసిన నవరస దైవ విలాసం అనే కూచిపూడి నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది. కళ్లకు కట్టినట్లు నృత్యం ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. అలాగే గుడివాడకు చెందిన నాట్యాచారిణి బత్తిన సరిత నెహ్రూ శిష్య బృందం, వేదాంతం కూచిపూడి కళాపరిషత్ నాట్యాచారిణి దేవీ భవాని ఆగిరిపల్లి శిష్య బృందం, విజయవాడకు చెందిన వేదాంతం పార్థసారథి శిష్య బృందం, హైదరాబాదుకు చెందిన సుష్మా ఉదయ్ మహంతి శిష్య బృందం పలు అంశాలకు నాట్య ప్రదర్శన చేశారు. హైదరాబాదుకు చెందిన వీణా అయ్యర్ విఘ్నేశ్వరుని ప్రవేశ దరువుకి.. చక్కని హావభావాలతో నర్తించారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

డీసీపీ రూరల్ శ్రీనివాస్


సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీపీ రూరల్ శ్రీనివాస్, ఏసీపీ, సీఐ

మైలవరం: ఉభయ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రూరల్ డీసీపీ కె.శ్రీనివాస్ సూచించారు. మైలవరం శివారులోని సరిహద్దు గ్రామం మొర్సుమల్లి వద్ద ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు వద్ద రహదారిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం శ్రీనివాస్ సిబ్బందితో కలిసి తనఖీ చేశారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణ జరుగకుండా పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. ఇరువైపులా వచ్చి పోయే వారిని పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే విడిచి పెట్టాలన్నారు. అధిక మొత్తంలో నగదు ధ్రువీకరణ పత్రాలు లేకుండా రవాణ జరుగుతుంటే స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టులోని రికార్డులు తనిఖీ చేశారు. డీసీపీతో పాటు మైలవరం డివిజన్ ఏసీపీ మురళీమోహన్, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ హరిప్రసాద్ ఉన్నారు.

క్లుప్తంగా

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఆసిఫ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ శుక్రవారం లబ్బీపేట మొహిద్దీన్ ఎస్టేట్ ప్రాంతంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కాలనీలో నివసించే ముఫ్తీ ఫారూఖ్ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్న ఆసిఫ్‌ను నమాజు అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మైనార్టీలకు వైఎస్సార్ సీపీలోనే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీ ఆబిద్‌లతో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి జి.రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలోని పలు ఓవర్ హెడ్ ట్యాంకులను శుక్రవారం ఆయన శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రధాన గ్రామం, కాల్వగట్టు ప్రాంతాల్లో కలిపి మొత్తం నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు, వాటర్ పైప్‌లైన్ విస్తరణతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ. నాలుగు కోట్లతో గ్రామంలో సురక్షిత తాగునీటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంలో రెండు, కాల్వగట్టు ప్రాంతంలో మరో రెండు వాటర్ ట్యాంకులను నిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామం మొత్తం పైప్‌లైన్ విస్తరణ పనులు నిర్వహిస్తామని వివరించారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థినికి అస్వస్థత

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విలేజి కండ్రికకు చెందిన విద్యార్థిని బడుగు వర్షిణి ఆయాసంతో ఊపిరి ఆడక అస్వస్థతకు గురైంది. చీఫ్ సూపరింటెండెంట్ రవిప్రసాద్ వెంటనే సమీపంలోని విలేజి హెల్త్ క్లినిక్‌కు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఎం లక్ష్మీ పరీక్ష కేంద్రానికి వచ్చి విద్యార్థినికి గ్యాస్ టాబ్లెట్‌ను వేశారు. అనంతరం గ్రామంలోని 108 కేంద్రం సిబ్బంది వచ్చి విద్యార్థినిని వ్యానులో ఎక్కించి ప్రాథమిక వైద్యం అందించారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న ఆ విద్యార్థిని యథావిధిగా పరీక్ష రాసింది. అనంతరం నందిగామ, తిరువూరు డెప్యూటీ విద్యాశాఖాధికారి వెంకటయ్య పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. 212 మంది విద్యార్థులకు గాను 195 మంది పరీక్షకు హాజరయ్యారు.

దంపతులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: దంపతులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన లావు మల్లేశ్వరి, ఆమె భర్త మాధవరావు ఆ కాలనీలో నివసిస్తున్నారు. అయితే మాధవరావు కాలనీ వాసులతో మాట్లాడుతున్న సమయంలో కాలనీ వాసి బొద్దులూరి వెంకటేశ్వరరావు వచ్చి అకారణంగా మాధవరావుతో గొడవపడి దౌర్జన్యం చేశాడు. ఇంతలో మాధవరావు భార్య మల్లేశ్వరి భర్తను తీసుకుని ఇంటికి వచ్చేసింది. వెంకటేశ్వరరావు వాకింగ్ చేసే సమయంలో మల్లేశ్వరిని ఉద్దేశిస్తూ నీ భర్త మాధవరావు ఎక్కడ ఉన్నాడని, అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బాబా మందిరం నిత్యాన్నదానంకు రూ.50వేలు విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానంకు శుక్రవారం దాత కరణం సుబ్బారావు రూ.50వేలు విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో బాబా మందిరాన్ని ఆంధ్రా షిర్డీగా తీర్చిదిద్దామన్నారు. షిర్డీలో మాదిరిగా అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దాత కరణం సుబ్బారావు మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలలో తానూ కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో విరాళం అందజేస్తున్నానన్నారు. మందిరంలో నిర్వహించే ఏ కార్యక్రమానికి అయినా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి ప్రసాదం, శేషవస్త్రంతో దాతను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, మందిర సభ్యులు పాల్గొన్నారు.

తూర్పులో రహదారులు మిలమిల..

- అన్ని డివిజన్లలో కాలనీలు శరవేగంగా అభివృద్ధి
- రూ.140 కోట్లతో మౌలిక సదుపాయాలు
- సీసీ, బీటీ రోడ్లతో పాటు సైడు డ్రెయిన్‌లు ఏర్పాటు
- ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందిన రహదారులు



కనకదుర్గనగర్ మెయిన్‌రోడ్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమర్థుడైన నాయకుడు ఉంటే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో ఈ నాలుగున్నరేళ్లలో చేసి చూపించారు. ప్రచారం కోసం షో పాలిటిక్స్ కాకుండా, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడుంటే నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందో తూర్పును చూస్తే తెలుస్తుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఏకంగా రూ.650 కోట్ల మేరకు అభివృద్ధి జరిగింది. కేవలం రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కోసమే రూ.140 కోట్లు ఖర్చు చేశారు. ఒకప్పుడు గుంతలమయంగా, వర్షం వస్తే నీళ్లు నిలిచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉండే కాలనీల్లోని రోడ్లు, నేడు రివ్వున దూసుకుపోయే విధంగా అభివృద్ధి చెందాయి. దీనివెనుక వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కృషి ఉందని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

కాలనీలు బాగుపడ్డాయి...

ఒకప్పుడు మూడో డివిజన్‌లోని కనకదుర్గనగర్,



కరెన్సీనగర్ రోడ్డు

కరెన్సీనగర్, కామినేని నగర్ వెళ్లాలంటే రోడ్లు దుమ్ము కొట్టుకుపోయేవి. వర్షం వస్తే నీరు నిలిచి ఇబ్బందులు పడేవాళ్లు. ఇప్పుడు అవన్నీ బీటీ, సిమెంటు రోడ్లు వేశారు. ఆ డివిజన్‌లో సుమారు రూ.18 కోట్ల మేరకు అభివృద్ధి జరిగింది. నాలుగో డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీలో ఒకప్పుడు రోడ్లు గుంతల మయంగా ఉండేవి. దేవినేని అవినాష్ చొరవతో రూ.4.50 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు వేశారు.

మౌలిక సదుపాయాలకు రూ.140 కోట్లు

కాలనీలో రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా రూ.140 కోట్లు వెచ్చించారు. అందులో పెద్ద మొత్తంగా రోడ్డు నిర్మాణాలకు ఖర్చు చేయగా, మంచినీటి సరఫరా, యూజీడీ లైన్లు, సైడు డ్రెయిన్ నిర్మాణ పనులు కూడా చేశారు. కొండ ప్రాంతాల్లో మెట్లు నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు.

కాలనీలు అభివృద్ధి చెందాయి



గతంలో కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా ఉండి ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. కాలనీల్లో రోడ్లు వేయాలని ఎమ్మెల్యే వద్దకు వెళితే పట్టించుకోక పోవడంతో దేవినేని అవినాష్‌ను కలిశాం. ఆయన చొరవతో కాలనీల్లో రోడ్లన్నీ సీసీ, బీటీ రోడ్లు వేయించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న నాయకుడు దేవినేని అవినాష్.

–గల్లా రవి, 4వ డివిజన్

ఎన్నడూ చేయనంత అభివృద్ధి



తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు, రోడ్లు, డ్రైన్‌లు వంటి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి చేశారు. గతంలో పాలకులు మాటలు చెప్పడమే కానీ పనులు చేయలేదు. నేడు ఇచ్చిన హామీ ప్రతి ఒక్కటీ నెరవేర్చి చిత్తశుద్ధి చాటుకున్నారు.

–బాలబోయిన మల్లేశ్వరరావు, కృష్ణలంక

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఇందిరానగర్–1, 2, వినోద్ పబ్లిక్ స్కూల్ రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్, నేతాజీ రోడ్, చౌడేశ్వర కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, రావి సుబ్బయ్య కాలనీ, కోడూరు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

పెనమలూరు: పోరంకిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. పెనమలూరు సెంటర్, రామాపురం కాలనీ, సాలిపేట, డొంక రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రసాదంపాడులో ఆశ్రమం రోడ్డు, శాస్త్రి వీధి, ఆంధ్రాబ్యాంకు ఏరియా, ఎనికేపాడులో కొడాలివారి వీధి, డీమార్ట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

తూర్పులో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

గడప గడపకు మీ అవినాష్ అన్న కార్యక్రమంలో దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవినేని క్రాంతి 10వ డివిజన్‌లోని న్యూ పీ అండ్ టీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దేవినేని క్రాంతి మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షపాతి అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసి, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

4వ డివిజన్‌లో దేవినేని సుధీర పర్యటన

దేవినేని అవినాష్ సతీమణి సుధీర 4వ డివిజన్‌లోని లయోలా గార్డెన్స్ ప్రాంతంలో గడప గడపకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ నవరత్నాలు పక్కాగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందరూ అండగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో



10వ డివిజన్ పీ అండ్ టీ కాలనీలో పర్యటిస్తున్న దేవినేని క్రాంతి



4వ డివిజన్ లయోలా గార్డెన్స్‌లో పర్యటిస్తున్న దేవినేని సుధీర

తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన దేవినేని అవినాష్ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాల్గవ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్‌లతో పాటు కాలనీ వాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నగరంలో రజాకార్ చిత్ర యూనిట్ సందడి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రజాకార్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర విజయోత్సవంలో భాగంగా గవర్నర్‌పేటలోని అప్సర థియేటర్ వద్దకు చిత్ర యూనిట్ చేరుకుంది. యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. దర్శకుడు యాట సత్యనారాయణ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం జరిగిన వాస్తవ ఘటనలను తెరకెక్కించినట్లు తెలిపారు. నిజాం హయాంలో జరిగిన అకృత్యాలను చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించామన్నారు. రజాకార్ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతోందన్నారు. చిత్రాన్ని ప్రజలు బాగా ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలను ఆదరిస్తారనడానికి రజాకార్ చిత్రమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నటీ నటులు ఇంద్రజ, రాజ్ అర్జున్, అనసూయ భరద్వాజ్, సహ నిర్మాత పోతిరెడ్డి అంజిరెడ్డి, పంపిణీ సంస్థ భువనేశ్వరి పిక్చర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెల్లి కాలనీని 'గద్దే' పట్టించుకోలేదు

- అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే అసత్య ప్రచారం
- తూర్పు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పటమటలోని రెల్లి కాలనీలో సమస్యలను పదేళ్లుగా అసలు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ ఆరోపించారు. నియోజకవర్గంలో ఆయన చేసిందేమీ లేక, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఇటీవల ఇళ్ల స్థలాలు రెగ్యులరైజేషన్ చేయగా, పటమట 11వ డివిజన్‌లోని రెల్లికాలనీ పట్టాలు కూడా రెగ్యులరైజ్ అయ్యాయి. దీంతో ఆ కాలనీ వాసులు శుక్రవారం దేవినేని అవినాష్‌కు ఘన సత్కారం చేశారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ ఈ కాలనీలో పదిహేనేళ్ల కిందట తన తండ్రి దేవినేని నెహ్రూ ఉన్న సమయంలో అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఇప్పుడు కాలనీ వాసుల పట్టాలు రెగ్యులరైజేషన్ చేయడం చాలా



దేవినేని అవినాష్‌ను సత్కరిస్తున్న రెల్లికాలనీ ప్రజలు

సంతోషంగా ఉందన్నారు. పదేళ్లుగా తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న గద్దే రామ్మోహన్ ఈ కాలనీకి ఏం చేశాడో చెప్పుకోవడానికి కూడా ఏమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామని, ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోందన్నారు. దశాబ్దాలుగా ఉన్న ఇళ్ల పట్టాల సమస్య కూడా పరిష్కరించామని, ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

పంచభూతాలతోనే మానవ మనుగడ

సిద్ధార్థలో ఘనంగా ధరిత్రి దినోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాల వలనే మానవ మనుగడ సాధ్యమవుతోందని భారత ప్రభుత్వ జల వనరుల మంత్రిత్వ శాఖ జల్ జీవన్ మిషన్ ప్రతినిధి అంగద వర ప్రసాదరావు చెప్పారు. సిద్ధార్థ కళాశాల గ్రీన్ క్లబ్, వాటర్ కన్జర్వేషన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలోని సెమినార్‌హాలులో శుక్రవారం సభ జరిగింది. వరప్రసాదరావు మాట్లాడుతూ నీటి వనరులు లేకుండా భూమిపై మనిషికే కాదు ఏ ప్రాణికీ మనుగడ ఉండదని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు మాట్లాడారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నాటారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌తో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసనగర్, శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ సర్వీస్ రోడ్డుల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఆస్తి పన్ను బకాయి వెంటనే చెల్లించాలి



కానూరు సచివాలయం-4 తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కానూరు సచివాలయం–4లో ఆస్తి పన్ను బకాయి ఎక్కువగా ఉందని, సచివాలయ సిబ్బంది పన్ను బకాయి వసూళ్లు చేయాలని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు సచివాలయం–4ను శుక్రవారం కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం–4లో ఆస్తి పన్ను బకాయి రూ. 44,08,373 ఉందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున సచివాలయ సిబ్బంది టీమ్‌గా ఏర్పడి ప్రభుత్వం ఆస్తి పన్నుపై ఇచ్చిన వడ్డీ రాయితీపై అవగాహన కల్పించాలని సూచించారు. బకాయి ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ జరుగుతుందన్నారు. మొండి బకాయిలు ఉంటే రెడ్ నోటీసులు జారీ చేసి ఈనెల 31 నాటికి చెల్లించే విధంగా చూడాలన్నారు.

టీడీపీ బండ్లకు ఎన్నికల నియమావళి వర్తించదా?



పెద్దివారి వీధిలో దర్శనమిస్తున్న గద్దె రామ్మోహన్ వితరణ చేసిన రిక్షా బండి



అవినాష్ వితరణ చేసిన బండ్లకు తెలుపు రంగు వేసిన వైనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి వారం రోజులైనప్పటికీ విజయవాడ కృష్ణలంకలో మాత్రం నిబంధనలు అమలు కావడం లేదు. కోడ్ అమలులో ఉన్నందున జీవనోపాధి నిమిత్తం వివిధ రాజకీయ పార్టీల నాయకులు పేదలకు ఇచ్చిన అన్ని బండ్లకు కూడా ఆయా పార్టీలకు చెందిన రంగులు చెరిపేసి వేరే రంగు వేయాలి. అందులో భాగంగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ వితరణ చేసిన బండ్లకు ఆ పార్టీ రంగులపై తెలుపు రంగు వేశారు. కానీ, టీడీపీ నాయకుడు గద్దె రామ్మోహన్ వితరణ చేసిన రిక్షా బండ్లకు మాత్రం రంగు మార్చకుండా వదిలేశారు. 21వ డివిజన్, పెద్దివారి వీధిలో టీడీపీ రంగులతోనే దర్శనమిస్తుండడంపై వైఎస్సార్ సీపీ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ బండ్లకు వర్తించిన ఎన్నికల నియమావళి టీడీపీ బండ్లకు ఎందుకు వర్తించదంటూ ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు పాలనా విధానాలపై అవగాహన పెంపొందించుకుని భవిష్యత్‌లో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో శుక్రవారం బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై జాతీయ స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని, మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థితిలో ఉండాలని కోరారు. విద్యార్థులు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలో పాలనా విధానంపై నైపుణ్యాన్ని కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలంటే క్రమశిక్షణతో కూడిన పాలనా విధానాన్ని అలవరుచుకోవాలని కోరారు. విద్యార్థులకు పాలనా వ్యవహారాలపై అవగాహన కల్పించే దిశగా



సావనీర్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న రామ్మోహనరావు తదితరులు

ఇటువంటి సదస్సులు దోహదపడతాయని చెప్పారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్‌పై సావనీర్ బుక్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, బీబీఏ విభాగాధిపతి శ్రావణ్ కుమార్, ప్రొఫెసర్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



హలీమ్ రుచి చూస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్ తదితరులు



పంజా సెంటర్ దర్గాలో చాదర్‌ను సమర్పిస్తున్న నాని, ఆసిఫ్

- విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని నాని
- స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి పర్యటన
- పాతబస్తీలోని హలీమ్ స్టాల్స్ వద్ద సందడి
- పంజా సెంటర్‌లో దర్గాను దర్శించుకుని చాదర్ సమర్పణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసం నగరంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని నాని అన్నారు. పాతబస్తీలోని పంజా సెంటర్‌లో ఏర్పాటు చేసిన హలీమ్ దుకాణాలను, ఆ ప్రాంతంలో పలువురు ముస్లిం ప్రముఖులను కేశినేని నాని, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి శుక్రవారం రాత్రి సందర్శించారు. పంజా సెంటర్‌లో ఉన్న లోటే బాబా దర్గాను దర్శించుకుని ఆసిఫ్‌తో కలిసి చాదర్ సమర్పించారు. స్థానిక పార్టీ నేత బాషికి చెందిన హలీమ్ దుకాణంలో పార్టీ నాయకులతో కలిసి హలీమ్‌ను రుచి చూశారు. పాతబస్తీలోని ముస్లిం నాయకులతో ముచ్చటించారు. అనంతరం స్థానికులను పలకరిస్తూ ముందుకు సాగారు. పలువురు దుకాణదారులు, పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు ఆయా దుకాణాల్లో కొద్దిసేపు కూర్చుని సందడి చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వన్‌టౌన్ మత సామరస్యాన్ని చాటే విధంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తుందన్నారు. ఆసిఫ్‌తో కలిసి పాతబస్తీలో ముస్లింలను కలవటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పాతబస్తీ కులమతాలకు అతీతమైనది : ఆసిఫ్

పాతబస్తీ కులమతాలకు అతీతమైన ప్రాంతమని షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీలో అన్ని మతాలు, కులాల వారు చక్కని సోదరభావంతో జీవిస్తున్నారని చెప్పారు. రంజాన్ మాసంలో అందరూ ఇక్కడకు వచ్చి హలీమ్ రుచులు చూసి వెళ్తుంటారన్నారు. రంజాన్ మాసంలో ఈ ప్రాంతమంతా హైదరాబాద్‌ను తలపించే రీతిలో ఉంటుందన్నారు. రంజాన్ మాసం ప్రజలందరికీ మంచి చేయాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు.

- పెనమలూరు: యనమలకుదురులో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలోశుక్రవారం ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ మహానందీశ్వరస్వామికి అభిషేకం చేశా రు. నందీశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వర స్వామి వారి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 23-3-2024





పిచ్చుకా క్షేమమా

ఐ లవ్ స్పారోస్!!

మనిషి తన సౌకర్యం కోసం ప్రకృతి సమతుల్యతకు విఘాతం కలిగిస్తూనే ఉంటాడు. ప్రకృతి సహనంతో ఓర్చుకుంటూ, అప్పుడప్పుడూ విలయం రూపంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉంటుంది. మొత్తంగా తనను తాను సమతుల్యం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. 'మాయమైపోతున్నదమ్మ మనిషన్నవాడు'... అని పిచ్చుకలు ఆవేదన చెందుతున్న సమయంలో ప్రకృతిఓ అమ్మాయి మనసును కదిలించింది. ఆమె ఇప్పుడు పక్షి ప్రేమికురాలైంది. తన ఇంటిని పక్షులకు విలాసంగా మార్చింది. తాను పక్షి ప్రేమికురాలిగా మారిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు మంచాల హరిణి.


హరిణి

అడవికి దాహం వేసింది!

''అప్పుడు నేను బీబీఏ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను. అమ్మా నాన్న, నేను, అక్క అందరం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న మా పెద్ద నానమ్మ వాళ్ల ఊరికి వెళ్తున్నాం. నిర్మల్ దాటి కడెం మీదుగా అడవిలో ప్రయాణిస్తున్నాం. మే నెల కావడంతో ఎండ తీవ్రంగా ఉంది. చెట్ల మొదళ్లు ఎండిపోయి వానల కోసం ఎదురు చూస్తున్నాయి. ఓ పక్షి మా కళ్ల ముందే చెట్టుకొమ్మ మీద నుంచి జారి నేల మీద పడింది. కొద్ది సెకన్లపాటు రెక్కలు కొట్టుకున్నాయి. కారాపి వెళ్లి చూశాం, పక్షిని చేతుల్లోకి తీసుకుని మా దగ్గరున్న నీటిని చల్లి, తాగించడానికి ప్రయత్నించాం. కానీ ఆ పక్షి అప్పటికే ప్రాణాలు వదిలేసింది. ఆ చిన్న ప్రాణికి ఎన్ని నీళ్ల కావాలి, ఆ గుక్కెడు నీళ్లు లేకనే కదా ప్రాణం పోయిందని చాలా బాధేసింది. ఆ దృశ్యం పదే పదే కళ్ల ముందు మెదలసాగింది. ఇలాగ ఒక్కో వేసవికి ఎన్ని పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయో కదా... అనిపించింది. ఏదైనా చేయాలనిపించింది. కానీ ఏం చేయాలనేది వెంటనే స్ఫురించ లేదు.

పిచ్చుకలు వచ్చాయి!

పక్షులకు నీటికోసం ఇంటిముందు చిన్న పాత్రలో నీటిని పెట్టడం మొదలు పెట్టాను. పావురాలు ఇతర పక్షుల కంటే పిచ్చుకలే ఎక్కువగా రాసాగాయి. దాంతో పర్మినెంట్ సొల్యూషన్ కోసం ఆలోచించిస్తున్నప్పుడు పిచ్చుకల సైజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్స్ డిజైన్ చేశాను. ఇందుకోసం ఇంటర్‌నెట్‌లో చాలా సెర్చ్ చేశాను. మహారాష్ట్ర, నాసిక్‌లోని ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడి నాక్కావలసిన డిజైన్‌ను వివరించాను. వాళ్లు రఫ్ తయారు చేసి వాట్సాప్‌లో పంపించేవారు.


'బర్డ్ ఫీడర్ బాక్స్' పంపిణీ చేస్తున్న హరిణి (కుడివైపు)

ప్లాస్టిక్ డబ్బాకు కిటికీల్లాగ ఓపెన్‌గా ఉంచి చిన్న ప్లాస్టిక్ రాడ్‌ను పెట్టించాను. పక్షి ఆ రాడ్ మీద నిలబడి, తెరిచి ఉన్న కిటికీలో ముక్కు పెట్టి గింజలను తింటుంది. నీటి కోసం డబ్బా కింద సాసర్ పెట్టించాను. నాకు సంతృప్తి కలిగే వరకు డిజైన్‌ను మారుస్తూ చేసిచ్చారు వాళ్లు. ఐదేళ్ల కిందట ఇదే తొలి డిజైన్. మొదట వంద పీస్‌లు చేయించి బంధువులు, స్నేహితులకిచ్చాను. తర్వాత అందరూ అడుగుతుండడంతో పెద్ద మొత్తంలో చేయిస్తున్నాం. తాతయ్య పేరుతో 'మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్' ద్వారా అందరికీ పంచుతున్నాం. ఒక మంచి పని చేయడం, అది కూడా మా తాతయ్య పేరుతో చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికి రెండువేలకు పైగా ఇలాంటి డబ్బాలను పంచాను. ఇప్పుడు నేను యూఎస్‌లో పీజీ చేస్తున్నాను. నేను మొదలు పెట్టిన పనిని మా నాన్న కొనసాగిస్తున్నారు. మా చేతిమీదుగా ఈ బర్డ్ ఫీడర్ బాక్స్‌లు అటు ఆదిలాబాద్, నాందేడ్ వరకు, ఇటు హైదరాబాద్, సూర్యాపేట, గుంటూరుకు కూడా చేరాయి. ఈ బాక్స్ కావాలని ఎవరడిగినా వాళ్ల అడ్రస్ పంపిస్తే చాలు కొరియర్ చార్జ్‌లు కూడా మేమే భరించి ఉచితంగా పంపిస్తాం. వంద మాటలు చెప్పడం కంటే ఒక మంచి పని చేయడం మేలని నమ్ముతాను. ఐదేళ్ల నుంచి ఈ పని చేస్తున్నప్పటికీ నేను ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. ఐ లవ్ స్పారోస్ అనేది ఈ ఏడాది వరల్డ్ స్పారో డే (మార్చి 20)సందర్భంగా ప్రపంచం ఇచ్చిన పిలుపు. కానీ నేను పిచ్చుకలను ప్రేమించడం ఎప్పుడో మొదలైంది. నేను అందరినీ కోరుకునేది ఒక్కటే. ఆ చిన్న ప్రాణుల కోసం రోజూ ఓ లీటరు నీటిని పెడదాం'' అన్నారు మంచాల హరిణి.

– వాకా మంజులారెడ్డి

చుక్క నీరుంటే చాలు!

గుప్పెట్లో పట్టుకుంటే నిండా గుప్పెడంత కూడా ఉండదు. పిచ్చుకంత ప్రాణం. రేడియేషన్ బారిన పడి అల్లాడిపోతోంది. అభివృద్ధి పేరుతో మనిషి చేసే అరాచకానికి భయపడిపోతోంది. మనిషి కంటపడకుండా పారిపోతోంది. ఏకంగా ఈ భూమ్మీద నుంచే మాయమైపోదామనుకుంటోంది. మనసున్న మనిషి కరవైన నేల మీద తనకు మనుగడ లేదని ఊరు వదిలి పారిపోయింది. అడవుల బాట పట్టి ఏ చెట్టుకొమ్మనో తనను తాను దాచుకుంటూ నీటిచుక్క కోసం వెతుక్కుంటోంది. మనిషి మనసులో ఆర్ద్రత, గుండెలో తడి ఉందని తెలిసిన పిచ్చుక మళ్లీ రెక్కలు టపటపలాడిస్తోంది. వందలాది బంధుగణంతో నిజామాబాద్‌లో మంచాల హరిణి ఇంటి ముందు కొలువుదీరింది. ఈ మాత్రం ఆలంబన దొరికితే చాలు... కిచకిచలతో ఊరంతటికీ వీనులవిందు చేస్తానంటోంది పిచ్చుక.

చిరుతలు

ధైర్యంగా ఉండమని చెప్పడం అందరూ చేసే పనే.
ధైర్యాన్ని ప్రదర్శించడం కొందరు చేసేది.
ప్రమాదంలోనూ ధైర్యాన్ని చూపడం అతి కొద్ది మందే చేస్తారు.
ఆ అతి కొద్దిమందిలోనూ మేటిగా నిలుస్తున్నారు
హైదరాబాద్‌లోని బేగంపేట వాసులైన ఈ తల్లీ కూతుళ్లు.
ఇంట్లోకి అకస్మాత్తుగా చొరబడిన ఆగంతకులపైకి
చిరుతపులుల్లా విరుచుకుపడ్డారు.
మారణాయుధాలతో బెదిరించినా ఆత్మస్థైర్యాన్ని బెదరనివ్వలేదు.
ఇద్దరు దండుగులను తరిమి తరిమి కొట్టిన తల్లి అమిత మెహోత్.
తల్లిని కాపాడుకునేందుకు దుండగులతో వీరోచితంగా పోరాడిన కూతురు బాబీ.


బాబీ


అమిత, బాబీలను సత్కరిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

దుండగులు ఎలా ఎప్పుడు ఎక్కడ నుంచి వస్తారో, ఎలా దాడి చేస్తారో మనం ఊహించలేం. అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో తెలియక ధనాన్నే కాదు ప్రాణాలను సైతం కోల్పోయేవారెందరో. కానీ, ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దుండగుల దుశ్చర్యను క్షణమాత్రంలోనే గుర్తించి, ఆ వెంటనే తమ స్థైర్యాన్ని చూపి నేడు ఎంతో మంది ప్రశంసలు అందుకుంటున్నారు అమిత, బాబీ. స్త్రీలు సబలలు అని నిరూపించిన ఈ వనితలు నేడు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

''ఎప్పుడో ప్రాక్టీస్ చేసిన బాక్సింగ్‌తో పాటు 15 ఏళ్లుగా చేస్తున్న జిమ్ వ్యాయామాలు, వీటికి తోడు మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన.. ఇవన్నీ దుండగులు తుపాకీ గురి పెట్టినా ఏమాత్రం బెదరక ధైర్యంగా నిలబడేలా చేశాయి. దోచుకోవడానికి వచ్చిన వారిని తరిమి కొట్టేలా చేశాయి'' అని తెలిపింది నలభై ఆరేళ్ల అమిత. ఊహించని విధంగా ఆ తల్లీకూతుళ్ల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో దుండగులు కాళ్లకు బుద్ధి చెప్పాల్సి వచ్చింది.

కొరియర్ బాయ్స్ వేషంలో..

ఆన్‌లైన్ అమ్మకాలు పెరిగాక కొరియర్ బాయ్స్ మన ఇళ్ల ముందుకు వస్తుంటారు. వారి గురించి మనకేవిధంగానూ తెలియదు. అలాగని, కొరియర్ వారంతా ప్రమాదకారులే అని మనం చెప్పలేం. కానీ, ఒక్కోసారి సమస్య ఈ విధంగానూ మనల్ని పలకరించవచ్చు అని గ్రహించాలి అనడానికి గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన మన కళ్లకు కడుతుంది. ''మా ఇంటి గుమ్మానికి, ప్రధాన గేటుకు 200 ఫీట్ల దూరం ఉంటుంది. కొరియర్‌బాయ్స్ ఎవరొచ్చినా గేటు బయటనే ఉండి పిలుస్తారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్యాగ్‌తో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు హెల్మెట్ ధరించి ఉండగా మరొకరు మాస్క్ ధరించి ఉన్నారు. నేను మొదటి అంతస్తులోనే ఉండి కొరియర్ వివరాలు అడిగాను. అమిత (నా పేరు), ఎస్‌కె జైన్ (నా భర్త) పేర్లు చెప్పి కొరియర్ వచ్చిందని చెప్పారు. అక్కడే ఉండాలని, వచ్చి తీసుకుంటామని చెప్పాను. నేను కిందికి వచ్చేసరికి గేటు లోపలి నుంచి గుమ్మం వద్దకు వచ్చేశారు.

ఎదుర్కొని .. కనిపెట్టి..

బ్యాగ్‌లో నుంచి కొరియర్ పార్శిల్ తీస్తున్నట్లుగా తీసి ఒకరు తపంచా (నాటు తుపాకీ)తో నాపై ఎక్కుపెట్టాడు. మరొకరు నన్ను తోసుకుంటూ లోపలికి వచ్చి కిచెన్‌లో ఉన్న పనిమనిషి మెడపై కత్తి పెట్టాడు. నా అరుపులకు మొదటి అంతస్తులో ఉన్న కుమార్తె కూడా వచ్చింది. మాపై అటాక్ చేస్తుండగా మేం కూడా తిరిగి అటాక్ చేశాం. ఇద్దరం కలిసి ఆ వ్యక్తి చేతులను గట్టిగా పట్టుకుని వెనక్కి తిప్పి, తపంచాను లాగేసుకున్నాం. దీంతో అచేతనుడైన ఆ వ్యక్తి వెంట తెచ్చుకున్న తాళ్లతో మమ్మల్ని కట్టేసేందుకు ప్రయత్నించగా, ఎదురుతిరిగాం. దాదాపు 20 నిమిషాల సేపు ఘర్షణ జరిగింది. చివరకు ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. మమ్మల్ని బలవంతంగా తోసుకుంటూ బయటకు వచ్చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మేము ఎంతగానో వెంబడించాం. ఆ వ్యక్తి పారిపోయాడని తెలుసుకుని కిచెన్‌లో ఉన్న మరో వ్యక్తి ఎక్కడ దొరికిపోతాడో అని ఆందోళనపడ్డాం. అతను కూడా పారిపోయేందుకు కత్తితో బెదిరిస్తూ బయటకు వచ్చాడు. మా అరుపులకు ఈ లోగా స్థానికులు రావడంతో అతన్ని పట్టుకోగలిగాం. తెలిసిన వారే అయ్యుంటారని మేం వారు ధరించిన హెల్మెట్, మాస్క్‌ను తీసేయడంతో వారెవరో కనిపెట్టగలిగాం. కిందటేడాది దీపావళి సమయంలో పది రోజులపాటు మా ఇంటి క్లీనింగ్ విషయంలో ఓ ఏజెన్సీని సంప్రదిస్తే, వారు పంపించిన వ్యక్తులే వీళ్లు. మా ఇంటిని క్లీన్ చేసే సమయంలో ఏయే వస్తువులు ఎక్కడ ఉన్నాయో గమనించి, ఇంట్లో ఆడవాళ్లం మాత్రమే ఉండే సమయం చూసి, ఇలా దొంగతనం చేయడానికి ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. మేం ఎదురు తిరగడంతో వచ్చిన పని గురించి కాకుండా మేము తమ ముఖాలను చూడకుండా కాపాడుకునేందుకే ఎక్కువ ప్రయత్నం చేశారు.

ఆత్మరక్షణకై మెలకువలు అవసరం

మహిళలు ఆత్మరక్షణ దిశగా మెలకువలను నేర్చుకోవాలి. ఇప్పుడు నా జీవితంలో ఎదురైన అనుభవం లాగా ఎవరి జీవితాల్లోనూ రాకూడదని కోరుకుంటాను. ఒక వేళ వస్తే మాత్రం అందుకు సిద్ధంగా ఉండాలి. ధైర్యంగా ముందడుగు వేయాలి.

– అమిత



ఆ ధైర్యం ఎలా వచ్చిందంటే..

గతంలో ఐదేళ్లు బాక్సింగ్ ప్రాక్టీస్ చేశాను. రోజూ జిమ్‌కు వెళ్తుంటాను. మార్షల్ ఆర్ట్స్‌పై కూడా అవగాహన ఉంది. అవే నన్ను ధైర్యంగా ఉండేలా, సాహసం చూపేలా చేశాయి. ఎదురొచ్చిన విపత్తు నుంచి కాపాడేలా చేశాయి. ఒక తపంచా, రెండు కత్తులు, తాళ్ల సహాయంతో వారు మమ్ముల్ని లొంగదీసుకునేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. వారి ప్రతి చర్యను తిప్పికొట్టగలిగామంటే బాక్సింగ్, ఫిట్‌నెస్‌లే కారణమని కచ్చితంగా చెప్పగలను'' అని తామ ఎదుర్కొన్న సంఘటనను వివరించారు అమిత.

ఈ తల్లీకూతుళ్లు దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ ఘటన తర్వాత అమిత, ఆమె భర్త, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

డీసీపీ ప్రశంసలు.. సన్మానం..

అమిత, ఆమె కుమార్తె బాబీ ఇద్దరూ చూపిన ధైర్యసాహసాలు ఆదర్శప్రాయం అని నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బేగంపేట పైగా కాలనీలోని అమిత నివాసానికి నేరుగా వచ్చిన డీసీపీ అమితతో పాటు ఆమె కుమార్తెనూ ప్రశంసించి, శాలువాతో సత్కరించారు. మైనర్ బాలిక అయినా ఆమె చూపిన తెగువ ఎంతో అభినందనీయమన్నారు.

– కోట కృష్ణారావు, సాక్షి, హైదరాబాద్

బ్యూటిప్స్

పార్లర్‌తో పని లేదు...

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.



- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ముఖంపైన అద్దాలి. తరువాత చేతులతో సున్నితంగా మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలోవెరా జెల్ వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.
- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.



ఇంటిప్స్

సీలింగ్ ఫ్యాన్ ఇలా శుభ్రం

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లను ఎక్కువ ఎత్తులో అమర్చుతారు. అందువల్ల వాటిని తరచు శుభ్రం చేయడం చాలా కష్టం. అలాగని నెలల తరబడి అలాగే ఉంచేస్తే మురికి పేరుకుని పోయి అసహ్యంగా కనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలను కవర్ చేయాలి. కవర్ పైభాగం నుంచి మీ చేతులతో రుద్దాలి. అదేవిధంగా, మూడు రెక్కలను శుభ్రం చేయాలి. మట్టి కూడా కవర్‌లో పడిపోతుంది. ఇది మీ ఇంటిని కూడా మురికిగా చేయదు.

మరో పద్ధతి...

పాత షర్ట్, టీషర్ట్ లేదా ఏదైనా కాటన్ వస్త్రం సహాయంతో ఫ్యాన్‌ను శుభ్రం చేయవచ్చు. ఫ్యాన్ మీద పొడి దుమ్ము ఉంటే.. అది సులభంగా ఒక వస్త్రంతో శుభ్రం చేసుకోవచ్చు. ఒకవేళ వంటగదిలో ఉండే ఫ్యాన్‌ను క్లీన్ చేస్తున్నట్లయితే.. దానిపై నూనె, ధూళి పేరుకుపోయి ఉంటుంది. అటువంటి వాటిని సబ్బుతో కడగడం మంచిది. కాసేపు రెక్కలను స్క్రబ్ చేయాలి.



గుర్తుంచుకోవాల్సింది..

ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరచాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు గ్లాసెస్ లేదా సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది చెత్తను కంట్లో పడకుండా చేస్తుంది. దీంతో అలర్జీ కూడా రాదు. సీలింగ్ ఫ్యాన్ శభ్రం చేసేటపుడు ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి.

హోలీ

రంగు పడే ఊళ్లు

తీర్థయాత్రలు చేస్తారు కొందరు. వర్ణయాత్రలు కొందరికి ఇష్టం. మన దేశంలో హోలి చాలా హుషారైన పండగ. బహుశా దీపావళి తర్వాత చిన్నా పెద్దా అందరూ కేరింతలతో పాల్గొనే పండగ ఇదే. రొటీన్ జీవితంలో రంగులను నింపుకోవడం బాగుంటుంది. అయితే కొందరికి ఇంట్లోనో, అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోనో, వీధిలో, ఏరియా చౌరస్తాలోనో ఆడే హోలీ పెద్దగా ఆనదు. వారికి భారీ హోలి వేడుక చూడాలనిపిస్తుంది. అలాంటి వారి కోసం హోలి డెస్టినేషన్స్ ఉన్నాయి. మన దేశంలో. ఈ హోలీకి వెళ్లగలిగితే వెళ్లండి.

మధుర:

ఉత్తరప్రదేశ్‌లోని మధురలో హోలి వేడుకలు చూడటం అంటే కృష్ణ రాధలు ఆడే హోలిని చూసినట్టే. ఇక్కడి బర్సానాలో స్త్రీలు గోపికల్లా, పురుషులు గోపబాలురలా అలంకరించుకుని హోలి ఆడతారు. రంగులు చల్లడానికి వచ్చిన గోపబాలురను స్త్రీలు సరదాగా బడితెలతో బాది దూరం తరుముతారు. అందుకే దీనిని 'లాత్‌మార్ హోలి' అంటారు.





బృందావన్:

ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు వెళితే అక్కడి బన్‌కె బిహారి ఆలయంలో పూలు, రంగులు కలిపి చల్లుకుంటూ కోలాహలంగా హోలి నిర్వహిస్తారు. అందుకే దీనిని 'పూల్‌వాలోంకి హోలి' అంటారు. ఇక్కడ ఒకరోజు రెండు రోజులు కాదు... వారం రోజులపాటు హోలి వేడుకలు జరుగుతునే ఉంటాయి. చుట్టుపక్కల పల్లెలు రంగులతో తెల్లారి రంగులతో అస్తమిస్తాయి. ఈ అద్భుతమైన వేడుకలను చూడానికి టూరిస్ట్‌లు వస్తారు.

ఉదయ్‌పూర్:

ఇక రాచరికస్థాయిలో హోలి చూడాలంటే రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు వెళ్లాలి. అక్కడి సిటీ ప్యాలెస్‌లో రాజ వంశీకుల హాజరీలో అద్భుతమైన హోలి వేడుకలు జరుగుతాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజస్థానీ జానపద కళల ప్రదర్శన ఉంటుంది. టూరిస్ట్‌లు ఈ వేడుకలు చూడటానికి తెగబడతారు.



హంపి:

తుంగభద్ర నది ఒడ్డున రంగుల పండగ ఎలా ఉంటుందో చూడాలంటే హంపి వెళ్లాలి. ఇక్కడ హంపి సందర్భంగా భారీగా అలంకరించి నిర్వహించే రథయాత్ర చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఈ సాంస్కృతిక క్షేత్రంలో హోలీ ఒక విచిత్ర భావన కలిగిస్తుంది. నగర ప్రజలు డోళ్లు మోగిస్తూ హోలి వేడుకల్లో విశేషంగా పాల్గొంటారు. విరూపాక్ష ఆలయం ఈ సందర్భంగా కళకళలాడిపోతుంది. దక్షిణాదివారు హోలీ సెలవు హంపిలో గడిపి ఆనందించవచ్చు.



శాంతినికేతన్:

పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో హోలి అయితే నయనానందమూ శ్రవణానందమూ కూడా. ఎందుకంటే అక్కడ హోలి అంటే రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు... నృత్యాలు, సంగీతం, కవిత్వం... అమ్మాయిలు అబ్బాయిలు కలిసి మనోహరంగా హోలి జరుపుకుంటారు. రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలెట్టిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఇక్కడకు వెళ్లి హోలి చూసినవారి హృదయం కచ్చితంగా రంగులతో నిండిపోతుంది.



ఆనంద్‌పూర్ సాహిబ్:

పంజాబ్‌లోని ఈ ఊళ్లో హోలీ రంగులకు కళ్లు చెదురుతాయి. నిహంగ్ సిక్కులు ఇక్కడ హోలి సమయంలో యుద్ధ విద్యలు ప్రదర్శిస్తారు. ఉత్తుత్తి పోరాటాలు ఇరు జట్ల మధ్య జరుగుతాయి. డోళ్లు తెగ మోగుతాయి. ఆట పాటల అట్టహాసం చూడతగ్గది.

